www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 313

గురువారం | 27-2-2025

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి ఉ. 8.55, అమావాస్య తె. 6.14 వరకు; నక్షత్రం: ధనిష్ఠ మ. 3.44 తదుపరి శతభిషం; వర్జ్యం: రా. 10.18-11.46; దుర్ముహూర్తం: ఉ. 10.31-11.17, మ. 3.11-3.57; అమృతఘడియలు: ఉ. 6.08-7.32; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.38; సూర్యాస్తమయం: 6.17

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బుధవారం అర్ధరాత్రి పాగాలంకరణలో శ్రీశైల మల్లన్న ఆలయం

శంభో శివ శంభో!

శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిట

శ్రీశైలంలో కనుల పండువగా మల్లన్న కల్యాణం

అంగరంగ వైభవంగా పాగాలంకరణ, ప్రభోత్సవం

త్రికోటేశ్వర స్వామికి లింగోద్భవ అభిషేకాలు

నిత్యాభిషేకమూర్తిగా వాయులింగేశ్వరుడి దర్శనం

ద్వారపూడిలో 60 అడుగుల ఆదియోగి విగ్రహావిష్కరణ

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా శైవక్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలివచ్చి స్వామికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. నంద్యాల జిల్లాలోని ప్రముఖ జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీశైలం

మిగతా 3వ పేజీలో...

శివరాత్రి స్నానాలకు వెళ్లి 9 మంది మృతి

గోదావరిలో మునిగి ఐదుగురు విద్యార్థులు మృత్యువాత 6

శ్రీశైలంలో కొడుకును రక్షించబోయి తండ్రీ..

బలివే దగ్గర తమ్మిలేరులో అన్నదమ్ములు..



రాజమహేంద్రవరంలోని కోటిలింగాల రేవు వద్ద గోదావరిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తజనం

పోసాని అరెస్ట్

హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న 'అన్నమయ్య' పోలీసులు



నాడు అడ్డగోలుగా రెచ్చిపోయి..

ఆనక సారీలు చెప్పుకొని..

జనసేన నేత ఫిర్యాదుతో పోసానిపై కేసు

రాష్ట్రవ్యాప్తంగా ఆయనపై పదికిపైగా కేసులు

వైసీపీ అధికారంలో ఉండగా నోటి దురుసు

చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌పై దూషణలు

ప్రెస్‌మీట్‌లు, డిబేట్లలో అడ్డగోలుగా బూతులు

అప్పట్లో ఫిర్యాదులపై స్పందించని పోలీసులు

కూటమి వచ్చాక పలుచోట్ల కేసులు నమోదు

అరెస్టు సమయంలో పోలీసులతో వాగ్వాదం

నోటీసులు ఇచ్చి అరెస్టు చేసిన అధికారులు

నేడు రాజంపేట కోర్టులో హాజరు!

అరెస్ట్ వేళ..



అరెస్ట్ సమయంలో హైదరాబాద్ ఇంట్లో పోసాని

అమరావతి/హైదరాబాద్/రాయచోటి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉండగా... టీడీపీ, జనసేన అగ్రనేతలపై పిచ్చిపిచ్చిగా రెచ్చిపోయి, అడ్డూ అదుపూ లేకుండా నోరు పారేసుకున్న సినీ నటుడు పోసాని కృష్ణ మురళిని పోలీసులు అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లా ఓబుళవారిపల్లె పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని మైహోం భూజా అపార్ట్‌మెంట్‌లో ఉన్న పోసాని కృష్ణ మురళి నివాసానికి వెళ్లి... నోటీసులు అందించి, అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లె ఎస్‌ఐ భక్తవత్సలం ఆధ్వర్యంలో నలుగురు పోలీసులు హైదరాబాద్‌లోని రాయదుర్గం పోలీసులను కలిసి... పోసాని కృష్ణ మురళిపై నమోదైన కేసు వివరాలను అందించారు. ఆయన అరెస్టుకు ఎస్కార్ట్ కల్పించాలని కోరారు. దీంతో... రాయదుర్గం ఠాణా నుంచి ఒక ఎస్‌ఐ, ఒక కానిస్టేబుల్ ఏపీ పోలీసులకు తోడుగా వెళ్లారు. రాత్రి 8.45 గంటల సమయంలో మైహోం భూజాలోని పోసాని నివాసానికి వెళ్లి, ఆయనను అరెస్టు చేశారు. ఆయనను గురువారం రాజంపేట కోర్టులో హాజరుపరిచే అవకాశముంది.

పోలీసులతో వాగ్వాదం...

అరెస్టు సమయంలో పోసాని పోలీసులకు సహకరించకుండా వాగ్వాదానికి దిగారు. 'నోటీసులు తీసుకోను. అరెస్టు చేసుకోండి. ఆడవాళ్ల మీద రౌడీయిజం చేస్తారా?' అంటూ నోరు పారేసుకున్నారు. 'మీరెవరు? ఎలా మా ఇంటికి వస్తారు?' అని ప్రశ్నించడంతో... తాము అన్నమయ్య జిల్లా పోలీసులమని ఎస్‌ఐ భక్తవత్సలం తెలిపారు. అరెస్టు చేస్తున్నాం... సహకరించండి అని కోరారు. "ముందు నాకు నోటీసు ఇవ్వండి. నేను ఆస్పత్రికి వెళ్లి ట్రీట్‌మెంట్ చేయించుకుని... తర్వాత మీ దగ్గరికి వస్తాను" అని పోలీసులకు సూచించారు. అలా కుదరదని, అరెస్టుకు సహకరించకపోతే తమ డ్యూటీ తాము చేయాల్సి వస్తుందని

మిగతా 11వ పేజీలో...



విశాఖ వస్త్ర దుకాణంలో సత్యవర్ధన్ (నీలం చొక్కా), ఏ9 యర్రంశెట్టి రామాంజనేయులు (టీ షర్టు), ఏ3 ఎతేంద్ర రామకృష్ణ (తెల్ల పూల చొక్కా)

వైఛీపీ సెల్ఫ్‌గోల్!

వంశీ ఉదంతంపై 'ఎక్స్'లో వీడియో

విశాఖలో స్వేచ్ఛగా షాపింగ్ చేస్తున్న సత్యవర్ధన్ అంటూ పోస్టు

కిడ్నాప్ అయినట్టు ఎలా చెబుతారంటూ ప్రశ్న

కానీ, పోలీస్ వాదననే సమర్థించిన వీడియో

ఆ వీడియోలో సత్యవర్ధన్ పక్కన ఏ3, ఏ9 నిందితులు

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ విషయంలో వైసీపీ పదే పదే సెల్ఫ్ గోల్ వేసుకుంటోంది. వంశీని అరెస్టు చేసిన దగ్గర నుంచి ఆయనకు మద్దతు పలికేందుకు ప్రయత్నించడం.. అది మిస్‌ఫైర్ కావడం సాధారణ వ్యవహారంగా మారిపోయింది. కిడ్నాప్ కేసులో నిందితుడిగా ఉన్న వంశీకి సంబంధించి మరో బలమైన

మిగతా 11వ పేజీలో...

వంశీకి పోలీసుల షాక్

గూగుల్ టేకవుట్ మ్యాప్ చూపించి విచారించడంతో ఉక్కిరిబిక్కిరి!

సత్యవర్ధన్ కిడ్నాప్ అనంతరం జగన్ నివాసానికి వెళ్లిన వంశీ 11

దీనిపై ప్రశ్నించగా వెళ్లలేదని జవాబు.. టేకవుట్‌లో వెళ్లినట్టు ఆధారాలు

దీంతో అవాక్కయిన మాజీ ఎమ్మెల్యే.. రెండో రోజు 5గంటలు విచారణ

మన సంగతేంటి భయ్యా?

నిర్మాత కేదార్ ఆకస్మిక మరణంతో అగ్ర హీరోల్లో ఉలికిపాటు



దుబాయ్‌లో నిర్మాణ, స్థిరాస్తి రంగాల్లో కేదార్ వ్యాపారాలు

వాటిల్లో వందల కోట్లు పెట్టిన హీరోలు, నిర్మాతలు, దర్శకులు

పెట్టుబడుల వివరాలు తెలియక వారిలో ఆందోళన

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): టాలీవుడ్ సినీ నిర్మాత సెలగంశెట్టి కేదార్ ఆకస్మిక మరణం తెలుగు సినిమా రంగానికి చెందిన ప్రముఖులు.. ముఖ్యంగా కొందరు అగ్ర హీరోల గుండెల్లో గుబులు రేపుతోంది. తెలుగు సినీ రంగానికి చెందిన కొందరు అగ్రహీరోలు, నిర్మాతలు, దర్శకులకు బినామీగా వ్యవహరిస్తూ.. వారికి చెందిన వందల కోట్ల రూపాయలతో కేదార్ దుబాయ్‌లో వ్యాపారాలు చేయడమే ఇందుకు కారణమని సమాచారం. కోట్లలో పెట్టుబడులు పెట్టిన ఆయా ప్రముఖులు.. కేదార్ ఆకస్మిక మరణంతో ఇప్పుడు తమ పరిస్థితేంటి? తమ డబ్బు సంగతి ఏంటి? అనే ఆందోళనలో ఉన్నారని సినీ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఏడాది క్రితం హైదరాబాద్‌లోని ర్యాడిసన్ హోటల్‌లో బయటపడిన డ్రగ్స్ కేసు అంశంలో కేదార్ పేరు ప్రముఖంగా వినిపించింది. ఆ తర్వాత కేదార్

మిగతా 11వ పేజీలో...

కేదార్‌ది అనుమానాస్పద మృతేనా?

ఇంకా దొరకని దుబాయ్ పోలీసుల క్లియరెన్స్ 11



ప్రజలందరికీ 2

పింఛను!

'కొత్త పెన్షన్ స్కీమ్'పై కేంద్రం కసరత్తు

60 ఏళ్లు దాటిన వారందరికీ వర్తింపు!

ఈపీఎఫ్‌వో ఆధ్వర్యంలో నిబంధనల రూపకల్పన.. త్వరలో అభిప్రాయ సేకరణ



ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న ఎన్‌డీఆర్ఎఫ్ సహాయక చర్యలు

ఆశలు ఆవిరి!

సొరంగంలో చిక్కుకున్న 8 మందిని ప్రాణాలతో తీసుకురావడం కష్టమే 12

సహాయక చర్యల బృందం సభ్యులు, ర్యాట్ హోల్ మైనర్స్ చెబుతున్నదిదే

టీబీఎం కటింగ్‌కు కంపెనీ ఒప్పుకోక వెలికితీతలో ఇన్ని రోజులూ ఆలస్యం?

నేర చరితులపై జీవితకాల నిషేధం..

పార్లమెంట్ పరిధిలోని అంశం

న్యాయ సమీక్ష పరిధిలో ఉండదు

సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్ 2

అమ్మకానికి అమెరికా

పౌరసత్వం!

రూ.43.5 కోట్లకు 'గోల్డ్ కార్డు'



డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన

ఉద్యోగకల్పనతో లింకు లేకుండా గ్రీన్‌కార్డ్

కాంగ్రెస్ అనుమతి అక్కర్లేదన్న వైట్‌హౌస్

ప్రస్తుతం ఉన్న 'ఈబీ-5' స్థానంలో కొత్తది

రూ.8.7 కోట్ల పెట్టుబడి, 10 ఉద్యోగాల కల్పనతో ఈబీ-5

కోటి గోల్డ్‌కార్డులతో రూ.43.5 కోట్ల కోట్లు ఆదాయమే లక్ష్యం

ఉద్యోగాల ఊచకోతకు ట్రంప్ మెమో

భారీగా సిబ్బంది తొలగింపునకు చర్యలు

మార్చి 13కి ప్రణాళికలు సమర్పించండి

వైట్‌హౌస్ నుంచి అన్ని ఫెడరల్ ఏజెన్సీలకూ అందిన మెమో

వాషింగ్టన్, ఫిబ్రవరి 26: సంపన్న వలసదారులకు అగ్రరాజ్యం అమెరికా పెద్దపీట వేయనుంది. రూ.43.5 కోట్లు (5 మిలియన్ డాలర్లు) చెల్లించేవారికి శాశ్వత పౌరసత్వం కల్పించనుంది. ఈ మేరకు 'గోల్డ్‌కార్డు' వీసాను ప్రవేశపెట్టనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం సంచలన ప్రకటన చేశారు. 35 ఏళ్ల క్రితం నాటి పెట్టుబడిదారుల వీసా(ఈబీ-5) స్థానంలో గోల్డ్‌కార్డు వీసాను తీసుకురానున్నారు. దేశంలోకి విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు 1990లో ఈబీ-5 వీసాలను అమెరికా కాంగ్రెస్ తీసుకొచ్చింది. అమెరికాలో కనీసం రూ.8.7 కోట్లు(ఒక మిలియన్ డాలర్లు) పెట్టుబడి పెట్టడం

మిగతా 2వ పేజీలో...

మీ పాపాల్లో పాలుపంచుకోం!

ఉద్యోగుల తొలగింపులో భాగస్వాములం కాలేమంటూ 21 మంది డోజ్ సిబ్బంది రాజీనామా

మస్క్‌కు షాక్

కూలిన టెస్లా షేరు

మస్క్ సంపద రూ.1.93 లక్షల కోట్ల మేర ఆవిరి

ఇంటి నుంచి పనిచేస్తారా?



ఐటీ, ఆధారిత రంగ ఉద్యోగులపై సర్వే

'వర్క్ ఫ్రమ్ హోం'ను ప్రోత్సహించాలని

సర్కారు యోచన

ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా స్థానికంగా సదుపాయాల కల్పన

కంపెనీలు, ఉద్యోగులకు తగ్గనున్న ఖర్చులు

రాష్ట్రంలో పెరగనున్న ఆర్థిక కార్యకలాపాలు


ఉద్యోగుల సేవలూ రాష్ట్రానికి అందుబాటులో

టెకీల అభిప్రాయం తెలుసుకునేందుకు సర్వే

తర్వాత యాజమాన్యాలతో సంప్రదింపులు

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగుల్లో చాలా మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే. మారుమూల గ్రామాల నుంచి పట్టణాలు, నగరాలకు చెందిన ఎంతో మంది యువత ఐటీ ఉద్యోగాలు చేస్తున్నారు. సొంత ఊరు, ఇల్లు వదిలి పొరుగు రాష్ట్రాల బాట పట్టారు. వీరంతా రాష్ట్రం నుంచి వెళ్లకుండా స్థానికంగా ఉంటూ ఇంటి నుంచే పనిచేస్తే..? దీనివల్ల ఉద్యోగులకు రవాణా, ఇంటి అద్దె, ఇతర ఖర్చులు... కంపెనీలకు నిర్వహణ ఖర్చులు తగ్గుతాయి. అంతేగాక రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయి. ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఐటీ ఉద్యోగుల సేవలను రాష్ట్రానికి కూడా ఉపయోగించుకోవచ్చు. కూటమి ప్రభుత్వం ఈ దిశగా ఆలోచిస్తూ, ఐటీ రంగంలో వర్క్ ఫ్రమ్ హోంను ప్రోత్సహించేందుకు సిద్ధమవుతోంది. ఉద్యోగులు ఇంటి వద్దే పని చేసుకునేలా సౌకర్యాలను

మిగతా 12వ పేజీలో...



దక్షిణాదిలో అప్పుడే వేడి సెగలు

ఏపీ, కర్ణాటక, కేరళల్లో వడగాడ్పులు

గాలిలో తేమ శాతం తగ్గడమే కారణం

మార్చిలో మరింతగా మంటలు 12

పెద్దల పోరులో గెలుపెవరిదో?

సార్వత్రిక ఎన్నికల అనంతరం తొలి సమరం

ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న కూటమి

పట్టభద్రుల స్థానాల్లో టీడీపీ పోటీ.. టీచర్ సీటులో ఏపీటీఎఫ్‌కు మద్దతు

కృష్ణా-గుంటూరు, ఉమ్మడి గోదావరిలో ద్విముఖ పోటీ

ఉత్తరాంధ్రలో త్రిముఖ పోరు.. ఎన్నికల్లో పోటీకి వైసీపీ దూరం..

కానీ పీడీఎఫ్ అభ్యర్థులకు లోపాయకారీ మద్దతు?

నేడే ఎమ్మెల్సీ ఎన్నికలు

ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్



అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల అనంతరం తొలిసారి జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల సమరంలో గెలుపెవరిదన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఉమ్మడి కృష్ణా-గుంటూరు, ఉమ్మడి

మిగతా 3వ పేజీలో...



నీటి లెక్క తేలింది!

తెలంగాణకు 63 టీఎంసీలు.. ఏపీకి 55

కృష్ణా జలాలపై 2 రాష్ట్రాల సీఈల ఏకాభిప్రాయం

మే, జూన్ నెలల్లో నీటి అవసరాలపై నివేదిక

నేడు కృష్ణా బోర్డు సమావేశంలో తుది నిర్ణయం

గత రెండ్రోజులుగా హైడ్రామా 11

ప్రజలందరికీ పింఛను!


'కొత్త పెన్షన్ స్కీమ్' అమలుకు కేంద్రం సన్నాహాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: దేశంలోని ప్రజలు అందరికీ కొత్త పింఛను పథకం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అసంఘటిత రంగంలోని వారితో సహా పౌరులందరికీ ప్రయోజనం కల్పించే ఉద్దేశంతో సార్వత్రిక పింఛను పథకంపై కేంద్రం కసరత్తు చేస్తోందని కార్మిక మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అసంఘటిత రంగానికి చెందిన నిర్మాణ రంగ కార్మికులు, గిగ్ వర్కర్లకు సంబంధించి ప్రభుత్వం నిర్వహించే పెద్ద పొదుపు పథకాలేవీ లేవు. ఇప్పటికే అమలులో ఉన్న ఈపీఎఫ్‌వో వంటి పథకాల్లో ఉద్యోగులు, వారు పనిచేసే సంస్థ నుంచే కంట్రిబ్యూషన్లు జమవుతాయి, వీటిలో ప్రభుత్వం నుంచి ఎలాంటి వాటా జమ కాదు. పెట్టుబడిదారుడికి 60ఏళ్లు నిండిన తర్వాత నెలకు రూ.1000 నుంచి 1,500 రాబడిని అందించే అటల్ పెన్షన్ యోజన, వీధి వ్యాపారులు, గృహనిర్మాణ కార్మికులకు ప్రయోజనం చేకూర్చే ప్రధానమంత్రి శ్రమ్ యోగి మన్‌ధన్ యోజన (పీఎం-ఎస్‌వైఎం) తో పాటు 60 ఏళ్లు నిండిన రైతులకు నెలకు రూ.3వేలు అందించే ప్రధాన మంత్రి కిసాన్ మన్‌ధన్ యోజన వంటి పథకాలు ప్రస్తుతం అమలులో ఉన్నాయి. వీటికి కొంత మొత్తం



ప్రజలు చెల్లిస్తుండగా, మరికొంత ప్రభుత్వం భరిస్తోంది. భారత్‌లో 2036 నాటికి సీనియర్ సిటిజన్ల జనాభా 22.7 కోట్లకు చేరుతుందని అంచనా. ఇది మొత్తం దేశ జనాభాలో 15శాతం. 2050 నాటికి వీరి సంఖ్య దేశ జనాభాలో 20 శాతానికి అంటే 34.7 కోట్లకు చేరుతుందని భావిస్తున్నారు. అమెరికా, కెనడా, యూరప్, రష్యా, చైనా తదితర దేశాలు ఇప్పటికే పెన్షన్లు, ఆరోగ్య సంరక్షణ, నిరుద్యోగ ప్రయోజనాలను కవర్ చేసే సామాజిక భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేశాయి. ఇక డెన్మార్క్, నార్వే, స్వీడన్, నెదర్లాండ్స్ న్యూజిలాండ్ వంటి దేశాలు ఇప్పటికే సార్వత్రిక పెన్షన్ పథకాలను అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మన దేశంలోనూ సామాజిక భద్రతను విస్తరించే లక్ష్యంతో 60 ఏళ్లు దాటిన వారందిరికీ ఒకే పింఛను పథకం అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం దేశంలో ఉన్న పొదుపు/ పింఛను పథకాలను హేతుబద్ధీకరించి ఈ కొత్త కార్యక్రమాన్ని అమలు చేసే అవకాశం ఉందని కార్మిక శాఖ వర్గాలు వెల్లడించాయి. ఉద్యోగం చేస్తున్న వేతన జీవులతో పాటు స్వయం ఉపాధి పొందుతున్న వారికి కూడా కొత్త విధానం వర్తించేందుకు వీలుగా ఈపీఎఫ్‌వో ఆధ్వర్యంలో విధి విధానాలను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నాయి. ప్రస్తుతానికి 'న్యూ పెన్షన్ స్కీం' అని పిలిచే ఈ కొత్త పథకం ఇప్పటికే అమలులో ఉన్న ఎన్‌పీఎస్ స్థానాన్ని భర్తీ గానీ, విలీనం గానీ చేయబోదని ఆ వర్గాలు వివరించాయి.

లోకం తీరు



ఉద్యోగాల ఊచకోతకు
ట్రంప్ మెమో

వాషింగ్టన్, ఫిబ్రవరి 26: అవసరానికి మించిన ఉద్యోగులతో ప్రభుత్వం కిక్కిరిసిపోయిందని.. తాను అధ్యక్షుడైతే అలాంటివారందరినీ తొలగించి ప్రభుత్వ పరిమాణాన్ని తగ్గిస్తానని ఎన్నికల ప్రచారంలో పదే పదే చెప్పిన ట్రంప్ ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. పది రోజుల క్రితమే వివిధ ప్రభుత్వ విభాగాల్లో దాదాపు 9,500 మందిని (వారిలో అత్యధికులు ప్రొబేషన్‌లో ఉన్న తాత్కాలిక ఉద్యోగులే) తొలగించిన ఆయన.. తాజాగా సివిల్ సర్వీస్ రక్షణ ఉన్న ఫెడరల్ ఉద్యోగులపై గురిపెట్టారు. ఉద్యోగులను తగ్గించాలని.. ఉద్యోగులను తొలగించడమే కాక, ఆయా పొజిషన్లను కూడా తొలగించాలని పేర్కొంటూ వైట్‌హౌస్ 'ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్' డైరెక్టర్ రస్సెల్ వాట్ ఒక మెమో జారీ చేశారు. పెద్ద ఎత్తున ఉద్యోగులను తగ్గించాలని ప్రెసిడెంట్ ట్రంప్ కోరుకుంటున్నట్టు అందులో పేర్కొన్నారు. "ఫెడరల్ ప్రభుత్వం ఖరీదుగా.. అదే సమయంలో అసమర్థంగా మారింది. పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయింది. అమెరికన్ ప్రజలకు కావాల్సిన ఫలితాలను అందించట్లేదు" అని ఆయన ఆ మెమోలో వివరించారు. కాబట్టి, అన్ని ఫెడరల్ విభాగాల అధిపతులూ.. పెద్ద ఎత్తున సిబ్బంది తగ్గింపునకు (రిడక్షన్ ఇన్ ఫోర్స్- రిఫ్) తక్షణ సన్నాహకచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తొలి దశ ప్రణాళికల వివరాలను మార్చి 13కల్లా.. రెండో దశ ప్రణాళికలను ఏప్రిల్ 15కల్లా తమకు సమర్పించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ఇప్పటికే కొన్ని కార్యాలయాలు సిబ్బంది తొలగింపు ప్రక్రియను చేపట్టినట్టు సమాచారం. ఫెడరల్ రియల్ ఎస్టేట్ వ్యవహారాలు చూసే 'జనరల్ సర్వీసెస్ అడ్మినిస్ట్రేషన్' విభాగం ఇప్పటికే తమ సిబ్బందికి.. ఈ విషయాన్ని వెల్లడించింది. ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ మొదలైందని పేర్కొంది.

కుప్పకూలిన టెస్లా షేరు..
మస్క్ సంపదలో 1.93 లక్షల కోట్లు ఆవిరి

న్యూయార్క్: టెస్లా అధిపతి మస్క్ సంపదకు భారీగా గండిపడింది. బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం.. మస్క్ నెట్‌వర్త్ మంగళవారం ఒక్క రోజే 2,220 కోట్ల డాలర్లు (రూ.1.93 లక్షల కోట్లు) క్షీణించి 35,800 కోట్ల డాలర్లకు(రూ.31.14 లక్షల కోట్లు) పడిపోయింది. గత నెల యూరప్ మార్కెట్లో టెస్లా కార్ల విక్రయాలు 45% క్షీణించడమే ఇందుకు కారణం. దీంతో టెస్లా షేరు ధర మంగళవారం ట్రేడింగ్‌లో ఏకంగా 8.39 శాతం క్షీణించి 302.80 డాలర్లకు పడిపోయింది. ఫలితంగా కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ (విలువ) లక్ష కోట్ల డాలర్ల దిగువకు పడిపోయి.. 94,800 కోట్ల డాలర్లకు (రూ.82.47లక్షల కోట్లు) పరిమితమైంది. ఇక, మస్క్ నెట్‌వర్త్ ఈ ఏడాదిలో 7,450 కోట్ల డాలర్ల (రూ.6.48 లక్షల కోట్లు) మేర తరిగిపోగా.. గత డిసెంబరు 16 నాటికి రికార్డు స్థాయితో పోలిస్తే 10,000 కోట్ల డాలర్ల (రూ.8.70 లక్షల కోట్లు)కు పైగా తగ్గింది.

డోజ్‌కు 21 మంది రాజీనామా

వాషింగ్టన్, ఫిబ్రవరి 26: అమెరికా ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులే లక్ష్యంగా ట్రంప్, మస్క్ ద్వయం రూపొందించిన డోజ్‌కు సొంత ఉద్యోగుల నుంచే వ్యతిరేకత ఎదురైంది. అత్యంత కీలకమైన ప్రజా సేవల వ్యవస్థ నాశనంలో, ఫెడరల్ ఉద్యోగుల తొలగింపులో తాము భాగం కాలేమంటూ 21 మంది డోజ్ ఉద్యోగులు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. "మీరు గత వారం చేసిన పనేమిటో ఐదు పాయింట్లలో తెలపండి. చెప్పకపోతే మీరు రాజీనామా చేసినట్టే భావిస్తాం" అంటూ మస్క్ ఇటీవలే 20 లక్షల మంది ఫెడరల్ ఉద్యోగులకు ఈమెయిళ్లు పంపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే.. డోజ్ ఉద్యోగులు 21 మంది రాజీనామా చేశారు. ప్రభుత్వ వ్యవస్థల ప్రక్షాళన పేరుతో డోజ్ కోసం మస్క్ తీసుకుంటున్నవారెవరికీ ఎలాంటి నైపుణ్యాలూ లేవని.. వారంతా ఆయన రాజకీయ సిద్ధాంతాలతో ఏకీభవించేవారు మాత్రమేనని వారు విమర్శించారు.

మస్క్ కాళ్లు నాకుతున్న ట్రంప్.. ఏఐ వీడియో వైరల్

వాషింగ్టన్, ఫిబ్రవరి 26: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. స్పేస్‌ఎక్స్ అధినేత మస్క్ పాదాలను నాకుతున్నట్టుగా కృత్రిమ మేధ సాయంతో రూపొందించిన ఫేక్ వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది! దీన్ని తయారుచేసిన వ్యక్తి ఎవరో తెలియదుగానీ.. రెండు రోజుల క్రితమే అమెరికా హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (హెచ్‌యూడీ) కార్యాలయంలోని అన్ని టీవీల్లో ఈ వీడియో తొలుత ప్రసారమైంది. ఎవరో ఆ టీవీల్ని హ్యాక్ చేసి.. ఆపకుండా లూప్‌లో ఆ వీడియోను ప్రసారం చేశారు. "లాంగ్ లివ్ ద రియల్ కింగ్" అనే నినాదంతో ఆ వీడియో పదే పదే ప్రసారం అవుతుండడంతో కార్యాలయ సిబ్బంది లోపలున్న టీవీలన్నింటినీ కట్టేశారు. కానీ, అది అక్కడితో ఆగక నెట్‌లో కూడా వైరల్ అయ్యింది.



బుధవారం త్రివేణి సంగమంలో సాధువులు

ముగిసిన మహా కుంభ మేళా

- హెలికాప్టర్లతో భక్తులపై 20 క్వింటాళ్ల గులాబీ పూల వర్షం
- మొత్తం 65 కోట్లకు పైగా రాక..చివరి రోజు 1.32 కోట్లు

ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 26: ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా ముగిసింది.. గంగ, యమున, సరస్వతీ నదుల సంగమ ప్రదేశం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చివరిరోజైన బుధవారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు పోటెత్తారు. హర హర మహాదేవా.. శంభో శంకరా అంటూ తెల్లవారు జాము నుంచే పవిత్ర స్నానాలు ఆచరించారు. సాయంత్రం 4 గంటల వరకే 1.32 కోట్ల మంది పుణ్య స్నానాలు చేసినట్టు యూపీ సర్కారు తెలిపింది. కుంభమేళా ప్రారంభమైన జనవరి 13వ తేదీ నుంచి దాదాపు 45 రోజుల్లో 65 కోట్లకు పైగా మంది వేడుకలో పాల్గొన్నట్లు అంచనా వేసింది. కుంభమేళా ముగింపు సందర్భంగా స్నానాలు ఆచరిస్తున్న భక్తులపై హెలికాప్టర్ల ద్వారా పూల వర్షం కురిపించారు. ఇందుకు 20 క్వింటాళ్ల గులాబీ పూలను వాడారు.

వక్ఫ్ బిల్లు సవరణలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: వక్ఫ్ బిల్లు పరిశీలనకు ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సూచించిన సవరణలకు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. దీంతో రెండో దఫా బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి, చర్చించేందుకు మార్గం సుగమమైంది. జగదాంబిక పాల్ ఆధ్వర్యంలో ఏర్పాటైన జేపీసీ కమిటీ కేంద్ర వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చేర్చడం, వివాదాలకు సంబంధించిన విచారణలను జిల్లా కలెక్టర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ ఉద్యోగికి అప్పగించడం, రాష్ట్ర వక్ఫ్ బోర్డులో ముస్లిం ఓబీసీ వర్గం నుంచి ఓ వ్యక్తిని నియమించి, ఆయన అధికారాలను విస్తృతం చేయడం వంటి సవరణలను సూచించింది.

సూడాన్‌లో కూలిన సైనిక విమానం

- సైనిక ఉన్నతాధికారులు సహా 46 మంది మృతి

కైరో, ఫిబ్రవరి 26: సూడాన్‌లో ఓ సైనిక విమానం కుప్పకూలి 46 మంది మృతి చెందారు. మంగళవారం ఖార్తూమ్ ప్రావిన్స్ ఆమ్‌దుర్మన్‌లోని వాడీ సాయిద్నా ఎయిర్ బేస్ నుంచి బయలుదేరిన విమానం కొద్దిసేపటికి జనావాసాల మీద కుప్పకూలింది. ఈ ఘటనలో విమానంలోని 19 మంది సైనికులు సహా మొత్తంగా 46 మంది మృతి చెందారు. వీరిలో ఓ సీనియర్ కమాండర్‌తో పాటు సైనిక ఉన్నతాధికారులు, సైనికులు, పిల్లలు, పలువురు పౌరులు ఉన్నారు. మరో 10 మందికిపైగా పౌరులు గాయపడినట్లు అధికారులు బుధవారం వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. సూడాన్‌పై పట్టు కోసం సైన్యం, పారా మిలటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ (ఆర్‌ఎస్‌ఎఫ్) మధ్య జరుగుతున్న అంతర్యుద్ధం ఇటీవల తీవ్ర రూపం దాల్చింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రమాదానికి ఆర్‌ఎస్‌ఎఫ్‌కు సంబంధం ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది.

'వీసీ' డిజిటల్ అరెస్టు.. రూ.14 లక్షలు వసూలు

బెర్హంపూర్, ఫిబ్రవరి 26: డిజిటల్ అరెస్టు సైబర్ మోసగాళ్ల వలలో చిక్కి ఒడిశాలోని బెర్హంపూర్ ఉపకులపతి గీతాంజలి దాస్ రూ.14 లక్షలు కోల్పోయారు. ఫిబ్రవరి 12న ఘటన చోటుచేసుకోగా, మోసపోయామని గుర్తించిన సదరు వీసీ 24న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు ప్రకారం.. గీతాంజలికి ఫిబ్రవరి 12న ఈడీ అధికారిని అని చెప్పుకొని ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. ఆమె పేరుతో ఉన్న ఓ బ్యాంకు ఖాతాలో రూ.కోట్లు డిపాజిట్ అయ్యాయని, దానిపై ఈడీ దర్యాప్తు చేస్తోందని, ఆ క్రమంలోనే డిజిటల్ అరెస్టు చేస్తున్నామని సదరు వ్యక్తి నమ్మబలికాడు. ఆమె ఖాతాలను ఆడిట్ చేస్తున్నామని చెప్పి.. గీతాంజలి అకౌంట్‌లో ఉన్న రూ.14 లక్షలను తన ఖాతాలోకి బదిలీ చేసుకున్నాడు.

అమ్మకానికి అమెరికా పౌరసత్వం

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా కనీసం 10 మందికి ఉద్యోగాలు కల్పించే వారికి ఈబీ-5 వీసాను ఇస్తున్నారు. అయితే, గోల్డ్ కార్డు వీసాకు ఉద్యోగాల కల్పన నిబంధనను ట్రంప్ ప్రస్తావించలేదు. రూ.43.5 కోట్లు చెల్లించే వారికి అమెరికా శాశ్వత పౌరసత్వం ఇవ్వనున్నట్టు ప్రకటించారు. వచ్చే రెండు వారాల్లో ఈబీ-5 వీసా స్థానంలో 'ట్రంప్ గోల్డ్‌కార్డు' రానుందని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ చెప్పారు. గోల్డ్‌కార్డు అంటే గ్రీన్‌కార్డు లేదా శాశ్వత లీగల్ నివాసం అన్నారు. ఈబీ-5 వీసాలో మోసాలు జరుగుతున్నాయని, అందుకే దాని స్థానంలో గోల్డ్‌కార్డును తీసుకొస్తున్నట్టు పేర్కొన్నారు. హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం వార్షిక వలస గణాంకాల పుస్తకంలోని వివరాల మేరకు 2022 సెప్టెంబరు 30తో ముగిసిన ఏడాది కాలానికి 8 వేల మంది ఈబీ-5 వీసాలు పొందారు. అయితే, ఈబీ-5 వీసాను ఒక చెత్త పథకంగా ట్రంప్ అభివర్ణించారు. పౌరసత్వానికి అర్హతలను కాంగ్రెస్ నిర్ణయిస్తుంది. అయితే, గ్రీన్‌కార్డుకు కాంగ్రెస్ ఆమోదం అవసరం లేదని ట్రంప్ చెప్పారు. ఈబీ-5 వీసాలకు గరిష్ఠ పరిమితి ఉండగా, ద్రవ్యలోటును తగ్గించుకునేందుకు ఫెడరల్ ప్రభుత్వం కోటి గోల్డ్‌కార్డులు విక్రయించుకోవచ్చని ట్రంప్ ప్రకటించారు. కోటి గోల్డ్ కార్డుల ద్వారా రూ.43.5 కోట్ల కోట్లు ఆదాయం రానుంది.

100కుపైగా దేశాల్లో గోల్డెన్ వీసాలు

ప్రపంచవ్యాప్తంగా 100కుపైగా దేశాలు పెట్టుబడిదారుల వీసాలను అందిస్తున్నాయని హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ అనే అడ్వైజరీ సంస్థ తెలిపింది. బ్రిటన్, స్పెయిన్, గ్రీస్, ఆస్ట్రేలియా, కెనడా, ఇటలీ తదితర దేశాలు 'గోల్డెన్ వీసా'లను అందిస్తున్నాయని పేర్కొంది. కాగా, గోల్డ్‌కార్డు వీసాను ఒక అద్భుతంగా ట్రంప్ అభివర్ణించారు. 'ఇది గొప్పది. అద్భుతంగా ఉండనుంది. ఇది గ్రీన్‌కార్డు లాంటిది. ధనవంతులు, గొప్ప టాలెంట్ ఉన్నవారికి పౌరసత్వం కల్పించే ఒక



మార్గం. వారు ధనవంతులు. చాలా డబ్బు వెచ్చిస్తున్నారు. చాలా పన్నులు చెల్లిస్తున్నారు. చాలామందికి ఉద్యోగాలు కల్పిస్తున్నారు. ఇది చాలా విజయవంతమవుతుందని నేను భావిస్తున్నాను' అన్నారు.

కెనడాపై అమెరికా మరింత ఒత్తిడి

అమెరికా దాని ప్రధాన మిత్ర దేశాలతో కలిసి ఏర్పాటు చేసిన ఇంటెలిజెన్స్ కూటమి 'ఫైవ్ ఐస్' నుంచి కెనడాను బయటకు పంపించే దిశగా ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ట్రంప్ సన్నిహితుడు, సలహాదారు పీటర్ నవ్రో ఇందుకు సంబంధించిన ప్రతిపాదన చేసినట్టు ఓ ఆంగ్ల పత్రిక కథనం పేర్కొంది. అమెరికాతో కెనడా విలీనమయ్యేలా ఒత్తిడి పెంచే వ్యూహంలో భాగంగా ఈ మేరకు ప్రతిపాదన తెరపైకి వచ్చినట్టు తెలుస్తోంది. అయితే ఆంగ్ల పత్రిక కథనాన్ని పీటర్ 'నాన్సెన్స్' అంటూ కొట్టిపారేశారు. ఫైవ్ ఐస్ ఇంటెలిజెన్స్ కూటమిలో బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ కూడా ఉన్నాయి. మరోవైపు, రష్యాతో పోరాడుతున్న ఉక్రెయిన్‌కు తమ మద్దతు ఉంటుందని కెనడా ప్రధాని ట్రూడో పేర్కొన్నారు. ఉక్రెయిన్‌కు మద్దతుగా కొత్తగా మిలిటరీ సాయాన్ని పంపినట్టు వెల్లడించారు. శాశ్వత శాంతి కోసం పోరాటంలో ఒంటరిగా గెలువలేమన్నారు. పాశ్చాత్య ఆంక్షలను తప్పించుకునేందుకు, అక్రమంగా రష్యా ఆయిల్‌ను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేందుకు వాడే రష్యా 'షాడో ఫ్లీట్'పై కొత్త ఆంక్షలు విధిస్తున్నట్టు ప్రకటించారు.

మస్క్ కెనడా పౌరసత్వం రద్దుకు పిటిషన్

ట్రంప్ సన్నిహితుడు డోజ్ సారథి ఎలాన్ మస్క్ కెనడా పౌరసత్వంతోపాటు పాస్‌పోర్టును రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పార్లమెంటరీ పిటిషన్‌పై కెనడా పౌరులు, నివాసితులు పెద్ద ఎత్తున సంతకాలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ పిటిషన్‌పై 2.50 లక్షలకు పైగా మంది సంతకాలు చేసినట్టు తెలుస్తోంది. కెనడా ప్రయోజనాలు దెబ్బతీసే విధంగా మస్క్ చర్యలు ఉన్నట్టుగా పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ టెక్ బిలియనీర్‌కు దక్షిణాఫ్రికా, కెనడా, అమెరికా పౌరసత్వాలు ఉన్నాయి.

భారతీయులపై కెనడా వీసా నిబంధనల తీవ్ర ప్రభావం

విదేశాల నుంచి వలసల నియంత్రణకు కెనడా చేపట్టిన చర్యలు భారతీయ విద్యార్థులు, ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. విదేశాంగ మంత్రిత్వశాఖ గణాంకాల మేరకు సుమారు 4.27 లక్షల మంది భారతీయ విద్యార్థులు కెనడాలో చదువుకుంటున్నారు. ఈ ఏడాది జనవరి 31 నుంచి అమల్లోకి వచ్చిన కెనడా నూతన వలస నిబంధనల ప్రకారం వివిధ కారణాలతో స్టడీ, వర్క్ పర్మిట్లు, ఈటీఏ(ఎలక్ట్రానిక్ ట్రావెల్ ఆథరైజేషన్)లను ఇమ్మిగ్రేషన్ అధికారులు రద్దు చేయొచ్చు. ఈ నిబంధనల ప్రకారం తప్పుడు సమాచారం ఇచ్చినా, క్రిమినల్ రికార్డు ఉన్నా వీసా రద్దు చేస్తారు. అలాగే, ఆ వ్యక్తి అధికారిక నివాస గడువు ముగిసినా కెనడాను వీడరని ఎవరైనా అధికారి భావిస్తే అలాంటి వ్యక్తి వీసాను రద్దు చేస్తారు. పత్రాలు పోయినా, చోరీ అయినా, పరిపాలనా లోపంతో జారీ అయినా వీసా రద్దు చేస్తారు.


నేర చరితులపై జీవితకాల నిషేధం..
పార్లమెంట్ పరిధిలోని అంశం

- న్యాయ సమీక్ష పరిధిలో ఉండదు: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: కోర్టుల్లో శిక్షలు పడి, నేరచరితులుగా ఉన్న చట్ట సభ్యులపై జీవితకాల నిషేధం విధించాలా? వద్దా? అనే అంశం పూర్తిగా పార్లమెంట్ పరిధిలోనిదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన ఎంపీలు, ఎమ్మెల్యేలపై జీవితకాల నిషేధం విధించాలని కోరుతూ న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ వేసిన పిటిషన్‌పై కేంద్రం ఈ మేరకు సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. ఈ పిటిషన్‌పై ఈనెల 10న విచారణ జరగ్గా.. కేంద్రాన్ని, భారత ఎన్నికల సంఘాన్ని(ఈసీఐ) అఫిడవిట్ సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్లు 8, 9 రాజ్యాంగ చెల్లుబాటుపై స్పందన తెలియజేయాలని సూచించింది. దీనిపై అఫిడవిట్ సమర్పించిన కేంద్రం.. వివిధ కేసుల్లో దోషులుగా తేలిన రాజకీయ నేతలపై జీవితకాలం నిషేధం విధించాలనే అభ్యర్థనను కేంద్రం వ్యతిరేకించింది. "ఇలాంటి అంశాల్లో నిర్ణయాధికారం పూర్తిగా పార్లమెంట్ పరిధిలో ఉంటుంది. పిటిషనర్ లేవనెత్తిన అంశాలు కూడా విస్తృత కోణాలను కలిగి ఉన్నాయి. జీవితకాల నిషేధం సరైందా? లేదా? అనే ప్రశ్న కూడా పార్లమెంట్ పరిధిలోకే వస్తుంది. ఈ తరహా అంశాలు న్యాయ సమీక్ష పరిధిలోకి రావు" అని స్పష్టం చేసింది. కాగా.. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 8(1) ప్రకారం.. చట్టసభ సభ్యులు దోషులుగా తేలినప్పటి నుంచి ఆరేళ్లపాటు వారిపై ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం ఉంటుంది.

దక్షిణాదిన సీట్లు తగ్గవు

- తమిళంలో మాట్లాడలేకపోతున్నా.. క్షమించండి: అమిత్ షా



చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానంలో త్రిభాషా సూత్రం అమలును డీఎంకే నేతలు వ్యతిరేకిస్తున్న వేళ.. తమిళ భాషపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో అతి ప్రాచీన భాష తమిళం అని, అటువంటి భాషలో మాట్లాడలేకపోతున్నందుకు తనను క్షమించాలని తమిళనాడు ప్రజలను కోరారు. మూడు రోజుల పర్యటన కోసం మంగళవారం రాత్రి కోయంబత్తూరుకు వచ్చిన ఆయన.. బుధవారం ఉదయం ఇక్కడ బీజేపీ శాఖ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాల సీట్లు తగ్గే ప్రసక్తి లేదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తమిళనాడు 8 సీట్లు కోల్పోతుందంటూ ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. ఒక్క లోక్‌సభ సీటు కూడా తమిళనాడు కోల్పోదని, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగనివ్వబోమని చెప్పారు. కేంద్రం నుంచి నిధుల కేటాయింపులోనూ తమిళనాడుకు ఏవిధమైన అన్యాయం జరగలేదన్నారు. 2014-24 మధ్య కాలంలో కేంద్రం తమిళనాడుకు రూ.5.08 లక్షల కోట్లు ఇచ్చిందని వివరించారు. గతంలో ఎప్పుడూ లేనంత ఎక్కువగా రాష్ట్రంలో దేశ వ్యతిరేక ధోరణి ప్రబలిందని విమర్శించారు.

భూకంప తీవ్రత పెరుగుతోందా?

ఎక్కడో పాక్‌లో భూమి కంపిస్తే.. న్యూఢిల్లీ వరకు ప్రకంపనలు

తక్కువ లోతులో భూకంప కేంద్రమే సమస్య

(సెంట్రల్‌డెస్క్)

ఇండోనేసియాలోని సుమత్రా దీవుల్లో భూకంపం వస్తే.. భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాల్లో ప్రకంపనలు ఎందుకొస్తాయి? పాకిస్థాన్‌లో భూకంప కేంద్రం ఉంటే.. న్యూఢిల్లీలో 5.1 తీవ్రతతో ప్రకంపనలు ఎందుకొస్తాయి? నేపాల్‌లో భూకంపానికి ఉత్తరాది రాష్ట్రాలకు లింకేమిటి? ఈ ప్రశ్నలకు భూకంప(సెస్మిక్) జోన్‌తోపాటు.. భూగర్భంలోని పలకాలు.. వాటిల్లో పగుళ్ల(ఫాల్ట్స్), థ్రస్ట్‌లు ప్రధాన కారణమని భూభౌతిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూకంప కేంద్రం తక్కువ లోతులో ఉంటే.. సుదూర ప్రాంతాల వరకూ ప్రకంపనలకు ఉంటాయని వివరిస్తున్నారు. ఫలకం లోపలి పగుళ్లతో తక్కువత తీవ్రత ఉంటుందని, ఫలకం సరిహద్దుల్లో, అంతర్-ఫలకాల పగుళ్ల ప్రాణ, ఆస్తినష్టాన్ని కలిగించే స్థాయిలో భూకంపాలను సృష్టిస్తాయని పేర్కొంటున్నారు.

ప్రధాన ఫాల్ట్స్ ఇక్కడే..

భూగర్భంలోని ఫలకాలు ఒకదానికొకటి ఢీకొన్నప్పుడు భూకంపాలు వస్తాయనే విషయం తెలిసిందే.! భారతదేశం భారత ఫలకంపై ఉండగా.. అది ఏడాదికి 5 సెంటీమీటర్ల చొప్పున ఎగువకు కదులుతుంది. ఈ క్రమంలో పైన ఉండే యురేషిన్ ఫలకం కిందకు దూసుకుపోతోంది. ఈ కారణంగానే ఈ ప్రాంతంలో హిమాలయాలు ఏర్పడ్డాయి. అయితే.. ఫలకలపైన పలుచోట్ల పగుళ్లు ఏర్పడుతుంటాయి. థ్రస్ట్‌లు ఏర్పడుతాయి. వీటి వల్ల కూడా భూకంపాలు వస్తుంటాయి. వీటి కారణంగా గడిచిన శతాబ్దికాలంలో 8 అంతకంటే ఎక్కువ తీవ్రత ఉన్న



ఇటీవల ఢిల్లీలో భూకంపం సమయంలో ఇళ్ల బయట ప్రజలు

నాలుగు భూకంపాలు సంభవించి, భారీగా ఆస్తి, ప్రాణనష్టం సంభవించాయి. 2004లో సముద్ర గర్భంలో 9.3 తీవ్రతతో వచ్చిన భూకంపం భారీ సునామీని సృష్టించి.. చరిత్రలోనే అతిపెద్ద విపత్తుల్లో ఒకటిగా నిలిచింది. ఇక 5-8 తీవ్రతతో ఈ శతాబ్దకాలంలో 650కి పైగా భూకంపాలు వచ్చాయి. వీటన్నింటికీ భూఫలకాల్లో క్రియాశీల లోపాలే కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇండో-యురేషియన్ ఫలకాల మధ్య హిమాలయాల తూర్పు అంచుల్లో ఇండో-బర్మీస్-అండమాన్ ఫాల్ట్స్‌లో తీవ్ర స్థాయిలో ఘర్షణ జరుగుతుందని వివరిస్తున్నారు. ఇక ద్వీపకల్ప భాగంలో నర్మద-సోన్-తపతి చీలికలు, దక్కన్ పీఠభూమిలో గోదావరి చీలిక ఫాల్ట్స్‌గా ఉండగా.. అండమాన్ సబ్‌డక్షన్ జోన్‌లో రెండు ఫాల్ట్స్ ఉన్నాయి. ఉత్తరాదితో పోలిస్తే.. ద్వీపకల్ప భాగంలో భూకంప తీవ్రతలు తక్కువ అని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. ఫాల్ట్స్‌కు ఉండే లింకుల కారణంగా ఢిల్లీ లాంటి నగరాల్లో ముప్పు ఎక్కువ అని పేర్కొంటున్నారు. హిమాలయన్ సెస్మిక్ బెల్ట్, ఢిల్లీ-హరిద్వార్ ప్రాంతం, ఆరావళి ఫాల్ట్స్, ఇండో-గంగా మైదానంలో ఎక్కడ భూకంపం సంభవించినా.. ఢిల్లీలో ప్రకంపనలు రావడానికి ఇదే కారణమన్నారు. ఇదిలా ఉండగా, ఇండోనేసియాలో బుధవారం ఉదయం భూకంపం సంభవించింది. ఉత్తర సులవేసి ప్రావిన్స్ వద్ద భూకంప కేంద్రం ఉండగా.. రిక్టర్ స్కేల్‌పై 6.1 తీవ్రత నమోదైంది. కాగా.. మంగళవారం ఉదయం పశ్చిమబెంగాల్, ఒడిసాల్లో 5.1 తీవ్రతతో భూమి కంపించిన విషయం తెలిసిందే.! దీని ప్రభావం హిమాచల్‌ప్రదేశ్‌లోని మండిలో కూడా కనిపించడం గమనార్హం.!

సాధారణమే.. ఇప్పుడు ఎక్కువగా గుర్తిస్తున్నారు



ఒక చోట భూకంప కేంద్రం ఉంటే.. పదులు, వందల కిలోమీటర్ల వరకు ప్రభావం కనిపించడం సాధారణమే. ఇది కొత్తేమీ కాదు. ఇలా సుదూర ప్రాంతాల వరకు భూకంప ప్రభావం ఉండడానికి భూకంప కేంద్రం లోతును ప్రధాన కారణంగా చెప్పవచ్చు. లోతు ఎంత ఎక్కువగా ఉంటే.. భూకంప తీవ్రత అంత తక్కువగా ఉంటుంది. అదే 5-10 కిలోమీటర్ల లోతులో కేంద్రం ఉంటే.. సుదూర ప్రాంతాల్లోనూ భూములు కంపిస్తాయి. ఢిల్లీ వంటి నగరాలు జోన్-4లో ఉన్నాయి. భారత ప్రమాణాల విభాగం(బీఐఎస్) సూచించిన జోన్-4, జోన్-5 ప్రాంతాల్లో భూకంపాల ముప్పు, ఆస్తి/ప్రాణనష్టం అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. నేషనల్ బిల్డింగ్ కోడ్‌కు అనుగుణంగా ఈ ప్రాంతాల్లో ఇళ్లను నిర్మిస్తే.. నష్టాన్ని అరికట్టవచ్చు.

\- రామన్‌చర్ల ప్రదీప్‌కుమార్, సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్

ఆ జిల్లాలో రొట్టెల వల్లే బట్టతల!

- మహారాష్ట్రలోని ఓ జిల్లాలో 300 మందికి వారాల వ్యవధిలో బట్టతల
- వారు వాడే గోధుమపిండిలో అధిక మోతాదులో సెలీనియం.. అదే సమస్య

ముంబై, ఫిబ్రవరి 26: మహారాష్ట్రలోని బుల్ధానా జిల్లా వాసులకు ఈ మధ్య ఈ విచిత్ర సమస్య ఎదురైంది. దాదాపు 300 మంది.. వారిలో చాలామంది యువతీ యువకుల్లో అకస్మాత్తుగా జుట్టు ఊడటం మొదలైంది. చూస్తుండగానే బట్టతల వచ్చేసింది. దీంతో పలువురు కాలేజీ విద్యార్థులు, యువతులు ఇల్లు దాటి బయటకు వెళ్లలేదు. ఈ సమస్యపై ఎంతోమంది డాక్టర్లను సంప్రదించినా వారు తగిన పరిష్కారం చూపలేకపోయారు. చివరికి, పద్మశ్రీ అవార్డు గ్రహీత అయిన వైద్యుడు హిమ్మత్‌రావ్ బవాస్కర్.. దీని గురించి పరిశోధించి.. బల్ధానా జిల్లా వాసులు రొట్టెల తయారీకి వాడుతున్న గోధుమ పిండిలో సమస్య ఉందని గుర్తించారు. సదరు గోధుమ పిండిలో సిలీనియం అధికస్థాయిలో ఉంటోందని, దాని వల్లే అలోపిసియా అనే సమస్య తలెత్తి వెంట్రుకలు ఊడటం మొదలైందని తేల్చారు. పంజాబ్, హరియాణాల నుంచి సరఫరా అయిన ఆ గోధుమపిండిని బల్ధానాలో రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేశారు. సాధారణంగా పర్వతప్రాంతాల్లోని నేలల్లో సిలీనియం అధికస్థాయిలో ఉంటుంది. పంజాబ్, హరియాణాల్లో విస్తరించిన శివాలిక్ పర్వతశ్రేణుల్లో కూడా ఇది సహజం. వర్షాకాలంలో ఈ సిలీనియం నీటిలో కలిసి పంటభూములకు చేరినప్పుడు.. పండించే పంటల్లో కూడా ఎక్కువ మోతాదులో కనిపిస్తుంది. అంతేగాక, ఫాస్ఫేట్ ఎరువులతోనూ సిలీనియం సమస్య పెరుగుతుంది. వాస్తవానికి మన శరీరంలో థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తికి సిలీనియం అవసరం. కానీ, మోతాదు మించితే జుట్టు ఊడటం, చర్మ సమస్యలు వంటివి తలెత్తుతాయి.

ఆహార వ్యర్థాలతో నిర్మాణాలు మరింత దృఢం!

ఇండోర్: ఆహార వ్యర్థాలను కాంక్రీట్‌లో కలపడం వల్ల నిర్మాణాలు మరింత దృఢంగా ఉంటాయని ఐఐటీ ఇండోర్ పరిశోధకులు తెలిపారు. హాని కలిగించని బ్యాక్టీరియాతో కూడిన వ్యర్థాలను కలపడం ద్వారా సదరు కాంక్రీట్ దృఢత్వం మరింత మెరుగుపడిందని పరిశోధకులు గుర్తించారు. దీనివల్ల కర్బన ఉద్గారాలు తగ్గుతాయని తాజా అధ్యయనంలో పేర్కొన్నారు. ఆహార వ్యర్థాలు కుళ్లిన తరువాత వాటిలో నుంచి కార్బన్ డై ఆక్సైడ్ విడుదల అవుతుంది. హాని కలిగించని ఈ- కొలి బ్యాక్టీరియాతో కూడిన వ్యర్థాలను కాంక్రీట్‌తో కలపగానే పరస్పరం చర్య మొదలవుతుంది. ఫలితంగా కార్బొనేట్ స్ఫటికాలు ఏర్పడి అవి కాంక్రీట్‌లో ఉన్న రంధ్రాలు, పగుళ్లల్లో చేరుతాయి. దీంతో నిర్మాణాలు మరింత బలంగా ఉంటాయని ఐఐటీ ఇండోర్ ప్రొఫెసర్ సందీప్ తెలిపారు. ప్రయోగంలో భాగంగా కాలీఫ్లవర్ రెమ్మలు, బంగాళదుంప, నారింజ తొక్కలు వంటి వ్యర్థాలను కాంక్రీట్‌లో కలిపినట్లు ఆయన చెప్పారు. అయితే వ్యర్థాలను పొడి చేసి తగినంత నీరు కలిపి కాంక్రీట్‌ను సిద్ధం చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



ప్రభలు కొలువుతీరిన కోటప్పకొండ



శ్రీశైలంలో ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు, భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్ల కల్యాణోత్సవం(ఇన్‌సెట్)

శంభో శివ శంభో!

(మొదటి పేజీ తరువాయి)

భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీశైల మల్లన్న, భ్రమరాంబికా దేవికి సాయంత్రం ప్రభోత్సవం, నంది వాహన సేవ అనంతరం అరగంట పాటు జగద్గురు పీఠాధిపతులతో గర్భాలయంలో స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేశారు. ఆ తర్వాత లింగోద్భవకాల మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకంతో పాటు పృథ్వీ వెంకటేశ్వర్లు తనయుడు సుబ్బారావు పాగాలంకరణ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తెచ్చిన పాగాలను సైతం స్వామికి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం జ్యోతిర్లింగ మల్లికార్జునుడికి లింగోద్భవ కార్యక్రమంతో పాటు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.





శ్రీముఖలింగేశ్వరుడికి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పూజలు.., కోటప్పకొండలో త్రికోటేశ్వర స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

ముక్కంటి క్షేత్రంలో..

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరాలయం వేకువజామున 4 నుంచి రాత్రి10 గంటల వరకు కిటకిటలాడింది. స్వయంభువుగా వెలసిన వాయులింగేశ్వర స్వామి నిత్యాభిషేకమూర్తిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం శ్రీకాళహస్తీశ్వరుడు ఇంద్ర విమానం, ఆయన దేవేరి జ్ఞానప్రసూనాంబదేవి చప్పరం అధిరోహించి పురవిహారం చేశారు. మూషిక వాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప ముందు సాగగా ఆదిదంపతులను దర్శించుకోవడానికి తరలివచ్చిన భక్తజనంతో మాడవీధులు నిండిపోయాయి. రాత్రి స్వామివారు నంది వాహనం, అమ్మవారు సింహ వాహనంపై విహరించారు.

శ్రీముఖలింగంలో...

శ్రీకాకుళం జిల్లాలోని శ్రీముఖలింగేశ్వరస్వామి దర్శనానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఒడిశా నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచే వంశధార నదిలో స్నానాలు ఆచరించి దర్శనాల కోసం దర్శించుకోవడానికి బారులు తీరారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కాగా, ఒడిశా-ఆంధ్రా సరిహద్దులోని మహేంద్రగిరులపై పాండవులు ప్రతిష్ఠించినట్లు చెబుతున్న శివలింగాలను ఒడిశా, ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ నుంచి భక్తులు భక్తులు దర్శించుకుని, పూజలు చేశారు.



విజయవాడ యనమలకుదురులో శివరాత్రి శోభ

కోటప్పకొండలో ప్రభల పండుగ

పల్నాడు జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధి భక్తులతో కిక్కిరిసింది. లక్షలాది మంది భక్తులు కోటయ్య స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామికి అభిషేకాలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక అలంకారం చేశారు. అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకాలు వైభవంగా జరిగాయి. ప్రభుత్వం తరఫున దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వామికి పట్టు వస్త్రాలు, వెండి ప్రభ సమర్పించారు. ప్రభల పండుగగా పేరొందిన కోటయ్య తిరునాళ్లలో 20 భారీ విద్యుత్ ప్రభలు కొలువు తీరాయి.

రాష్ట్ర పండుగగా మహాశివరాత్రి: మంత్రి ఆనం

రాష్ట్రవ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం నెల్లూరులోని మూలాపేటలో ఉన్న మూలస్థానేశ్వరుడిని మంత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆనం విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు శ్రీశైలం, శ్రీకాళహస్తి, కోటప్పకొండలో రాష్ట్ర పండుగా మహాశివరాత్రి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 33 సుప్రసిద్ధ క్షేత్రాల్లో ప్రత్యేక అధికారులు పర్యవేక్షణలో వేడుకలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

సాగర తీరాన మహా కుంభాభిషేకం

విశాఖపట్నంలో సాగర తీరాన ప్రయాగ్‌రాజ్ నుంచి తెప్పించిన పవిత్ర జలాలతో కేంద్ర మాజీ మంత్రి టి.సుబ్బిరామిరెడ్డి మహా కుంభాభిషేకం నిర్వహించారు. భక్తులకు కూడా స్వయంగా అభిషేకం చేసే అవకాశం కల్పించారు. బీచ్‌లో కోటి లింగాలతో మహా శివలింగం ఏర్పాటుచేశారు. సినీనటుడు బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మను 'అవధాన బ్రహ్మ' బిరుదుతో సత్కరించారు.

గోదావరిలో భక్తుల పుణ్యస్నానాలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పిఠాపురం పాదగయతో పాటు పంచారామ క్షేత్రాలైన సామర్లకోట, ద్రాక్షారామ భీమేశ్వరాలయాలు, కోటిపల్లి సహ ఇతర శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. రాజమహేంద్రవరం గోదావరి నదిలో 2లక్షల మంది పుణ్యస్నానాలు చేశారు. పాదగయ పుష్కరిణిలో స్నానాలకు, కుక్కుటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్వారపూడిలో 60 అడుగుల ఆదియోగి విగ్రహాన్ని ప్రారంభించారు. విగ్రహం లోపల భాగంలో వెనక శివలింగాన్ని ప్రతిష్ఠించారు. ఆలయంలో అయోధ్య బాలరాముడు, వారాహి మాత విగ్రహాలను ఏర్పాటు చేశారు.



ద్వారపూడిలో ఆవిష్కరించిన 60 అడుగుల ఆదియోగి విగ్రహం

పెద్దల పోరులో గెలుపు ఎవరిదో?



ఏలూరులో ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రి సెల్వీ

(మొదటి పేజీ తరువాయి)



ఉభయగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలతోపాటు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి గురువారం పోలింగ్ జరుగనుంది. రెండు పట్టభద్రుల స్థానాలకు పాలక టీడీపీ కూటమి తరఫున తెలుగుదేశం అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి కూటమి అభ్యర్థులను నిలుపలేదు. ఇక్కడ ఏపీటీఎఫ్ తరఫున బరిలో ఉన్న సిటింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మకు మద్దతు ప్రకటించింది. వైసీపీ ఈ ఎన్నికలకు దూరంగా ఉంది. బహిరంగంగానూ ఎవరికీ మద్దతు ప్రకటించలేదు. అయితే పట్టభద్రుల స్థానాల్లో మాత్రం లోపాయకారీగా ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫోరం(పీడీఎఫ్)కు సహకరిస్తోంది. ఇక్కడ పీడీఎఫ్ అభ్యర్థులు గెలిస్తే.. ఆ విజయాన్ని తమ ఖాతాలో వేసుకోవాలని.. ఓడిపోతే మాత్రం తామెవరికీ మద్దతివ్వలేదని చెప్పాలన్నది ఆ పార్టీ వ్యూహంగా కనిపిస్తోంది. సార్వత్రిక ఎన్నిక ల అనంతరం జరుగుతున్న తొలి ఎన్నికలు కావడంతో అధికార కూటమి ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని వ్యూహాత్మకంగా పనిచేస్తోంది. పట్టభద్రుల స్థానాల్లో తలపడుతున్న ఇద్దరు టీడీపీ అభ్యర్థుల అభ్యర్థుల గెలుపు కోసం మూడు పార్టీలకు చెందిన మంత్రులు, కూటమి ఎమ్మెల్యేలు కూడా తీవ్రంగా శ్రమిస్తున్నారు.

కృష్ణా-గుంటూరులో ఇద్దరి నడుమే!

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల స్థానంలో 25 మంది బరిలో ఉన్నా.. ప్రధాన పోటీ మాత్రం టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు నడుమే నెలకొంది. ఆలపాటి తెనాలి నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి మూడుసార్లు గెలుపొందారు. మంత్రిగా కూడా పనిచేశారు. రెండు జిల్లాల ప్రజలకు సుపరిచితుడు. లక్ష్మణరావు గతంలో మూడు సార్లు కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయుల స్థానం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆలపాటి అభ్యర్థిత్వాన్ని టీడీపీ చాలా ముందుగానే ప్రకటించింది. దీంతో ఆయన ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లడానికి తగిన సమయం లభించింది. ఈ స్థానంలో సుమారు 3.47 లక్షల ఓటర్లు ఉండగా వారిలో 8 వేల మంది ఇతర ప్రాంతాల్లో ఉన్నారు. వారి ఓట్లు అభ్యర్థుల గెలుపులో కీలక పాత్ర పోషించనున్నాయి. వీరిని ఆకర్షించడంపై అభ్యర్థులిద్దరూ దృష్టి సారించారు. అధిక శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ యూనియన్ల మద్దతు కూడగట్టడంలో లక్ష్మణరావు ముందున్నారు.

గోదావరిలో పేరాబత్తుల వర్సెస్ రాఘవులు

ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల స్థానంలో మొత్తం 35 మంది బరిలో ఉన్నారు. వీరిలో టీడీపీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, పీడీఎఫ్ అభ్యర్థి డీవీ రాఘవులే ప్రధానంగా పోటీపడుతున్నారు. ఇద్దరూ కొత్తగా బరిలోకి దిగుతుండడం గమనార్హం. ఇక్కడ సుమారు 3.14 లక్షల మంది ఓటర్లు ఉండగా.. వీరిలో ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్ల సంఖ్య 25 వేల వరకు ఉంది. పోలింగ్ రోజు వీరిని తీసుకొచ్చి ఓట్లు వేయించడంపై కూటమి పార్టీలు దృష్టి సారించాయి.

ఉత్తరాంధ్రలో రఘువర్మకు చాన్స్?

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 10 మంది అభ్యర్థులు పోటీబడుతున్నారు. ఇక్కడ త్రిముఖ పోటీ నెలకొంది. ఏపీటీఎఫ్ నుంచి పాకలపాటి రఘువర్మ, పీఆర్‌టీయూ తరఫున గాదె శ్రీనివాసులునాయుడు, యూటీఎఫ్ నుంచి కోరెడ్ల విజయగౌరి బరిలో ఉన్నారు. రఘువర్మకు టీడీపీతోపాటు జనసేన, బీజేపీ కూడా మద్దతు ఇస్తున్నాయి. అయితే కొందరు బీజేపీ నాయకులు శ్రీనివాసులునాయుడికి మద్దతు ఇస్తున్నారు. వైసీపీ ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎవరికీ మద్దతు ప్రకటించలేదు. రఘువర్మకు గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు.

సర్వం సిద్ధం

ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్

రెండు ఎమ్మెల్సీ స్థానాలకు 60 మంది అభ్యర్థులు పోటీ

ఓటు వేయనున్న 6.62 లక్షల పట్టభద్ర ఓటర్లు

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 22,493
- 10 మంది బరిలోకి దిగినా... పోటీలో తొమ్మిదిమందే
- తాడేపల్లిలో ఓటు వేయనున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

అమరావతి, విశాఖపట్నం, ఏలూరు, గుంటూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రశాంతంగా పోలింగ్ జరగడానికి తగిన చర్యలు తీసుకుంది. కృష్ణా - గుంటూరు, ఉభయ గోదావరి పట్టభద్రుల నియోజకవర్గాలకు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల్లో పట్టభద్రుల నియోజకవర్గాల్లో 6 లక్షల 62 వేల మంది ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది. మొత్తం 60 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 939 పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. పోలింగ్ బ్యాలెట్ పేపర్‌పై జరగనుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటర్లు తమ హక్కును వినియోగించుకోవచ్చు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి బరిలో 10 మంది అభ్యర్థులు నిలిచారు. అయితే వీరిలో సుంకరి శ్రీనివాసరావు అనే అభ్యర్థి పోటీ నుంచి తప్పుకున్నారు. పోలింగ్ రోజున 22,493 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 13,508 మంది పురుషులు, 8,985 మంది మహిళలు. 123 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 8,500 మంది భద్రతా సిబ్బందిని ఎన్నికల సంఘం వినియోగించనుంది. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ను ఏర్పాటు చేసింది. ఎండ తీవ్రను దృష్టిలో పెట్టుకుని మంచినీరు, టాయిలెట్స్, ర్యాంప్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు... కృష్ణా- గుంటూరు జిల్లాల పట్టభద్రుల స్థానానికి పోలింగ్‌కు 580 మంది పీవోలను, అసిస్టెంట్ పీవోలుగా 580 మందిని, రిజర్వ్ పోలింగ్ సిబ్బందితోపాటు ఇతర సిబ్బంది 1,159 మందిని, మైక్రో అబ్జర్వర్లుగా 515 మందిని... మొత్తం 2,833 మంది ఉద్యోగులు పోలింగ్ విధుల్లో పాల్గొననున్నారు. కాగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఈ నియోజకవర్గం ఓటర్లు కావడంతో వారు ఉదయం 9.05 గంటలకు తాడేపల్లి మండలంలోని ఉండవల్లిలోని గాదె రామయ్య - సీతారావమ్మ ఎంపీయూపీ స్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఉమ్మడి తూర్పు-పశ్చిమ గోదావరి పట్టభద్రుల పోలింగ్ ప్రక్రియలో... 545 మంది పీవోలుగా, మరో 545 మంది అసిస్టెంట్ పీవోలుగా, రిజర్వు పోలింగ్ సిబ్బందితోపాటు మరో 1080 మంది, మైక్రో అబ్జర్వర్లుగా 544 మంది... మొత్తం 2,714 మంది ఉద్యోగులు పోలింగ్ విధులు నిర్వర్తించనున్నారు. అదేవిధంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో మొత్తం 739 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తించనున్నారు. 148 మంది పీవోలు, మరో 148 మంది ఏపీవోలుగా, రిజర్వ్ పోలింగ్ సిబ్బందితోపాటు ఇతర సిబ్బంది 295 మంది, మైక్రో అబ్జర్వర్లుగా 148 మంది... మొత్తం 739 మంది ఉద్యోగులు, సిబ్బంది పోలింగ్ విధులు నిర్వర్తించనున్నారు. కాగా, ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులను అందించేందుకు టోల్ ఫ్రీ నంబర్ 18002331077, ఓటర్లు తమ ఓటు, పోలింగ్ స్టేషన్ వివరాలు తెలుసుకునేందుకు హెల్ప్‌లైన్ 1950 ఏర్పాటు చేశారు.

కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి

పోలింగ్‌కు సిద్ధమవుతూనే మార్చి 3న జరిగే కౌంటింగ్‌కూ ఏర్పాట్లు చేసింది. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఓట్ల లెక్కింపును సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలోను, కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లను గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ కళాశాలలోనూ, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్శిటీలోనూ జరగనుంది.

శ్రీత్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు

నరసరావుపేట, పెదకాకాని, అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కోటప్పకొండపై త్రికోటేశ్వరస్వామిని, అమరావతిలోని అమరేశ్వరాలయాన్ని, పెదకాకానిలోని మల్లికార్జునస్వామి ఆలయాలను హైకోర్టు న్యాయమూర్తులు పలువురు సందర్శించుకుని స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వీ.సుజాత, జస్టిస్ కే. సురేష్‌రెడ్డి, జస్టిస్ కృష్ణమోహన్ కోటప్పకొండలోని శ్రీత్రికోటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పెదకాకాని మల్లేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గుణరంజన్, జస్టిస్ హరిహరనాథశర్మ దర్శించుకుని శివపార్వతులకు ప్రత్యేక పూజలు జరిపించారు. అమరావతిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాలచాముండికా సమేత అమరేశ్వరాలయాన్ని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్‌తిహారి, జస్టిస్ జే సుమతి, జస్టిస్ సత్యప్రసాద్ సందర్శించారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

టీటీడీ ప్రాణదానం ట్రస్టుకు రూ.81 లక్షల విరాళం

తిరుమల, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు బుధవారం రూ.81 లక్షలు విరాళంగా అందాయి. చెన్నైకు చెందిన యాక్సెస్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ రూ.70 లక్షలు, వర ఫ్యూచర్ ఎల్ఎల్పీ అనే సంస్థ రూ.11 లక్షలు అందజేశాయి. ఈమేరకు దాత లు విరాళాల చెక్కులను తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేసి ప్రాణదానం ట్రస్టుకు వినియోగించాలని కోరారు.



రూ.70 లక్షల విరాళం చెక్కును అదనపు ఈవోకు అందజేస్తున్న దాతలు

సమాధులను ఆక్రమించడం హేయం

- ప్రభుత్వం వెంటనే స్పందించాలి: ఎన్జీ రంగా మేనకోడలు ప్రొ.పుష్పకుమారి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధులు ఎన్జీ రంగా, ఆయన శిష్యుడైన సుందరరావులకు చెందిన ఢిల్లీలోని సమాధులను తవ్వేసి, ఆ స్థలాన్ని ఆక్రమించుకోవడం అత్యంత హేయమైన చర్య అని రంగా మేనకోడలు ప్రొఫెసర్ వెలగా పుష్పకుమారి బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. మహనీయుల సమాధులను రూపుమాపేందుకు ప్రయత్నాలు జరగడం విచారకరమన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి కూడా ఈ చర్య సిగ్గు చేటని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. సమాధుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని భారతీయత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబు కోరారు.

కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రభాకరరావు

- మరో 3 రాష్ట్రాలకూ అధ్యక్షుల నియామకం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాలుగు రాష్ట్రాలకు ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులను నియమించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో ఆ వివరాలను వెల్లడించారు. ఏపీ అధ్యక్షుడిగా కామన ప్రభాకర రావు, ఛత్తీసగఢ్‌కు అభిషేక్ మిశ్ర, మధ్యప్రదేశ్‌కు ధర్మేంద్ర సింగ్ చౌహాన్, త్రిపురకు అశోక్ కుమార్ బైద్యలను నియమించారు.

'కోనసీమ మోనాలిసా' అంటూ బాలికపై పోస్టింగ్

- యువకుడిపై పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కుంభమేళాలో పూసలు అమ్మే మహిళను వీడియో తీసి.. మోనాలిసా అంటూ ప్రచారం చేయడంతో ఆమె పాపులర్ అయిపోయింది. ఆ ప్రభావంతోనేమో.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో ఆదివారం జరిగిన సత్తెమ్మతల్లి తీర్థంలో పూసలు అమ్ముకుంటున్న బాలికను సత్తి దేవిశ్రీప్రసాద్ అనే యువకుడు వీడియోతీసి ఇన్‌స్టాగ్రామ్‌లో 'కోనసీమ మోనాలిసా' అంటూ పోస్టింగ్ పెట్టాడు. ఈ పోస్టింగ్‌కు లక్షల్లో లైకులు వచ్చినా.. పదో తరగతి చదువుతున్న ఆమెను సహ విద్యార్థినులు ఎగతాళి చేయడంతో మనస్తాపానికి గురైంది. దీంతో ఆ బాలిక పినతల్లి ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం కేసు నమోదు చేశారు.

భారీగా గోవా మద్యం పట్టివేత

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం కొప్పర్రు గ్రామంలోని చేపల చెరువు వద్ద గోవా లేబుల్స్‌తో ఉన్న 4080 మద్యం బాటిళ్లను బుధవారం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. సంఘటనా స్థలంలో ఉన్న నరసాపురం మునిసిపల్ కౌన్సిలర్ బర్రె జయరాజుతో పాటు డి.రామకృష్ణ, గొల్లమందుల జయబాబు అనే వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. జయరాజు భార్య వెంకట రమణ ప్రస్తుతం నరసాపురం వైసీపీ మునిసిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఎక్సైజ్ సీఐ రాంబాబు విలేకర్లకు తెలిపిన వివరాల ప్రకారం.... రావి బ్రహ్మాజీ చేపల చెరువును వైసీపీ కౌన్సిలర్ జయరాజు లీజ్‌కు తీసుకున్నారు. ఇక్కడ అనధికారికంగా మద్యం బాటిళ్ల నిల్వ ఉంచారన్న పక్కా సమాచారంతో దాడి చేశామని, పట్టుబడిన మద్యం అంతా గోవా లేబుల్స్‌తో ఉన్నాయన్నారు. గోవా నుంచి మద్యం తెచ్చి అమ్ముతున్నారని, ఈమద్యం ఎలా వచ్చింది విచారిస్తున్నామన్నారు.

అమ్మను బయటికి గెంటేశారు!

- కోడలికి ఇల్లు అప్పగించాలన్న కోర్టు
- పోలీసులు, కోర్టు సిబ్బంది సమక్షంలో ఇంటికి తాళం వేసిన కొడుకు
- రోడ్డున పడ్డ తల్లి.. విజయనగరం జిల్లాలో ఘటన





కుర్చీలో కూర్చున్న నక్కా ఎర్రమ్మను గెంటి వేస్తున్న చిన్న కొడుకు, కోడలు.. తాళం వేసిన ఇంటి వద్ద ఎర్రమ్మ

గరివిడి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నవమాసాలూ మోసి.. కని పెంచిన తల్లిని ఇంటి నుంచి బయటికి గెంటేశాడో కొడుకు! నడవడానికి కాళ్లు కూడా సహకరించని ఆమెను కట్టుబట్టలతో కుర్చీతో పాటే బయటికి గెంటేశాడు. కోర్టు తీర్పు నేపథ్యంలోనే ఈ ఉదంతం జరగడంతో, దిక్కుతోచని ఆ తల్లి పోలీసులను ఆశ్రయించింది. విజయనగరం జిల్లా గరివిడి మండలం గొట్నంది గ్రామంలో మంగళవారం ఈ దారుణం చోటుచేసుకుంది. వివరాలివీ.. గొట్నంది గ్రామంలో నక్క ఎర్రమ్మకు (85) భర్త లచ్చుం నిర్మించిన ఇంట్లో ఉంటోంది. భర్త రెండేళ్ల కిందట మృతిచెందాడు. వృద్ధాప్య పింఛనుతో ఆమె జీవనం సాగిస్తోంది. ఆమెకు ఇద్దరు కుమారులు రామారావు, సింహాచలం, కుమార్తె రమణమ్మ ఉన్నారు. పెద్ద కుమారుడు రామారావు విశాఖలో, చిన్నోడు సింహాచలం హైదరాబాద్‌లో ఉంటున్నారు. కుమార్తె రమణమ్మ మెరకముడిదాం మండలం సాతంవలసలో ఉంటోంది. 2016లో చిన్న కుమారుడి భార్య సంజీవి పేరిట ఇల్లు మంజూరైంది. దీంతో ఎర్రమ్మ, లచ్చుం దంపతులు పూరిల్లును కూల్చి చిన్నకోడలు పేరిట మంజూరైన ఇంటిని నిర్మించుకున్నారు. ఆ సమయంలో ఎర్రమ్మ దంపతులు రూ.80వేలు వెచ్చించారు. అయితే, ఆ ఇల్లు తనకే చెందాలని చిన్నకొడుకు సింహాచలం కొద్ది సంవత్సరాలుగా అన్న రామారావుతో గొడవ పడుతున్నాడు. ఈ వ్యవహారం కోర్టుకు వెళ్లింది. విచారణ అనంతరం సింహాచలం భార్య సంజీవికే ఇల్లు అప్పగించాలని కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో సింహాచలం మంగళవారం పోలీసులు, కోర్టు సిబ్బంది సమక్షంలో.. ఇంట్లో ఉన్న తల్లిని బయటికి నెట్టేసి తాళం వేసి వెళ్లిపోయాడు. స్థానికులు చెబుతున్నా వినిపించుకోలేదు. అయితే, తాను బతికున్నంతవరకు ఈ ఇంటిలోనే ఉంటానని.. ఇది తానూ.. తన భర్త కష్టపడి కట్టుకున్న ఇల్లని ఎర్రమ్మ ఆవేదనను వ్యక్తం చేస్తోంది. ఆ తర్వాత ఆ వృద్ధురాలు గ్రామపెద్దల సహకారంతో బుధవారం గరివిడి పోలీసులను ఆశ్రయించింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

తెలివైన వ్యాపారి

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను నియంత అనకూడదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రశంసాపత్రం ఇవ్వడానికి కొద్దిగాముందు, ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా దురాక్రమణదారు కానేకాదని ఐక్యరాజ్యసమితిలో అమెరికా నిర్ధారించింది. అమెరికా, రష్యా ఒకేమాటమీదకు రావడం, ఏకరీతిన ఓటుచేయడం ఎన్నడైనా చూశామా? యుద్ధానికి సంబంధించిన రెండు తీర్మానాల్లో రష్యాతో కలసి అమెరికా ఓటుచేయడం వందరోజుల ట్రంప్ ఏలుబడిలో వచ్చిన సమూలమైన మార్పుకు నిదర్శనం. ఉక్రెయిన్‌కీ, పాశ్చాత్య మిత్రదేశాలకు ద్రోహం చేస్తూ, ట్రాన్స్ అట్లాంటిక్ బంధాన్ని తీసిపారేస్తూ అమెరికా తీసుకున్న ఈ వైఖరికి రష్యా అధ్యక్షుడు పుతిన్ ఎంతగానో సంతోషిస్తున్నారు.

యుద్ధానికి మూడేళ్ళయిన సందర్భంలో, తక్షణమే దానిని ముగించాలంటూ భద్రతామండలిలో అమెరికా ప్రవేశపెట్టిన తీర్మానంలోని భాష చైనా రష్యాలకు తెగనచ్చేసింది. ఉక్రెయిన్ పక్షాన, యూరోపియన్ దేశాలను కూడా కలుపుకొని రష్యాను ఒంటరిచేయడం లక్ష్యంగా ఇంతకాలమూ అమెరికా ఉపయోగించిన భాషకు ఇది పూర్తి భిన్నం. యుద్ధంతో ముడిపడిన అన్ని పాపాలకూ, ప్రపంచం ఎదుర్కొంటున్న సర్వ సమస్యలకు రష్యాయే కారణమంటూ నిందిస్తూ వచ్చిన అమెరికా ఇప్పుడు యూరప్ దేశాల అండదండలతో ఉక్రెయిన్ ప్రవేశపెట్టిన తీర్మానాల్లో గతంలో వాడిన పదాలకు అభ్యంతరం చెబుతోంది. సర్వప్రతినిధి సభలో తగ్గాల్సి వచ్చినందుకు, భద్రతామండలిలో తన మాట నెగ్గించుకుంది. ఉక్రెయిన్‌నూ, ఐరోపాదేశాలను పక్కనబెట్టి, రష్యాతో నేరుగా అమెరికా చర్చలు ఆరంభించిన నేపథ్యంలో, ఈ తీర్మానాలు ఆత్మీయుల మధ్య ఒక్కసారిగా పెరిగిన ఉద్రిక్తతలకు సూచికలు.

ఉక్రెయిన్ కారణంగానే యుద్ధం మొదలైందనీ, తెలివితక్కువ జెలెన్‌స్కీ వల్లనే ఆ దేశం ఆర్థికంగా పతనమైందనీ, రష్యా శక్తిసామర్థ్యాలు తెలిసి కూడా ఈ నియంత మొండిగా యుద్ధానికి దిగాడని ట్రంప్ ఇటీవల నోరుపారేసుకున్న విషయం తెలిసిందే. ఉక్రెయిన్‌తో ట్రంప్ అతిఖరీదైన బేరం కుదుర్చుకోబోతున్నాడని, రెండువందల బిలియన్ డాలర్ల ఆయుధ సాయం చేసినందుకు ప్రతిఫలంగా ఓ ఐదువందల బిలియన్ డాలర్ల విలువైన అరుదైన ఖనిజాలను అమెరికన్ కంపెనీలు కొల్లగొట్టబోతున్నాయని అంతా అనుకుంటున్నదే. జెలెన్‌స్కీని దారికితేవడానికి ఆయన చేసిన ప్రయత్నం ఫలించినట్టే. ఉక్రెయిన్ అమ్మకానికి సిద్ధంగా లేదంటూ మొదట్లో ఏవో గంభీరమైన మాటలు వినబడ్డాయి కానీ, రేపోమాపో ఉక్రెయిన్ అధినేత సంతకాలు పెట్టడానికి అమెరికా రావచ్చు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌తో భేటీ సందర్భంలో ట్రంప్ గౌరవంగా వ్యవహరించలేదని, తీసిపారేసినట్టు మాట్లాడారన్న విశ్లేషణలను అటుంచితే, ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టి యుద్ధాన్ని ముగించడం సరికాదని మాక్రాన్ చేసిన వ్యాఖ్యలపై ట్రంప్ ఎంత పెడసరంగా మాట్లాడారో చూశాం. మనం స్మార్ట్ కాకపోతే యుద్ధం కొనసాగుతూనే ఉంటుందన్న ట్రంప్ వ్యాఖ్యలో యుద్ధం నుంచి అనేకరెట్లు దండుకోబోతున్న సందేశం ఉంది. రష్యా ఆక్రమించుకున్న భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడం సులువు కాదని అంటూనే, జెలెన్‌స్కీ వచ్చి ఒప్పందంమీద సంతకాలు చేస్తారన్న ఆశనీ ప్రకటించారు. మరోపక్క, రష్యాతో కూడా తాను వ్యాపారం చేయబోతున్నానని, ఒప్పందాలు కుదుర్చుకోవచ్చునని ట్రంప్ అంటున్నారు. ఈయన ఈ మాట అన్న రెండుగంటల్లోనే పుతిన్ అన్ని లెక్కలూ వేసుకొని, మా దగ్గర కూడా అరుదైన ఖనిజాలు, లోహాలు ఉన్నాయి, మాస్కోతో మెరుగైన సంబంధాలు కొనసాగిస్తే చక్కగా వ్యాపారం చేసుకోవచ్చునని ప్రకటించారు. తాను ఆక్రమించుకున్న ఉక్రెయిన్ భూభాగాలను కూడా ఆయన ఈ ఆఫర్‌లో ట్రంప్‌కు అమ్మకానికి పెట్టేశారు.

యుద్ధానికి ముగింపు పలికే పేరిట అమెరికా–రష్యా స్నేహం బలపడుతోంది, ఉప్పు–నిప్పులా ఉండే ఈ రెండుదేశాలు ఏకంగా ఇచ్చిపుచ్చుకోవడానికి సిద్ధపడుతున్నాయి. సౌదీ చర్చలు త్వరలోనే కొలిక్కివస్తాయని, పుతిన్–ట్రంప్ కరచాలనం కూడా సమీపంలోనే ఉందని విశ్లేషకులు అంటున్నారు. పరిష్కారం పేరిట ట్రంప్ ఆధ్వర్యంలో జరిగే ఆస్తిపంపకాల్లో అంతిమంగా జెలెన్‌స్కీకి దక్కే వాటా ఎంతో తెలియదు కానీ, ట్రంప్ వ్యాపారదక్షత చూసిన తరువాత చాలామందికి రెండు పిల్లులు–రొట్టెముక్క–కోతి కథ గుర్తుకువస్తోంది.

హిందీ పెత్తనం కాదు, భాషా వైవిధ్యం కావాలి

త్రిభాషా సూత్రంపై మరోసారి విస్తృత రాజకీయ చర్చకు పరిస్థితులు పక్వమవుతున్నాయి. విద్యా రంగ వాస్తవాలను నిశితంగా పరిశీలిస్తే ఏక భాషా విధానమే అమలవుతున్నట్లు స్పష్టమవుతుంది. ఆంగ్ల భాషలోనే విద్యా బోధన జరగాలన్న నిశ్చిత భావన సహజ వివేకానికి, విద్యపై విజ్ఞుల దార్శనికతకు విరుద్ధంగా ఉన్నది. మరింత ఘోరమైన విషయమేమిటంటే భాషా వైవిధ్యం నుంచి ఏక భాషా స్వామ్యానికి తిరోగమించడాన్ని రాజ్యవ్యవస్థే ప్రోత్సహించడం, పైగా ఆ తిరోగతిని ఆధునికతగా ప్రస్తుతించడం జరుగుతోంది!

పాఠశాల బాలలకు మూడు భాషలు బోధించాలన్న విధానం అధికారికంగా త్రిభాషా సూత్రంగా సుప్రసిద్ధమయింది. 1968లో ఈ సూత్రానికి సర్వజనామోదం లభించింది. ఈ ప్రకారం పాఠశాల బాలలకు 'హిందీ భాషా రాష్ట్రాలలో హిందీ, ఇంగ్లీషు, ఆధునిక భారతీయ భాష (ఏదైనా ఒక దక్షిణాది భాష)ను బోధించాలి; హిందీయేతర రాష్ట్రాలలో హిందీ, ఇంగ్లీషు ప్రాంతీయ భాషను బోధించాలి'. దక్షిణ భారతావనిలో హిందీ వ్యతిరేక నిరసనలు వెల్లువెత్తిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ముఖ్యమంత్రుల సమావేశంలో ఈ త్రిభాషా సూత్రం ఆమోదం పొందింది. తొలుత రాధాకృష్ణన్ కమిషన్ (1948) ప్రతిపాదించిన ఈ త్రిభాషా సూత్రాన్ని విద్యావేత్త కొఠారి నేతృత్వంలోని తొలి విద్యా కమిషన్ అంగీకరించింది. దరిమిలా 1960లు, 1980ల్లో కేంద్రం రూపొందించిన ప్రథమ, ద్వితీయ జాతీయ విద్యా విధానాలలో ఈ త్రిభాషా సూత్రం భాగమయింది.



త్రిభాషా సూత్రానికి హేతుబద్ధమైన ప్రాతిపదికలు ఉన్నాయి. భారత్‌లో అనేక భాషలు మాట్లాడతారు. ఒకటి కంటే ఎక్కువ భాషలలో మాట్లాడే వ్యక్తులు, జన సముదాయాలు అనేకమున్నాయి. సమున్నతమైన బహు భాషా సంస్కృతి వర్ధిల్లుతున్న దేశం మనది. భారతీయ అస్తిత్వంలో భాగమై భారతీయతను విశిష్టంగా నిర్వచిస్తున్న భాషా వైవిధ్యం కొనసాగేందుకు, ఆ భాషా బాహుళ్యాన్ని ప్రోత్సహించేందుకు మన విద్యా వ్యవస్థ ఒక ప్రధాన ఆలంబన కావాలి. బహు భాషల్లో విద్యాభ్యాసం ఆలోచనాశీలతను, చింతనాశక్తిని, సృజనాత్మకతను, విద్యాభివృద్ధికి, సామాజిక సహనానికి విశేషంగా తోడ్పడగలదనేందుకు శాస్త్రీయ రుజువులు ఉన్నాయి. మరి బహుభాషా సంస్కృతిని ప్రోత్సహించేందుకు, పరిపుష్టం చేసేందుకు త్రిభాషా సూత్రంను అమలుపరచడం కంటే మరో మేలు మార్గం మరేముంది? బాలలు అంచెలంచెలుగా మూడు కంటే ఎక్కువ భాషలు నేర్చుకోవాలని, ఎన్ని భాషలు అదనంగా నేర్చుకుంటే మాతృభాష, ద్వితీయ భాషలో ప్రావీణ్యాలను పెంపొందించుకోవడం సులభతరమవుతుందని, అధ్యయన ప్రగాఢత సమృద్ధమవుతుందని భాషావేత్తల, విద్యావేత్తల బృందం ఒకటి స్పష్టంగా చెప్పింది.

మరి ఇప్పుడు త్రిభాషా సూత్రం ఎందుకు వివాదాస్పదమవుతోంది? జాతీయ విద్యా విధానం–2020ని అమలు పరిచేందుకు తమిళనాడు ప్రభుత్వం సుముఖంగా లేకపోవడంతో ఆ రాష్ట్రానికి సర్వ శిక్షా అభియాన్ కింద ఇవ్వవలసిన నిధుల విడుదలను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. జాతీయ విద్యా విధానాన్ని అమలుపరిచి తీరాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాన్ని పాటించేందుకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్‌కె స్టాలిన్ నిరాకరిస్తున్నారు. తమ పార్టీ మొదటి నుంచీ త్రిభాషా సూత్రాన్ని వ్యతిరేకిస్తూ వస్తోందని స్టాలిన్ అంటున్నారు.. తమ రాష్ట్రం ఎప్పుడూ పాఠశాల బాలలకు రెండు భాషల– తమిళం, ఆంగ్లం– బోధిస్తుందని ఆయన అన్నారు. త్రిభాషా సూత్రం ప్రకారం పాఠశాల విద్యలో మూడో భాషను కూడా బోధించి తీరాలన్నది హిందీ భాషను తమపై రుద్దేందుకు ఒక సాకు మాత్రమేనని ఆయన విమర్శించారు. స్టాలిన్‌తో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విభేదిస్తూ తమిళనాడు ప్రభుత్వం రాజ్యాంగానికి నిబద్ధమై ఉండాలని స్పష్టం చేశారు. త్రిభాషా సూత్రం విషయంలో తాము కట్టుబడి ఉండాల్సిన యుక్తమైన రాజ్యాంగ అధికరణ, నిబంధన ఏమిటో చెప్పాలని కేంద్రమంత్రిని తమిళనాడు ముఖ్యమంత్రి అడిగారు. భావోద్వేగపూరితమైన వాద ప్రతివాదాలివి. అందునా వచ్చే ఏడాది తమిళనాడు శాసనసభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు పునః ప్రారంభమయినప్పుడు ఈ భాషా ఘర్షణ పార్లమెంటు లోపల, బయటా మరింత తీవ్రమయ్యే అవకాశమున్నది.

త్రిభాషా సూత్రాన్ని అమలుపరచడంపై కేంద్ర ప్రభుత్వానికి నిబద్ధత ఉన్నదా? హిందీ భాషను హిందీయేతర భాషీయులపై రుద్దకుండా ఉండడం పట్ల కేంద్రానికి చిత్తశుద్ధి ఉన్నదా? ఉన్నట్లయితే రాష్ట్రాలకు విద్యారంగ సంబంధిత నిధులు మంజూరు చేసేందుకు త్రిభాషా సూత్రం అమలును ఒక షరతుగా నిర్దేశించకూడదు. 1968లో వలే సమస్త రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశాన్ని నిర్వహించి పాఠశాల విద్యలో భాషా వైవిధ్యంపై ఒక జాతీయ ఏకాభిప్రాయాన్ని సాధించాలి.

త్రిభాషా సూత్రాన్ని ఆక్షేపించేందుకు, అనుమానించేందుకు డీఎంకె ప్రభుత్వానికి సహేతుకమైన కారణాలు ఉన్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం సమాఖ్య పాలనా విధానాన్ని తరచు ఉల్లంఘిస్తోంది. తమిళనాడు రాష్ట్ర గవర్నర్ భారతీయ జనతా పార్టీ పక్షాన నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారు. విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను మోదీ సర్కార్ పదే పదే అక్రమంగా వినియోగించుకుంటుంది. విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్‌ల నియామకాలకు యూజీసీ కొత్త మార్గదర్శక సూత్రాలు ఇందుకొక తాజా ఉదాహరణ. విద్యా విధానాల అమలు విషయంలో, అందునా బోధనా మాధ్యమం వంటి సున్నితమైన విషయమై రాష్ట్రాలు తమ నిర్దేశాలను పాటించేలా కేంద్ర నిధుల మంజూరును ఒక సాధనంగా ఉపయోగించుకోవడమనేది సమంజసమైన పాలన కాదు, కాబోదు. ఎందుకంటే అది రాజ్యాంగ విరుద్ధమైనది. సమాఖ్య స్ఫూర్తిని ఉల్లంఘించేది.



■ యోగేంద్ర యాదవ్

సరే, మోదీ ప్రభుత్వ జాతీయ విద్యా విధానంతో అనేక సమస్యలు ఉన్నాయి. త్రిభాషా సూత్రం వాటిలో ఒకటి మాత్రమే. ప్రథమ, ద్వితీయ జాతీయ విద్యా విధానాలలో భాగంగా ఉన్న త్రిభాషా సూత్రాన్ని జాతీయ విద్యా విధానం–2020 కూడా పునరుద్ఘాటించింది. వాస్తవానికి మోదీ సర్కార్ జాతీయ విద్యా విధానం హిందీని ప్రస్తావించకపోవడం ద్వారా త్రిభాషా సూత్రాన్ని అస్పష్టపరిచింది. ఈ ప్రకారం ఒక రాష్ట్ర ప్రభుత్వం తాను ఎంపిక చేసిన ఏ మూడు భాషలనైనా పాఠశాల బాలలకు బోధించవచ్చు. అయితే ఆ మూడు భాషలలో రెండు తప్పనిసరిగా దేశీయ భాషలు అయివుండాలి. ప్రాచీన భాషలు అయిన సంస్కృతం, తమిళంను ఆ రెండు దేశీయ భాషలలో భాగంగా పరిగణించవచ్చు. ఈ దృష్ట్యా తమిళనాడు ప్రభుత్వం కోరుకుంటే, తమిళంతో పాటు మళయాళం, తెలుగు, కన్నడ భాషలలో ఒకదాన్ని, ఆంగ్ల భాషను బోధించవచ్చు. త్రిభాషా సూత్రం ప్రకారం తమిళం, ప్రాచీన తమిళం, ఆంగ్ల భాషను బోధించవచ్చు. హిందీ భాషను రుద్దుతారనే భయం లేకుండా తమిళనాడు ప్రభుత్వం నిరాటంకంగా త్రిభాషా సూత్రాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు.

ఈ వాస్తవాల దృష్ట్యా తమిళనాడు ముఖ్యమంత్రి త్రిభాషా సూత్రాన్ని వ్యతిరేకించడానికి బదులు (అన్ని రాష్ట్రాలలోను దానిని ఒకే విధంగా అమలుపరిచిన పక్షంలో) ఆమోదించాలి. హిందీ భాషా రాష్ట్రాలలో మూడో భాషగా తమిళం లేదా మరేదైనా దక్షిణాది భాషను బోధించేందుకు సిద్ధమైతే తమిళనాడు పాఠశాలల్లో కూడా హిందీని ప్రవేశపెట్టేందుకు స్టాలిన్ అంగీకరించాలి. అట్లా కాకపోతే ఆంగ్లం, తమిళంతో పాటు (హిందీ రాష్ట్రాలు మూడో భాషగా సంస్కృతంను బోధిస్తున్నట్టు) ప్రాచీన తమిళంను మూడో భాషగా ప్రవేశపెట్టవచ్చు.

అటువంటి చర్య త్రిభాషా సూత్రానికి సంబంధించిన ఒక వాస్తవాన్ని తేటతెల్లంగా ప్రకటిస్తుంది. ఆ సూత్రం నిర్దేశిస్తున్న భాషా వైవిధ్యాన్ని ఉద్దేశపూర్వకంగా ఉపేక్షిస్తుంది హిందీరాష్ట్రాలే కానీ, తమిళనాడు కాదన్నదే ఆ వాస్తవం. 1960ల్లో త్రిభాషా సూత్రంపై తొలి ఏకాభిప్రాయం కుదిరింది. హిందీ భాషా రాష్ట్రాలు మరో ఆధునిక భారతీయ భాష, ముఖ్యంగా ఏదైనా ఒక దక్షిణ భారతీయ భాషను బోధించాలన్నదే ఆ సార్వత్రిక సమ్మతి. ఆ ప్రకారం తొలుత ఉత్తర్‌ప్రదేశ్‌లో తమిళం, హర్యానాలో తెలుగు, బిహార్, రాజస్థాన్ మొదలైన ఉత్తరాది రాష్ట్రాల్లో ఇతర దక్షిణాది భాషలను బోధించేందుకు గట్టి ప్రయత్నాలే జరిగాయి. అయితే కొద్ది కాలానికే హిందీ రాష్ట్రాలు మూడో భాష నిబంధన అమలుకు ఒక దగ్గరి దోవను కనుగొన్నాయి. అది సంస్కృత భాషా బోధన! చాల ప్రాథమికంగా, యాంత్రికంగా బట్టీ వేయించడం ద్వారా ఆ పురా భాషను 'మూడో భాష'గా నేర్పించడం ప్రారంభమయింది అలా మరో ఆధునిక భారతీయ భాషను బోధించే అవసరాన్ని పూర్తిగా దాటవేశారు. నిజం చెప్పాలంటే త్రిభాషా సూత్రం ఒక అసమ ఒప్పందంగా పరిణమించింది: హిందీయేతర భాషీయులు హిందీని నేర్చుకోవడం తప్పనిసరి అయింది; అయితే హిందీ భాషీయులు దక్షిణాది భాష నొకదాన్ని నేర్చుకునేందుకు సుహృద్భావపూర్వకంగా ప్రతిస్పందించలేదు. దీంతో దక్షిణ భారతావనిలో త్రిభాషా సూత్రానికి వ్యతిరేకంగా రాజకీయ ఆగ్రహావేశాలు వెల్లువెత్తాయి. ఉత్తరాది వారి దబాయింపును సవాల్ చేయవలసిన సమయం ఆసన్నమయింది.

త్రిభాషా సూత్రాన్ని అమలుపరచడంపై కేంద్ర ప్రభుత్వానికి నిబద్ధత ఉన్నదా? హిందీ భాషను హిందీయేతర భాషీయులపై రుద్దకుండా ఉండడం పట్ల కేంద్రానికి చిత్తశుద్ధి ఉన్నదా? ఉన్నట్లయితే రాష్ట్రాలకు విద్యారంగ సంబంధిత నిధులు మంజూరు చేసేందుకు త్రిభాషా సూత్రం అమలును ఒక షరతుగా నిర్దేశించకూడదు. 1968లో వలే సమస్త రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశాన్ని నిర్వహించి పాఠశాల విద్యలో భాషా వైవిధ్యంపై ఒక జాతీయ ఏకాభిప్రాయాన్ని రూపొందించాలి. మూడో భాషకు ప్రత్యామ్నాయంగా సంస్కృత భాషా బోధనతో తప్పించుకునేందుకు హిందీ భాషా రాష్ట్రాలను ఎట్టి పరిస్థితులలోను అనుమతించకూడదు. భాషా సమస్యపై రాజకీయ చర్చను కొత్త పుంతలు తొక్కించి హిందీ స్వామ్యం కాకుండా బహుభాషా సంస్కృతిని పెంపొందించేందుకు ప్రాధాన్యమివ్వాలి. మన విద్యా విధానంలో ఆంగ్ల భాష ఆధిపత్యం రాజ్యమేలుతుంది. విద్యా బోధనలో ఇంగ్లీషు భాష ప్రాబల్యాన్ని తొలగించడమనేది చాలా అవసరం. ఇది మన రాజకీయవేత్తల దీక్షాదక్షతలకు ఒక పరీక్ష, సందేహం లేదు. సర్వత్రా ముఖ్యంగా విద్యారంగంలో ఆంగ్ల భాషా ఆధిపత్యం నుంచి బయటపడడం కంటే రాజ్య వ్యవస్థ నిరంకుశత్వాన్ని ప్రతిఘటించడం, పారిశ్రామిక –సైనిక రంగాల భాగస్వామ్యాన్ని ఎదుర్కోవడం చాలా సులువు సుమా!

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

తూర్పు కనుమలు ఉపాధి గనులు

ఆంధ్రప్రదేశ్‌లో అపార ఉద్యోగ అవకాశాలు ఉన్న రంగం మొక్కలు తయారీ. అంటే నర్సరీ పరిశ్రమ. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ మొక్కల పుట్టిల్లుగా ఉండేది. కాలక్రమేణా ఆంధ్రప్రదేశ్ నర్సరీ రంగంలో చాలా మార్పులు వచ్చాయి. ఉత్పత్తిదారులుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ నర్సరీ రైతులు కేవలం వ్యాపారులుగా మారారు. దీనివల్ల నర్సరీ రంగంలో అపార అవకాశాలను అందిపుచ్చుకోవడంలో రాష్ట్రం వెనుకబడింది. ఈ అవకాశం అందుకుని మహారాష్ట్రలోని పూణే, కేరళలోని చాలా ప్రాంతాలు, బెంగాల్‌లోని 24 పరగణాలు, ఇతర ప్రాంతాల్లో నర్సరీ రంగం బాగా అభివృద్ధిచెంది వారు ఉత్పత్తిదారులుగా మారారు. ఫలితంగా ఆయా రాష్ట్రాల్లో లక్షలాది ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయి.

మన రాష్ట్రంలో నర్సరీ రంగం ప్రధానంగా కడియం పరిసర మండలాల్లో వ్యాపించి ఉంది. 1980 ప్రాంతంలో వీరు మొక్కల ఉత్పత్తిదారులుగా ఉండేవారు. తరువాత వచ్చిన మార్పుల వల్ల కడియం ప్రాంతం వెనకబడిపోయింది. దీనికి ప్రధానమైన కారణం నర్సరీ రంగంలో వచ్చిన కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందలేకపోవడమే. దీనిని మహారాష్ట్ర అందిపుచ్చుకుంది. అక్కడి ప్రభుత్వ సహకారం, అనుకూల వాతావరణం కలిసివచ్చింది. ఫలితంగా దేశంలో మహారాష్ట్ర.. ముఖ్యంగా పూణే ప్రాంతం నర్సరీ హబ్‌గా మారింది. లక్షలాదిమందికి ఉపాధి లభించింది. మహారాష్ట్ర ప్రభుత్వం నర్సరీ రంగాన్ని, ఉద్యానవన పరిశ్రమలను ప్రోత్సహించింది. పింప్రి దగ్గర ఇంద్రాణి నది పరివాహక ప్రాంతంలో వేలాది ఎకరాలలో పూల సాగుకు ఒక ప్రత్యేకమైన పారిశ్రామిక ప్రాంతాన్ని కేటాయించింది. దానితో నర్సరీ పరిశ్రమ పూణే పరిసర ప్రాంతాలలో విస్తరించింది. పూల సాగుకు అవసరమైన మొక్కలను తయారు చేయడంతో పాటు ఇతర అలంకరణ మొక్కలను కూడా పెద్ద ఎత్తున తయారు చేయడం ప్రారంభించారు. ఈ ప్రాంతంలో వందలాది టిష్యూ కల్చర్ లేబరేటరీలు ఏర్పాటయ్యాయి. సబ్సిడీలతో పాటు శీతల గిడ్డంగులు, నీరు, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పాలి హౌస్‌లు వంటి ఇతర మౌలిక సదుపాయాలు అందించింది. తద్వారా మహారాష్ట్ర ప్రభుత్వం నర్సరీలను ఒక ప్రధాన ఉపాధి మార్గంగా మలిచింది. ఈ హరిత పరిశ్రమను ఒక మంచి పారిశ్రామిక అభివృద్ధిగా భావించి ప్రోత్సహించింది. దీనితో అత్యంత చవకగా పూణే ప్రాంతాల్లో మొక్కలు లభించడం వల్ల ఇతర ప్రాంతాల నర్సరీ వ్యాపారులు పూణే మీద ఆధారపడ్డారు. మన మొక్కల తయారీ కుంటుబడిపోయింది. కొత్త తరం రంగంలోకి వచ్చింది. వీరు మొక్కలు తెచ్చి అమ్ముకునేందుకు పరిమితమై, ఉత్పత్తిని వదిలేశారు. దీనితో మనకి దక్కాల్సిన ఉపాధి అవకాశాలు దక్కకుండా పోయాయి.



మొక్కల ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిందల్లా సంబంధిత నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి కేంద్ర వ్యవసాయ శాఖ నుంచి ఈ ప్రత్యేక పథకానికి నిధులు వచ్చేలా చూడడం. మహారాష్ట్రలో లాగ తూర్పు కనుమల్లో ప్రత్యేకమైన నర్సరీ పారిశ్రామిక వాడను నెలకొల్పడం. తూర్పు కనుమల్లో ఉన్న నీటి వనరులను చక్కగా వినియోగించుకోవడం.

అయితే ఇప్పటికీ మనకు చాలా అవకాశాలు ఉన్నాయి. మంచినీరు, అనువైన వాతావరణం ఉంటే లక్షలాది మందికి నర్సరీ పరిశ్రమ ద్వారా ఉపాధి కల్పించవచ్చు. పూణే లాంటి వాతావరణం మనకు చాలా ఎక్కువ ఉంది. చిత్తూరు పరిసర ప్రాంతాలు, మదనపల్లి హార్సిలీ హిల్స్ ప్రాంతం. విస్తారమైన తూర్పు కనుమలు మరొక ఎత్తు. ఇక్కడ సహజంగానే ఉండే చల్లటి వాతావరణం మొక్కలు ఉత్పత్తికి ప్రాణప్రదం. సీలేరు, చింతపల్లి, పెదబయలు, పాడేరు, అరకు, డుంబ్రిగుడ ప్రాంతాల్లో మనం మొక్కల ఉత్పత్తి కేంద్రాలను అభివృద్ధి చేయవచ్చు. దీనివల్ల తూర్పు కనుమల్లో ఉండే గిరిజనులకు ఉపాధి అవకాశాలకు కొదవ ఉండదు. నర్సరీ, పూల సాగు, ఉద్యాన పంటలు పరిశ్రమ స్థాయిలో అభివృద్ధి చెందుతాయి. ప్రస్తుతం ఇవి నమూనాలకే ప్రయోగాలు జరుగుతున్నాయి. అలాగే మన రాష్ట్రం నుంచి దేశ విదేశాలకు మొక్కలను, పూలను ఎగుమతి చేయవచ్చు.

దీనికి కావలసింది చిత్తశుద్ధి. టిష్యూ కల్చర్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకురావడం, సహజ వనరులను సద్వినియోగం చేసుకోవడం, ప్రభుత్వం తగినంత నిధులను వినియోగించి నర్సరీ పరిశ్రమను ఈ ప్రాంతంలో విస్తరించేలా చేయడం జరగాలి. దీనికి అవసరమైన సలహా సంప్రదింపులను రాష్ట్రంలో ఉన్న నర్సరీ సంఘాల ద్వారా సమీకరించాలి. వారిని కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడం అవసరం. ఇలా చేయడం వల్ల గిరిజన ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగాన్ని నిర్మూలించవచ్చు. అలాగే మంచి వాతావరణంలో ప్రపంచ స్థాయిలో ప్రామాణికత కలిగిన మొక్కలను మనం ఉత్పత్తి చేయవచ్చు. అప్పుడు దేశంలోనే మొక్కల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానానికి చేరుకుంటుంది. దీనికి ప్రభుత్వం చేయాల్సిందల్లా సంబంధిత నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి కేంద్ర వ్యవసాయశాఖ నుంచి ఈ ప్రత్యేక పథకానికి నిధులు వచ్చేలా చూసుకోవడం. మహారాష్ట్రలో లాగ తూర్పు కనుమల్లో ప్రత్యేకమైన నర్సరీ పారిశ్రామిక వాడను నెలకొల్పడం, తూర్పు కనుమల్లో ఉన్న నీటి వనరులను వినియోగించుకోవడం వంటి చర్యలు చేపట్టాలి.

ఈ ఉద్యానవన పరిశ్రమ వల్ల లాభాలేమిటంటే– గిరిజన ప్రాంతాలలో వేలాదిమందికి ఉపాధి లభిస్తుంది; మన రాష్ట్రం నుంచి మేలైన మొక్కల ఉత్పత్తి పెరుగుతుంది; ఈ మొక్కలను అనేక రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి చేయవచ్చు; వీటివల్ల మన రాష్ట్రం మొక్కల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలుస్తుంది; నర్సరీ పరిశ్రమ వృద్ధి చెందుతుంది. దీనితో అనేక అనుబంధ పరిశ్రమలు కూడా ఏర్పాటవుతాయి.

• చలపతిరావు ఆకుల
అధ్యక్షుడు, నర్సరీ గ్రోయర్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్

వర్ణరహిత సమాజంతోనే సమతాభారతి

కులవ్యవస్థ నశించిపోవాలనీ, ఆ మార్పు ద్వారా సమసమాజ స్థాపన జరగాలనీ, సామాజికన్యాయం సిద్ధించాలనీ ఉపన్యాసాలివ్వటం ఒక పెద్ద రాజకీయ మోసం. ఎందుకంటే కులం పుట్టింది వర్ణం వల్ల. వర్ణం పోనిదే కులం పోదు. సంస్థాగత వివక్షను తొలగిస్తే హిందూమతం ఉత్తమమైనదని ఒప్పుకోవటంలో సెక్యులరిస్టులకు కూడా అభ్యంతరం ఉండకపోవచ్చు. సంస్థాగత వివక్ష అంటే వర్ణవ్యవస్థ, దానివల్ల ఉద్భవించిన కులవ్యవస్థ.

చాతుర్వర్ణ వ్యవస్థలోని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనబడే నాలుగు వర్ణాల సోపాన క్రమం గురించి అందరికీ తెలుసు. ఈ క్రమానుగత శ్రేణికి బాహ్యులు, అంటే వర్ణబాహ్యులు, పంచములు– వీరు అంటరానివారు. శూద్రుల వృత్తిహక్కు క్షుద్రవృత్తులకే పరిమితం. పంచముల వాటాకు ఉన్నది హీన వృత్తులు. శూద్రవర్ణం విధి పైమూడు వర్ణాలవారికి సేవలు చెయ్యటం. ఇది సంస్థాగత వ్యవస్థ. సేవా వర్ణానికి పటిష్టమైన, మార్చుకోవీలులేని వృత్తి విభజన చాలా అవసరం. లేకపోతే, ఉదాహరణకు బట్టలుతకటం తేలికైన పని అయితే అందరూ ఆ వృత్తినే కోరుకుంటారు. కులాలున్నది శూద్రులూ, పంచముల్లోనే. వాటికి పైనున్న మూడూ కులాలు కాదు, వర్ణాలు. కాబట్టి హేతుబద్ధమైన వర్ణవ్యవస్థ, కులవ్యవస్థ అనే అవ్యవస్థగా ఎవరి కుట్రవల్లో మార్పు చెంది హిందూమతానికి లేని కళంకం తెచ్చిపెట్టిందని ఎవరూ గుండెలు బాదుకోనక్కరలేదు. వర్ణవిభజనలోనే కులవిభజన మిళితమై ఉంది. అసలు వర్ణవిభజన లక్ష్యమే అది. శూద్రవర్ణం వృత్తిసమూహాలుగా విభజించటానికే ఏర్పాటు చేయబడింది. పంచములూ అంతే.

కులరహిత సమాజం అనటం ఎందుకు రాజకీయ మోసమో చూద్దాం. కులం నశిస్తే శూద్రులు శూద్రుల్లోనూ, పంచములు పంచముల్లోనూ – అంటే ఎవరి వర్ణంలో వాళ్ళు – పరస్పరం సమానులౌతారు. కానీ వర్ణవ్యవస్థలో అట్టడుగునే ఉంటారు. వర్ణవ్యవస్థ పటిష్టంగానే ఉండి, కులవ్యవస్థ మాత్రం నశిస్తే సంస్థాగత వివక్ష అలాగే ఉంటుంది. కనుక సామాజికన్యాయం కావాలనే సంస్కరణాభిలాషులకు ఒక మనవి ఏమిటంటే–మీ లక్ష్యం వర్ణరహిత సమాజం కావాలి, కులరహిత సమాజం కాదు. వృత్తిరహిత సమాజం ఎలాగూ ఉండదు.

హిందూమతంలో సంస్థాగత, వివక్షాభరిత వర్ణ సోపానక్రమం తొలగించి, మతాంతరీకరణ చట్టాలకు లోబడి, అన్యమతస్థులు సనాతనధర్మంలో చేరటానికి అవకాశం కల్పిస్తే సమతాభారతి సిద్ధించటానికి గట్టి పునాది పడుతుంది. కానీ, ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఆర్థిక అసమానతలు తొలగకుండా సామాజిక అసమానతలు తొలగవు. అందువల్ల మన విధానాలు సామాజిక సంస్కరణలకూ, ప్రజలకు ఆర్థిక అవకాశాలు కల్పించటానికీ మధ్య సమతూకంగా ఉండాలి.

– కొమ్మన పట్టాభిరామయ్య

పేదల సొంతింటి కల ఫలించేనా?

పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజల ఆశల్లో సొంత ఇల్లు అత్యంత ప్రధానమైంది. ఇల్లు కట్టి చూడు, పెళ్లి చేసి చూడు అనే నానుడి వెనకాల సొంత ఇల్లు పట్ల జనసామాన్యంలో ఉన్న ఆశ వ్యక్తమవుతున్నది. జీవితంలో ఆర్థిక భద్రత, సామాజిక స్థాయి పెరుగుదలకు సొంత ఇల్లు ముఖ్యమనే భావనే ఇందుకు కారణం. ప్రస్తుతం ఇళ్ల ధరలు, భూమి ధరలు చుక్కలనంటుతున్నాయి. మరోవైపు నిర్మాణ వ్యయం కూడా రోజురోజుకీ పెరుగుతున్నది. ఓ పక్క స్థిరాస్తుల మార్కెట్ విలువను ప్రభుత్వాలు పెంచుకుంటూ పోతుండగా, మరోపక్క రిజిస్ట్రేషన్ చార్జీలు భారీగా పెరిగి భారమవుతున్నాయి.

పల్లెలు, చిన్నపాటి పట్టణాల్లో చిన్న ఇంటి నిర్మాణానికి కనీసం టన్ను ఇనుము కావాలి. దానికే రూ.80వేలు ఖర్చు చేయాలి. ఇటుక, సిమెంటు సహా ఇతర నిర్మాణ సామాగ్రి, కూలీల ఖర్చు వెరసి అర కోటి అవుతుంది. నగరాల్లో అయితే కనీసం రూ.కోటి పెడితే తప్ప చిన్న ఇల్లు సాధ్యం కాదు. ఇంత ఖర్చు చేసే శక్తి ఎగువ మధ్యతరగతి ప్రజలకే ఉండడం లేదు. ఇక నిరుపేద, మధ్యతరగతి ప్రజలు సొంతింటి కోసం కల కందామన్నా నిద్ర పట్టని పరిస్థితి ఉంటున్నది. ఉపాధి అవకాశాలు కూడా మృగ్యమవుతున్న నేటి పరిస్థితుల్లో చెమటోడ్చి సంపాదించే దానిలో 50 శాతం వరకూ అద్దె ఇళ్లకు కేటాయించాల్సి వస్తున్నదని చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకునే శ్రమజీవులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల తరుణంలో రాజకీయ పార్టీలు ఓటర్లను తమవైపు తిప్పుకోవడానికి గుప్పిస్తున్న అనేక హామీల్లో పేదలందరికీ సొంత ఇల్లు నిర్మాణం ప్రాధాన్యతను పొందుతున్నది. వారి ఎన్నికల మేనిఫెస్టోల్లో ఇళ్ల హామీ కచ్చితంగా ఉంటోంది.

అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవం తరువాత మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి మా అక్క చెల్లెమ్మల ఓట్లు ఏమయ్యాయో అర్థం కావడం లేదంటూ తీవ్రమైన ఆవేదనతో మాట్లాడారు. ఇళ్లు కాదు ఏకంగా ఊళ్లనే నిర్మిస్తామని ఆడంబరంగా, నవరత్నాల్లో భాగంగా రాష్ట్రంలోని 31 లక్షల మహిళలకు వారి పేర్లతో ఇళ్ల పట్టాలు ఇచ్చినా, వారు ఓట్లు ఎందుకు వేయలేదో అనేది ఆయన సందేహం. శాంతంగా ఆలోచిస్తే– పేదల సొంత ఇంటి కలను సాకారం చేసి ఉంటే ఓట్లు పడే ఉండేవి. కానీ ప్రభుత్వ పెద్దల మాటల్లో కనిపించిన నిజాయితీ చేతల్లో కనిపించలేదు. జగనన్న గృహ నిర్మాణ పథకం కింద 30.70 లక్షల ఇళ్ల పట్టాల పంపిణీతో 17 వేల జగనన్న కాలనీల కోసం రూ.55 వేల కోట్లు ఖర్చు పెట్టనున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. అయితే ఇక్కడ జరిగింది వేరు. ఇళ్ల పట్టాల పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూసేకరణలోనే అధికార పార్టీ పెద్దలు సుమారు రూ.6,500 కోట్ల అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు అప్పట్లోనే వచ్చాయి. ఇళ్ల స్థలాల కోసం ఎంపిక చేసిన భూములు నివాసయోగ్యం కావనీ తేలిపోయింది.

పైగా పట్టణ ప్రాంతంలో సెంటు, పల్లెలో సెంటున్నర స్థలం అనే ప్రకటన లబ్ధిదారుల్లో ఏర్పడిన అసహనానికి ఒక కారణం. పట్టణాల్లో ఇప్పటికే ఉన్న మురికివాడలకు తోడు సెంటు స్థలంలో నిర్మించే ఇళ్లతో మరిన్ని మురికివాడలు రూపొందుతాయనే వాదనా చర్చల్లోకి వచ్చింది. ఎన్ని విమర్శలు వచ్చినా పట్టీపట్టనట్టు వ్యవహరించిన జగన్ ప్రభుత్వం, ఒక కంపెనీతో ఒప్పందం చేసుకుని 18 లక్షల ఇళ్ల నిర్మాణమంటూ హడావిడి చేసింది. ఇప్పటికీ అందులో 70 శాతం వరకూ ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. జగనన్న కాలనీల పథకం ప్రారంభంలో ప్రభుత్వమే ఇళ్లను ఉచితంగా నిర్మించి ఇస్తుందని చెప్పిన మాటను క్రమంగా అటకెక్కించారు.

నవరత్నాలు, పేదలకు ఇళ్లు అంటూ ఊదరగొట్టేసిన వైసీపీ పాలనలో ఆ పథకం ఫలితాలివ్వలేదు. ఇంటి స్థలం, అందులోనే పక్కాగృహ నిర్మాణం అంటూ ఆర్భాటం చేసి అమలు విషయంలో చేతులెత్తేశారు. నిర్మాణం కోసం ముందుగా మూడు రకాల ఆప్షన్లు ఇచ్చి చివరికి లబ్ధిదారులే నిర్మాణాలు చేపట్టాలంటూ తొండి చేశారు. లక్షా 80 వేలు ఇస్తాము... మీ తిప్పలేవో మీరే పడండని చేతులు దులుపుకోవడానికి ప్రయత్నించడంతో మొత్తం ఆ ప్రక్రియే అస్తవ్యస్తంగా మారింది. మొండి గోడలు, కంపచెట్లతో జగనన్న కాలనీల కథ ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అనే చందాన ఆగిపోయింది. ప్రభుత్వం తరఫున ఇస్తామని చెప్పిన సొమ్ముతో కనీసం పునాదులు కూడా తీసుకోవడం సాధ్యం కాదని గ్రహించిన లబ్ధిదారులు, కనీసం తమకు కేటాయించిన ప్లాట్‌ల దగ్గరికి కూడా వెళ్లడం మానేసి, తమలో గూడుకట్టుకున్న అసంతృప్తిని ఎన్నికల వేళ చూపించారు.

ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల తరుణంలో జగన్ ప్రభుత్వంలా కాకుండా పల్లె ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల స్థలాన్ని కేటాయించి ఇళ్ల నిర్మాణాలను చేపట్టి పేదల కలల సౌధాన్ని పూర్తి చేస్తామని చెప్పిన మాటలు ఆయా వర్గాల్లో విశ్వాసాన్ని నింపాయి. దీనిపై ప్రభుత్వం ఒక జీవోను విడుదల చేయడం సంతోషించదగ్గ పరిణామమే. ఇది ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుంది. పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లె సీమల్లో మూడు సెంట్లలో ఇంటి నిర్మాణం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ప్రారంభం అవుతుందని అధికార పార్టీ నేతలు అనధికారికంగా అంటున్నారు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రం ఇచ్చే రూ.2.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.1.50 లక్షలు కలిపి మొత్తంగా రూ.4 లక్షలతో ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేలా చూడవచ్చన్నది కూటమి ప్రభుత్వ ఆలోచన. జగన్ హయాంలో ఇచ్చిన సెంటు స్థలంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారితో పాటు కేవలం పట్టా పత్రాలే మిగిలిన వారి వరకూ కూటమి హామీ ప్రకారం రెండు, మూడు సెంట్ల భూమి దక్కుతుందనే ఆశతో ఉన్నారు. ఇప్పటికీ ఎటువంటి నిర్మాణాలు ప్రారంభించని వారితో పోల్చితే నిర్మాణ దశలో ఉన్న లబ్ధిదారులను సంతృప్తిపరచడం ప్రభుత్వానికి పెద్ద సవాలే.


గత ప్రభుత్వం లెక్కలను ఆసరాగా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని పేదలు 32 లక్షల మంది వరకే ఉంటారని అనుకుంటే పొరపాటే అవుతుంది. దానికి రెట్టింపు పేద ప్రజలు సొంత గూడు కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొట్టి అలసిపోయి ఉన్నారు. వారంతా ఈ ప్రభుత్వంలోనైనా తమ కలల గూడు సాకారమవుతుందని ఆశగా చూస్తున్నారు.



ఇక గత ప్రభుత్వం లెక్కలను ఆసరాగా తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లు లేని పేదలు 32 లక్షల మంది వరకే ఉంటారని అనుకుంటే పొరపాటే అవుతుంది. దానికి రెట్టింపు పేద ప్రజలు సొంత గూడు కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొట్టి అలసిపోయి ఉన్నారు. వారంతా ఈ ప్రభుత్వంలోనైనా తమ కలల గూడు సాకారమవుతుందని ఆశగా చూస్తున్నారు. వీటన్నిటికీ మించి జగన్ ఆర్భాటంగా చేపట్టిన హౌసింగ్ స్కీములోని లోపాలను సరిదిద్దడం, జనం నివసించడానికి ఇష్టపడని లే అవుట్లను మార్చడం, సెంటు స్థానంలో రెండు సెంట్ల స్థలం కేటాయింపు ఇవన్నీ జీవోలు విడుదల చేసినంత సులభం కాకపోవచ్చు. జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన మొత్తం వ్యవహారంపై విచారణ జరిపిస్తే, వేల కోట్ల అవినీతి బాగోతం బయటకు వస్తుంది. ఆ నిధులను కక్కించి వినియోగిస్తే మరో 13 లక్షల మందికి సొంతిల్లు నిర్మించి ఇవ్వవచ్చుననే వాదనా ఉంది. సంక్షేమం ఒక్కటే కాదు అభివృద్ధితో కూడిన సంక్షేమం తమ విధానమంటున్న చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిటినీ నిలుపుకోవడం నల్లేరు మీద నడక కాకపోవచ్చు.

■ సి.ఎన్. క్షేత్రపాల్‌రెడ్డి


దుర్గాఘాట్‌లో పుణ్యస్నానాలు



భూ కైలాస్


యనమలకుదురులో ప్రభల మహోత్సవం (ఇన్‌సెట్‌లో) పూజలందుకుంటున్న రామలింగేశ్వరస్వామి



శివనామస్మరణతో శైవక్షేత్రాలు శోభాయమానమయ్యాయి. పుణ్యస్నానాలతో కృష్ణాతీరాలు పులకించిపోయాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని శివాలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడగా, స్నానఘాట్లు కళకళలాడాయి. అర్ధరాత్రి దాటాక ఇంద్రకీలాద్రిపై ఆదిదంపతుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరగగా, యనమలకుదురు రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రభలు ప్రకాశవంతమై వెలిగాయి.

- ఘనంగా మహాశివరాత్రి మహోత్సవాలు
- ఇంద్రకీలాద్రిపై ఆది దంపతుల కల్యాణ వేడుకలు
- యనమలకుదురులో వైభవంగా ప్రభల ఉత్సవం
- కిటకిటలాడిన శివాలయాలు.. కళకళలాడిన స్నానఘాట్లు

6

ఓటే శాసనం..!

నేడే కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక

ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్

- జిల్లావ్యాప్తంగా 78,063 మంది ఓటర్లు
- పోలింగ్ కేంద్రాలు 112.. ఉద్యోగులు 538 మంది
- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు
- కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మధ్యే పోటీ
- సార్వత్రిక ఎన్నికల స్థాయిలో ఉత్కంఠ


నగరంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పోలింగ్ సిబ్బంది

శాసనమండలి సమరానికి సర్వంసిద్ధమైంది. జిల్లాలో ఏర్పాటుచేసిన 112 పోలింగ్ కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎన్నికల సిబ్బందితో పాటు ఓటింగ్ సామగ్రి కూడా పోలింగ్ కేంద్రాలకు చేరుకుంది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించగా, విద్యాసంస్థలకు ఇప్పటికే సెలవు ప్రకటించారు. గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే పోలింగ్ సరళికి యంత్రాంగం క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పూర్తిచేసింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్ర శాసనమండలి సభ్యుడి స్థానానికి గురువారం ఎన్నికలు జరగనున్నాయి. అభ్యర్థులెందరు ఉన్నా ప్రధాన పోటీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మధ్యే సాగుతోంది. మంగళవారమే ప్రచారం పరిసమాప్తమైనా ఎన్నికల రోజు అవలంబించాల్సిన వ్యూహాలపై రెండు శిబిరాల్లోనూ సమాలోచనలు జరిగాయి. పోలింగ్ బూత్ ఏజెంట్లు, ఎన్నికల చీఫ్ ఏజెంట్లతో అంతరంగికంగా సమావేశాలు నిర్వహించారు. అమరావతి రాజధాని ప్రాంతంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నిక కావటంతో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. దీంతో గతంలో ఎన్నడూలేని విధంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం భారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించుకునేందుకు ప్రజా సంఘాలు కూడా పెద్ద ఎత్తున కృషి చేశాయి. దీంతో ఈ ఎన్నికలు ఎప్పుడూ లేనంత హోరాహోరీగా మారాయి. సాధారణ ఎన్నికలను తలపించేలా నామినేషన్ల నుంచి ప్రచారం వరకు కూడా ప్రధాన అభ్యర్థులు తగ్గలేదు. దీంతో ఈసారి మిగతా 6లో..

తాడేపల్లి డైరెక్షన్‌లోనేనా?

సత్యవర్ధన్ బెదిరింపుల ఎపిసోడ్ పథకం ప్రకారమేనా?

నాడు వంశీ కలిసిన వైసీపీ ముఖ్య నేతలు ఎవరు?

- విచారణలో పోలీసుల ప్రశ్నలతో బలపడుతున్న అనుమానాలు
- తాడేపల్లి పెద్దల సూచనతోనే నాడు టీడీపీ ఆఫీసులపై దాడులు
- సత్యవర్ధన్‌ను తమవైపు తిప్పుకొనే ప్లాన్ కూడా వారిదే..?



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గన్నవరం టీడీపీ కార్యాలయంపై వైసీపీ మూకల దాడి ఘటనలో ప్రత్యక్ష సాక్షి, ఫిర్యాది సత్యవర్ధన్‌ను తమ వైపునకు తిప్పుకొనే విషయంలో తాడేపల్లి వైసీపీ పెద్దల పథక రచన ఉందా..? అంటే అవుననే సందేహం కలగకమానదు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ విచారణ సందర్భంగా పోలీసులు అడుగుతున్న ప్రశ్నలను పరిశీలిస్తే.. ఇదే అనుమానం కలుగుతుంది. సత్యవర్ధన్.. హైదరాబాద్‌లోని మిగతా 6లో..

శివ శివా..!

శ్రీశైల యాత్రలో విషాదం

- కృష్ణానదిలో పడి తండ్రీకొడుకులు మృతి
- మృతులు కొల్లికుళ్ల గ్రామస్థులు
- గ్రామంలో విషాదఛాయలు


గురవయ్య


వాసు

పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : భక్తికి లోటున్నా.. భక్తికి ఏమాత్రం లోటు లేదని మహాశివరాత్రి పర్వదినాన శ్రీశైలక్షేత్ర యాత్రకు వెళ్లిన ఆ కుటుంబానికి తీరని శోకం మిగిలింది. శ్రీశైలంలోని కృష్ణానదిలో మిగతా 6లో..



పవిత్రసంగమం వద్ద భక్తుల పుణ్య స్నానాలు



ముక్త్యాల వద్ద కృష్ణానదిలో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పుణ్యనదుల్లో పవిత్ర స్నానాలు ఆచరించి, ఉపవాసాలు చేసి ఆలయాలను సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. పితృదేవతలకు పిండ ప్రదానాలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాదిగా తరలి వచ్చిన భక్తులతో రహదారులు కిక్కిరిసిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది.

హరోం హర



సంగమేశ్వరుడు





ఇంద్రకీలాద్రిపై పుష్పాలతో ప్రత్యేక అలంకరణ

భక్తులతో పోటెత్తిన శైవక్షేత్రాలు

- తెల్లవారుజాము నుంచే లక్షలాదిగా భక్తుల పుణ్యస్నానాలు
- మహా శివరాత్రి నాడు శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- పుష్కరాలను తలపించిన పవిత్ర సంగమ ప్రదేశం
- జనసంద్రంలా పెదకళ్లేపల్లి, ముక్త్యాల, సంగమేశ్వరాలయం

యనమలకుదురు రామలింగేశ్వరస్వామి ఆలయంలో..

పెనమలూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు మునిగిరిపై శ్రీరామలింగేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. భక్తుల శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. భక్తులు శివపార్వతులను దర్శించి తరించారు. బుధవారం ఉదయం ఆదిదంపతుల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో పదులసంఖ్యలో ఏర్పాటు చేసిన ప్రభలు విద్యుత్ కాంతులీనాయి. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రోజంతా భక్తులను స్వామివారి దర్శనార్థం అనుమతించారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారి దర్శనార్థం తరలివచ్చారు. స్వామివారికి అర్చకులు పంచామృతాలతో తైలాభిషేకాలు, రుద్రాభిషేకాలు, మహారుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి బిల్వార్చన, పార్వతీదేవి అమ్మవారికి కుంకుమ పూజలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 11గంటలకు గ్రామ మండపం వద్ద దేవస్థానప్రభకు ఎడ్లు కట్టి ఊరేగింపు పాటలో రావి వహిత 6.3లక్షలకు దక్కించుకొన్నారు.



కోలాటాలు, భజనలు, కోయ నృత్యాలు, భేతాళ వేషాలు, హిరాణి నృత్యాలు, మేళతాళాలతో వైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆది దంపతుల కళ్యాణం రాత్రి 2.16గంటలకు అయోధ్య శ్రీనివాసరావు, లక్ష్మీనరసమ్మ దంపతులచే కన్నుల పండువగా జరిగింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ, పోలీసు శాఖ భారీ ఏర్పాట్లు చేసింది.



శ్రీరామలింగేశ్వరస్వామి

భక్తులతో కిటకిటలాడిన దుర్గాఘాట్

ఇంద్రకీలాద్రి : మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో దుర్గాఘాట్ కిటకిటలాడింది. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బం



దులు లేకుండా ఈవో, దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ చర్యలు చేపట్టారు.

పుష్పాలతో అలంకరణ

అమ్మవారి, స్వామివార్ల ఆలయాలతో పాటు ఉపాలయాలను రంగురంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. దేవస్థానం ప్రాంగణం ప్రత్యేక శోభతో అలరారింది. శివనామ స్మరణతో పులకించిన ఇంద్రకీలాద్రి కృష్ణానదిలో పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు పంచామృతాలతో అభిషేక కార్యక్రమాలను చూసేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈనెల 23 నుంచి ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మంటప పూజలు, బలిహరణలు తదితర పూజాదికాలు జరిగాయి.

సంగమేశ్వరుని సన్నిధిలో..

నందిగామ రూరల్ : దక్షిణ కాశీగా పేరుగాంచిన దాములూరు కూడలి గ్రామంలో సంగమేశ్వరస్వామి ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైరా సంగమంలో పుణ్య స్నానాలాచరించి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎండను సైతం లెక్కచేయకుండా భక్తులు గంటల పాటు క్యూలైన్‌లలో వేచి ఉండి స్వామి వారిని దర్శించుకున్నారు. వైరా సంగమం వద్ద పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పవన్‌కళ్యాణ్, ఈవో నరసింహమూర్తి, సీఐ వైవీఎల్ నాయుడు, ఎస్ఐ అభిమన్యు, ఆయా శాఖల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

జనసంద్రంలా ముక్త్యాల..

జగ్గయ్యపేట రూరల్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ముక్త్యాల గ్రామం జనసంద్రంగా మారింది. కృష్ణానదిలో పుణ్య స్నానాలాచరించిన భక్తులు భవానీ ముక్తేశ్వర స్వామి, కోటిలింగ హరిహర క్షేత్రంలో పూజలు చేశారు. పిండ ప్రదానాలు, తర్పణాలతో పాటు కులదైవాలకు కర్మలు చేశారు. భక్తులకు కెసీపీ సిమెంట్స్, ఉమర్ ఫ్రెండ్స్ సర్కిల్ కోటిలింగాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించగా.. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ప్రారంభించారు. పెరిగిన నీటి మట్టం.. భక్తులకు తప్పిన ఇబ్బందులు.. కృష్ణానదిలో మంగళవారం రాత్రి వరకు నీరు లేకపోవటంలో కంగారు పడిన అధికారులు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లగా అర్ధరాత్రి 12 గంటల సమయంలో పులిచింతల నుంచి నీటిని విడుదల చేయటంతో బుధవారం పుణ్యస్నానాలకు ఇబ్బంది లేకుండా ఘాట్‌లకు నీరు చేరింది. వాటితో పాటు జల్లు స్నానాలను ఏర్పాట్లు చేయటంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యేకాధికారులు, ఈవోలు ప్రసాద్, సురేష్ బాబు, హరిదుర్గా నాగేశ్వరరావు, ఎంపీడీవో నితిన్, శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ అన్నతున్‌లు పాల్గొన్నారు.

● ట్రాఫిక్ ఇబ్బందులు

ముక్త్యాలకు భారీసంఖ్యలో వాహనాలు పోటెత్తటంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. భక్తులు వేలాదిగా బైకులు, వందల సంఖ్యలో కార్లు, ఆటోలు, ట్రాక్టర్‌లు, ఇతర వాహనాలలో వచ్చారు. అంచనాలకు మించి రావటంతో పార్కింగ్ చాలకభక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు అయోమయానికి గురయ్యారు. విజయవాడ సీపీ రాజశేఖరబాబు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. నందిగామ ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు సిబ్బంది దాదాపు గంటన్నర పాటు శ్రమించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

పుష్కరాలను తలపించిన పవిత్ర సంగమం లక్షకు పైగా భక్తుల పుణ్య స్నానాలు

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద శివరాత్రి పర్వదినం సందర్భంగా పుణ్యస్నానాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి భక్తులతో



ఘాట్‌లు పోటెత్తాయి. సాయంత్రం 3 గంటల వరకు సుమారు లక్షకు పైగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. పుష్కరాలను తలపించగా.. వందలాది కార్లు, ఆటోలు వేలసంఖ్యలో మోటార్ బైక్‌లపై తరలివచ్చారు. ఇబ్రహీంపట్నం డిపో నుంచి ఆర్టీసీ నేరుగా పవిత్రసంగమం వరకు ప్రత్యేక బస్సులను నడిపింది. కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన ఏర్పాట్లను పర్యవేక్షించారు. పవిత్ర సంగమం వద్ద ఒంటెల సవారీ ప్రత్యేకాకర్షణగా నిలిచింది. స్నానాలు ఆచరించిన భక్తులు, పిల్లలు ఒంటెలపై సవారీ చేశారు.

కళ్యాణం.. కమనీయం..

దుర్గగుడి, పాత శివాలయంలో కళ్యాణోత్సవాలు

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానం, భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయం (పాత శివాలయం)లో బుధవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో లింగోద్భవ ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు.



గంగా, పార్వతీ, మల్లేశ్వరుల వివాహ మహోత్సవం

భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శివుడికి పాంచాహ్నిక దీక్షతో కళ్యాణ మహోత్సవాలను నిర్వహించారు. దుర్గామల్లేశ్వర దేవస్థానంలో గంగా, పార్వతీ, మల్లేశ్వరుల దివ్య లీలా కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని లింగోద్భవ ఘట్టం అనంతరం నిర్వహించారు. అంతకు ముందు ఎదుర్కోల ఉత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తులను వధూవరులుగా అలంకరించి వివాహ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కాగా, దుర్గగుడిలో గంగా, పార్వతీ, మల్లేశ్వరుల వివాహమహోత్సవం, పాత శివాలయంలో భ్రమరాంబ, మల్లేశ్వరుడు, భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కళ్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి.

దుర్గామల్లేశ్వరులకు మంగళగిరి చేనేత పట్టువస్త్రాలు

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వరులకు బుధవారం మంగళగిరి శ్రీ శివభక్త మార్కండేయ వంశీకులు చేనేత పట్టువస్త్రాలు సమర్పించారు. మహాశివరాత్రి సందర్భంగా జరిగే దుర్గామల్లేశ్వర స్వామి కల్యాణ మహోత్సవానికి శివభక్త మార్కండేయ వంశీకులు చేనేత పట్టు వస్త్రాలు సమర్పించటం ఆనవాయితీగా వస్తుంది. దీంతో మంగళగిరిలో భక్త మార్కండేయ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేనేత మగ్గాలపై ఈ వస్త్రాలను భక్తిశ్రద్ధలతో పవిత్రంగా తయారు చేశారు. ఈ ఏడాది ప్రధాన కైంకర్యపరులుగా ఏపీ మెడికల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, గుత్తికొండ ధనుంజయరావు చేనేత పట్టువస్త్ర నివేదన చేశారు. డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజు, సహాయ కార్యనిర్వహణాధికారి జె.శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దామర్ల వెంకట నరసింహం, గ్రంధి శివాజీ, అందే నాగప్రసాద్, చిల్లపల్లి మోహనరావు, దామర్ల రాజు పాల్గొన్నారు.



కన్నుల పండువగా స్వామి కల్యాణం

నందిగామ, ఫిబ్రవరి 26: ఆది దంపతులు శివపార్వతుల కల్యాణం వసంత ఇంట కన్నుల పండువగా సాగింది. మంగళవారం ఐతవరం గ్రామంలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ నివాసంలో మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం జరిగింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూలమండపంలో ఈ కల్యాణం నిర్వహించారు. మహాదేవుడికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, ఎమ్మెల్యేలు శ్రీరామ్ రాజగోపాల్, గద్దె రామ్మోహన్, బొండా ఉమా, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా, ఎస్సీ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, నందిగామ, మైలవరానికి చెందిన నేతలు పాల్గొన్నారు.



స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న విప్ వసంత, సౌమ్య

తాడేపల్లి డైరెక్షన్‌లోనేనా?

(5వ పేజీ తరువాయి)

తన ఇంటి నుంచి వచ్చిన మరుసటి రోజే వంశీ తాడేపల్లి వెళ్లి వైసీపీకి చెందిన ముఖ్యనేతలు ఇద్దరిని కలిసినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే, దీనిపై వంశీ స్పష్టత ఇవ్వలేదని తెలుస్తోంది. దీనిని బట్టి చూస్తే.. ఈ మొత్తం ఎపిసోడ్.. తాడేపల్లి వైసీపీ పెద్దల డైరెక్షన్‌లోనే వంశీ, ఆయన అనుయాయులు సత్యవర్ధన్‌ను బెదిరింపులకు గురిచేశారన్న అనుమానాలు కలుగుతున్నాయి. విచారణ మరింత లోతుగా జరిగే క్రమంలో ఈ అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఊహించని రీతిలో..

వైసీపీ హయాంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం, చంద్రబాబు నివాసం, గన్నవరం, గుడివాడ టీడీపీ కార్యాలయాలపై వరుసగా దాడులు జరిగాయి. ఇవన్నీ వేర్వేరు దాడులే అయినా.. తాడేపల్లి వైసీపీ పెద్దల డైరెక్షన్‌లోనే జరిగాయన్న విమర్శలు అప్పట్లోనే వచ్చాయి. తాజాగా గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాది సత్యవర్ధన్‌ను తమ వైపునకు తిప్పుకొనే విషయంలో కూడా తాడేపల్లి పెద్దల ఒత్తిడి ఉందన్న అనుమానాలకు బలం చేకూరుతోంది. ఈ కేసులో వల్లభనేని వంశీమోహన్ ఏ71గా ఉన్నారు. ఏ71గా ఉండటం వల్ల ఇప్పటికిప్పుడు వచ్చిన నష్టమేమీ లేదని ఆంతరంగికంగా పలువురు ముఖ్యులతో వంశీ అప్పట్లో చెప్పినట్టుగా తెలుస్తోంది. ఈ వ్యాఖ్యలు చేసిన కొద్దిరోజులకే సత్యవర్ధన్ కోర్టుకు వాంగ్మూలం ఇచ్చాడు. ఇంత వేగంగా పరిణామాలు మారడం వెనుక తాడేపల్లి వైసీపీ పెద్దల ప్రోద్బలం ఉందన్న అనుమానాలు వచ్చాయి. కేసులు ఎప్పుడూ ఉండేవేనని, గన్నవరం నియోజకవర్గంలోకి వెళ్లాల్సిన సమయం ఆసన్నమైందని ఆ పార్టీ ముఖ్యనేత ఒకరు వంశీకి గట్టిగా చెప్పిన అనంతర క్రమంలోనే ఈ పరిణామాలన్నీ చోటుచేసుకున్నాయి. తొందరగా ఈ కేసు నుంచి తప్పించుకోవచ్చని భావించిన వంశీకి ఊహించని విధంగా వరుసగా కేసులు వచ్చిపడ్డాయి.

వైసీపీ పెద్దలకు షాక్

వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు వంశీ అనుయాయులు సాగించిన అరాచకాలు, మైనింగ్ అక్రమ తవ్వకాలు, భూ కబ్జాలు, రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్, బెదిరింపులపై ఇప్పుడు అనేక కేసులు నమోదవుతున్నాయి. తాజాగా వంశీ అక్రమాలపై ప్రభుత్వం సిట్ కూడా వేయటంతో అన్నింటిపై విచారణలు సాగే అవకాశముంది. ఈ హఠాత్పరిణామాలతో తాడేపల్లి పెద్దలు తలలు పట్టుకుంటున్నారు.

ఓటే శాసనం..!

(5వ పేజీ తరువాయి)

పోటీపై తీవ్ర అంచనాలు నెలకొన్నాయి.

సర్వం సన్నద్ధం

ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 78,063 ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 45,425 మంది కాగా, మహిళలు 32,625 మంది. ఇతరులు 13 మంది ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 112 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నికలు జరుగుతున్నాయి. 112 మంది పోలింగ్ ఆఫీసర్లు, 112 మంది సహాయ పోలింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులు 224 మంది, రిజర్వులో 90 మంది ఉద్యోగుల చొప్పున మొత్తం 538 మంది ఉద్యోగులు విధులు నిర్వహించనున్నారు. వీరుకాకుండా 131 మంది మైక్రో అబ్జర్వర్లు అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో విధులు నిర్వహి స్తారు. 667 మందితో పోలీసు బందోబస్తును సిద్ధం చేశారు. డీసీపీలు ఇద్దరు, ఏడీసీపీలు ఇద్దరు, ఏసీపీలు ఆరుగురు, సీఐలు 14 మంది, ఎస్ఐలు 48 మంది, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు కలిపి 141 మంది, హోంగార్డులు 454 మంది విధులు నిర్వహిస్తున్నారు. 20 మండలాల్లో 24 ఫ్లయింగ్ స్క్వాడ్స్ పనిచేయనున్నాయి. మొత్తం 20 మండలాల వీడియో సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేశారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ

విజయవాడ, తిరువూరు, నందిగామ రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా ఎన్నికల సామగ్రి, పోలింగ్ సిబ్బందిని పటిష్ఠ బందోబస్తు నడుమ వారికి నిర్దేశించిన పోలింగ్ బూత్‌లకు పంపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి తరలిస్తూనే ఉన్నారు. చెక్ లిస్ట్ ప్రకారం పోలింగ్ మెటీరియల్‌ను ఎన్నికల సిబ్బందికి అందజేశారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇతర మెటీరియల్ అంతా పోలింగ్ సిబ్బందికి అప్పగించారు. విజయవాడ రెవెన్యూ డివిజన్ కార్యాలయం నుంచి 18 రూట్లలో పోలింగ్ సిబ్బందిని నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేర్చారు. మొత్తం 450 మంది సాయుధ పోలీసు సిబ్బంది ఎస్కార్టుతో బస్సుల్లో సిబ్బందిని, మెటీరియల్‌ను తరలించారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్‌కు ఏర్పాట్లు

కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టరేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ తెలిపారు. నగరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ లక్ష్మీశ సందర్శించి పరిశీలించారు. చెక్‌లిస్ట్ ప్రకారం సామగ్రి అందుతోందో లేదో చూశారు. అనంతరం మాట్లాడుతూ 112 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ మెటీరియల్‌ను పంపిణీ చేశామన్నారు. 450 మంది పోలీస్ సిబ్బందితో పాటు తక్షణ స్పందన బృందాలు అందుబాటులో ఉంటాయన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో వెబ్‌క్యాస్టింగ్‌తో పాటు మైక్రో అబ్జర్వర్లు ఉంటారని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, ఆర్డీవో కావూరి చైతన్య పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికల దృష్ట్యా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాలతో ఈనెల 27న గురువారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి యూవీ సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా జైలును పరిశీలించిన తమిళ జైలర్లు

విజయవాడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రానికి జైలర్లు, అసిస్టెంట్ జైలర్లు విజయవాడలోని జిల్లా జైలును పరిశీలించారు. జైళ్ల శాఖలోకి నూతనంగా అడుగుపెట్టిన వారు రాయవేలూరులో శిక్షణ పొందుతున్నారు. దీని భాగంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న జైళ్లను పరిశీలించి, అక్కడ అవలంబిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలి. దీనిలో భాగంగా వారు జిల్లా జైలును బుధవారం పరిశీలించారు. వారికి జైళ్ల శాఖ గుంటూరు రేంజ్ ఐజీ డాక్టర్ ఎం.వరప్రసాద్ తరగతులు నిర్వహించారు.

శివ శివా..!

(5వ పేజీ తరువాయి)

బుధవారం పెనుగంచిప్రోలు మండలం కొల్లికుళ్ల గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు ప్రమాదవశాత్తూ కొట్టుకుపోయి మరణించారు. కొల్లికుళ్ల, వెంగనాయకునిపాలెం గ్రామానికి చెందిన సుమారు 40 మంది భక్తులు శ్రీశైలం దర్శనార్థం మంగళవారం ఇక్కడి నుంచి బయల్దేరి వెళ్లారు. వీరిలో కొల్లికుళ్ల గ్రామానికి చెందిన పెరుగు గురవయ్య (35), పెరుగు వాసు (11) తండ్రీకొడుకులున్నారు. పుణ్యస్నానం నిమిత్తం తొలుత వాసు కృష్ణానది నీటిలో దిగి, కాలుజారి కొట్టుకుపోతుండగా, కుమారుడ్ని రక్షించేందుకు తండ్రి గురవయ్య కూడా నదిలో దిగి మృతిచెందారు. భర్త, కుమారుడి మృతితో భార్య తిరుపతమ్మ నిర్ఘాంతపోయింది. గురవయ్య-తిరుపతమ్మకు వాసు ఒక్కడే కుమారుడు. సుమారు ఐదేళ్ల కిందట వీరి పాప చనిపోయింది. దీంతో వాసును అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. భర్త, కుమారుడ్ని పోగొట్టుకుని తిరుపతమ్మ రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కాగా, గురవయ్య, వాసు మృతదేహాలను స్వగ్రామానికి తెప్పించడం కోసం మాజీమంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం ఎంతో కృషి చేశారు. ఇద్దరి మృతదేహాలను బుధవారం మధ్యాహ్నం ప్రత్యేక వాహనంలో కొల్లికుళ్లకు తీసుకొచ్చారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 485

నేడు పటమట రైతుబజారుకు సెలవు

ఏపీఐఐసీ కాలనీలోని రైతుబజారు తెరుస్తారు

పటమట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పటమట రైతుబజారు రోడ్డులోని జడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ బూత్ ఏర్పాటు చేసిన సందర్భంగా పటమట రైతుబజారుకు సెలవు ఇస్తున్నట్లు ఎస్టేట్ ఆఫీసర్ రమేష్‌బాబు తెలిపారు. ఏపీఐఐసీ కాలనీలోని రైతుబజారుకు వారాంతపు సెలవు అయినప్పటికీ వినియోగదార్ల సౌకర్యార్థం రైతుబజారు తెరుస్తామన్నారు.

టీడీపీ... సేవ చేసే పార్టీ

పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు టీ, పాలు, బిస్కెట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కృష్ణలంక, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అంటేనే సేవా భావం ఉన్న పార్టీ అని, రాజకీయాలతో సంబంధం లేకుండా సేవా కార్యక్రమాలు నిర్వహించే ఏకైక పార్టీ అని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. బుధవారం కృష్ణలంక 21వ డివిజన్‌లోని మెట్లబజారు చివర మహా శివరాత్రి సందర్భంగా కృష్ణానదిలో పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు మాజీ కార్పొరేటర్ స్వర్గీయ గొరిపర్తి నర్సింహారావు జ్ఞాపకార్థం టీ, పాలు, బిస్కెట్లు, తాగునీరు ప్యాకెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ మాజీ కార్పొరేటర్ గొరిపర్తి నర్సింహారావు మహాశివరాత్రి సందర్భంగా పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు ఈ విధంగా ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని గత 15 సంవత్సరాల క్రితం ప్రారంభించారన్నారు. ఆయన లేకపోయినా గొరిపర్తి నర్సింహారావు జ్ఞాపకార్థం ప్రతి ఏడాది శివరాత్రి రోజున ఈ విధంగా ఉచితంగా పాలు, బిస్కెట్లు, టీ, తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. జనసేన, టీడీపీ, బీజేపీ కలిసి ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని గద్దె పేర్కొన్నారు. టీడీపీ నాయకుడు గొరిపర్తి నామేశ్వరరావు మాట్లాడుతూ అన్నయ్య నర్సింహారావు ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని ఆయన లేకపోయినా తాను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేములపల్లి రంగారావు, కేశనం భావన్నారాయణ, మోటేపల్లి చిన్నా, అమరావతి వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మల జ్యోతిక, బీజేపీ నాయకులు గాలి శ్రీదేవి, మోకా దేవ, ఒడుగు నాగరాజు, తాడువాయి సత్యనారాయణ, ఆర్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



నేడు జరగనున్న కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పటమట కోనేరు బసవయ్య చౌదరి జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో పోలింగ్ నిర్వహణకు సిద్ధం చేస్తున్న ఎన్నికల సిబ్బంది

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

విజయవాడ రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం నున్న జడ్పీ హైస్కూల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు సర్వం సిద్ధమయ్యా యి. గురువారం ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం అధికారులు పోలింగ్ బూత్‌లను సిద్ధం చేశారు. హైస్కూల్లో రెండు పోలింగ్ బూత్‌లు ఉండగా మొత్తం 1046 ఓట్లు ఉన్నాయి. ఏడీసీపీ రామకృష్ణ, నున్న సీఐ కృష్ణమోహన్ బూత్‌లను పరిశీలించి బందోబస్తుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటలకు ముగుస్తుంది.

ఘనంగా గద్దె క్రాంతి జన్మదిన వేడుకలు



టీడీపీ తూర్పు కార్యాలయంలో భారీ కేక్ కట్ చేస్తున్న గద్దె క్రాంతికుమార్

పటమట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతికుమార్ జన్మదిన వేడుకలను బుధవారం అశోక్‌నగర్‌లోని తూర్పు టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. విజయవాడ పార్లమెంట్ తెలుగు యువత నాయకుడు షేక్ నాగూర్ ఆధ్వర్యంలో 37 కిలోల భారీ కేక్‌ను గద్దె క్రాంతికుమార్ కట్ చేశారు. అనంతరం ఆయనకు గజమాలతో తెలుగుయువత నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గద్దె హేమాన్స్, పులిపాటి రాజు, పెనుగొండ శ్రీనివాస్, పటమట సతీస్‌చంద్ర, రాయవరపు అశోక్, తోట శ్రీనివాస్, షేక్ హనీఫ్, తదితరులు పాల్గొన్నారు. **కృష్ణలంక :** టీడీపీ యూత్ నాయకులు పోడూరు పవన్ కుమార్, తవ్వా ప్రకాష్ ఆధ్వర్యంలో గద్దె క్రాంతి కార్యాలయంలో ఆయనచే కేక్ కట్ చేయించి, తినిపించారు. అంతకు ముందు పోడూరు పవన్ కుమార్, తవ్వా ప్రకాష్ ఆధ్వర్యంలో సీతమ్మవారి పాదాల వద్ద పేదలకు బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యూత్ నాయకులు బీరం అరవింద్, నిమ్మకూరి కృష్ణ, సంతోష్, అశోక్, పులకరం నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే విప్లవ కార్మికోద్యమ నిర్మాణం సాధ్యం

● రెండు ఇఫ్టూల విలీనం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ రాష్ట్ర నేతలు

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో కార్మిక వర్గాన్ని కార్పొరేట్ వర్గాలకు బానిసలుగా చేసేందుకు జరుగుతున్న ప్రభుత్వ చర్యలను ఎదుర్కొనేందుకు ఐక్యతతోనే విప్లవ కార్మికోద్యమ నిర్మాణం అవసరమని ఐఎఫ్‌టీయూ (ఇఫ్టూ) రాష్ట్ర అధ్యక్షుడు పి. ప్రసాద్ అన్నారు. విప్లవ కార్మిక సంస్థలైన రెండు ఐఎఫ్‌టీయూ సంస్థలు ఒకే సంస్థగా విలీనం కావాలని నిర్ణయించుకుని మార్చి 2న రాజమండ్రిలో విలీన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజమండ్రి విలీన సభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ బుధవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తేవడం ద్వారా కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను ప్రైవేటీకరిస్తున్న పరిస్థితుల్లో కార్మిక సంఘాలు ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు లేకుండా పోతున్నాయని విమర్శించారు. కనీస హక్కులు సాధన కోసం కార్మిక వర్గం మరింత సమరశీలంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. మార్చి 2న రాజమండ్రిలో జరిగే సభను కార్మిక వర్గం జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. పొలారి, ఉపాధ్యక్షులు ఎం ఏసు, ఆర్ హరికృష్ణ, జె. వెంకటేశ్వర్లు, కార్యదర్శులు ఆర్. మోహన్, ఎం. వెంకటేశ్వర్లు, కె. రమణ తదితరులు పాల్గొన్నారు.

శంకరమఠం వద్ద భక్తులకు ప్రసాదం పంపిణీ

కృష్ణలంక, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా కృష్ణలంకలోని శంకరమఠం వద్ద బుధవారం ది రిటైల్ రైస్ అండ్ జనరల్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు భక్తులకు ఉచితంగా ప్రసాదాన్ని పంపిణీ చేశారు. దాదాపు 5 వేల మంది భక్తులకు పండ్లు, కేసరి, పులిహోర, వాటర్‌ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం యనమలకుదురు శివాలయం వద్ద కూడా భక్తులకు ప్రసాదాల వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో తడికమళ్ల వెంకట సురేష్‌బాబు, వైవీవీ సత్యనారాయణమూర్తి, తారువాయి వెంకట సత్యనారాయణ, వుద్దగిరి శేషగిరిరావు, నల్లమల్ల ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రసాదం పంపిణీ చేస్తున్న ది రిటైల్ రైస్ అండ్ జనరల్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

గురునానక్ కాలనీలో...

భారతీనగర్: మహాశివరాత్రి సందర్భంగా గురునానక్ కాలనీలోని శివాలయంలో బుధవారం రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం 5 గంటల నుంచి 6గంటల వరకు స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భక్తులు వేకువజాము నుంచి వచ్చి స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి కల్యాణమహోత్సవం జరిగింది.



అర్ధనారీశ్వర అలంకారంలో కాళీమాత అమ్మవారు

కృష్ణలంక, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి సందర్భంగా త్రిశక్తిపీఠంలోని కాళీమాత అమ్మవారు బుధవారం అర్ధనారీశ్వర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకొన్నారు. దేవస్థానంలో లక్ష్మీగణపతి హోమం, ఆంజనేయస్వామి హోమం, మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతీ హోమం, శ్రీదుర్గా రుద్ర హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్, సభ్యులు పాల్గొన్నారు.

శివగిరిపై శివరాత్రి సంబరాలు



దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ చేసిన నాగసాధువులు

మొగల్రాజపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురం శివగిరి కొండపై ఉన్న శ్రీ వాగ్దేవి జ్యోతిర్లింగ క్షేత్రం శివనామ స్మరణతో మార్మోగింది. క్షేత్ర వ్యవస్థాపకుడు మల్లిఖార్జున శర్మ ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారు జాము నుంచే మొదలైన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్తర భారతం నుంచి ప్రత్యేకంగా వచ్చిన నాగ సాధువుల చేతుల మీదుగా శివగిరిపై దక్షిణామూర్తి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఉదయం గణపతిపూజ, స్వర్ణకపిల గోపూజ, రుద్రాభిషేకం, ద్వాదశ జ్యోతిర్లింగాలకు అభిషేకాలు, రుద్రహోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం హిమాలయ నాగ సాధువులచే శివలింగానికి చితా భస్మాభిషేకం, కపాల హారతి నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.



గురునానక్ కాలనీలోని రామలింగేశ్వర స్వామి

లారీ ఢీకొని యువకుడు మృతి



ప్రమాదంలో మృతి చెందిన సాయికుమార్

రాణిగారితోట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక జాతీయ రహదారిపై వారధి సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పెదకాకాని వెంగళరావు నగర్, ఎన్టీఆర్ కాలనీకి చెందిన సాయికుమార్(23) స్నేహితుడు రమేష్‌తో కలిసి యనమలకుదురులోని అమ్మమ్మ ఇంటికి ద్విచక్రవాహనంపై బుధవారం వచ్చాడు. రాత్రి 11గంటల సమయంలో తిరిగి ఇంటికి వెళ్తుండగా రాణిగారితోట విజయకృష్ణ థియేటర్ దగ్గరకి వచ్చే సరికి వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై వెనుక కూర్చున్న సాయికుమార్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, వాహనాన్ని నడుపుతున్న రమేష్‌కు ఎటువంటి ప్రమాదం జరగలేదు. మృతుడు సాయికుమార్ గుంటూరులోని ఒక కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నట్లు రమేష్ తెలిపాడు. ప్రమాదానికి కారణమైన లారీని వారధి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, రమేష్ నుంచి వివరాలు సేకరించారు.



కేశినేని వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, తదితరులు

ఘనంగా కేశినేని వెంకయ్య వర్ధంతి

వన్‌టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, విజయవాడలో టీడీపీని బలోపేతం చేసేందుకు టీడీపీ నగర తొలి కన్వీనర్‌గా కేశినేని వెంకయ్య పదవీ కాంక్ష లేకుండా కృషి చేశారని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. కేశినేని వెంకయ్య వర్ధంతి కార్యక్రమాన్ని గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఎంపీ కేశినేని శివనాథ్, టీడీపీ నాయకులు వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ తన తాత వెంకయ్య ఆశయాలకు, ఆలోచనలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, టీడీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి పరిశపోగు రాజేష్, టీడీపీ నాయకులు మాదిగాని గురునాథం, నరసింహ చౌదరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని దంపతులకు గాయాలు

విద్యాధరపురం: బైక్ ఢీకొని దంపతులకు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం గొల్లపూడి సాయిపురం కాలనీలో ఉంటున్న రాపల రవినాయక్ బుధవారం భార్యతో కలిసి బైక్‌పై పున్నమీఘాట్‌కు బయలు దేరాడు. గొల్లపూడి ఆంధ్ర హాస్పటల్ సమీపంలోకి వచ్చేసరికి ఓ వ్యక్తి బైక్‌పై వెనుక నుంచి రవి నాయక్ వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ సంఘటనలో భార్యాభర్తలు రోడ్డు మీద పడడంతో జ్యోతికి తీవ్ర గాయాలయ్యాయి. భార్యను గొల్లపూడి ఆంధ్ర హాస్పటల్‌కు తీసుకువెళ్లాడు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'కేరాఫ్ గంగిరెద్దుల దిబ్బ' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

గాంధీనగర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సినీ ప్రేక్షకులకు మంచి చిత్రాలకు అందించాలనే తపనతో చిత్రాలను రూపొందించే దర్శకుడు ఎస్.ఎస్.స్వామి అని పలువురు ప్రముఖులు కొనియాడారు. శ్రీలక్ష్మీ భవానీ ఫిలిమ్స్ బ్యానర్ పై రాబోతున్న 'కేరాఫ్ గంగిరెద్దుల దిబ్బ' సినిమా పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. నగరంలోని రెడ్ బ్రిక్స్ డవలపర్స్ కార్యాలయంలో సంస్థ అధినేత పి.ఎస్.కుమార్, మెట్రోకార్స్ అధినేత జి.మహేష్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. దర్శకుడు స్వామి మాట్లాడుతూ త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో వేమూరి వెంకట్రావ్, బి. జై కుమార్, జి.రామ్మోహన్, నిర్మాత ఎస్.మణికంఠ పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషలపై శిక్షణ

» ప్రతిపాదనలు పంపాలని డీఎంఈకి మంత్రి ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషలపై శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ఆరోగ్య శాఖ సిద్ధమైంది. తద్వారా వారు విదేశాల్లో సైతం ఉద్యోగ అవకాశాలు పొందేందుకు మార్గం సుగమం అవుతుందని భావిస్తోంది. ఈ నేపథ్యంలో విదేశీ భాషలపై శిక్షణకు సంబంధించి సమగ్ర ప్రతిపాదనలు పంపాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)ను ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. తొలుత 13 ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో ఇలాంటి కోర్సులను ప్రవేశ పెట్టాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. విదేశాల్లో ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి నర్సింగ్ విద్యార్థుల భాష, కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థతో కలిసి ఈ శిక్షణ ఇవ్వాలని ఆరోగ్యశాఖ ఆలోచిస్తోంది. ఈ విషయంపై మంత్రి సత్యకుమార్ సంబంధిత సీనియర్ అధికారులతో ఇటీవల చర్చించారు. సమగ్ర ప్రతిపాదనలు సమర్పించాలని డీఎంఈని ఆదేశించారు. కాగా, దీనిపై డీఎంఈ ఇప్పటికే 7 వేల మందికి పైగా నర్సింగ్ విద్యార్థుల అభిప్రాయాలు, భాషా ప్రాధాన్యతల గురించి అభిప్రాయాలు తీసుకుంది. ఎక్కువ మంది నర్సింగ్ విద్యార్థులు జర్మన్, జపనీస్, ఇంగ్లిష్, ఫ్రెంచ్ వంటి భాషలను నేర్చుకునేందుకు ఉత్సాహంగా ఉన్నట్లు తెలిసింది.

పీసీసీఎఫ్ ఎంపికకు కమిటీ నియామకం

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ నుంచి రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ (పీసీసీఎఫ్) పోస్టుకు తగిన అధికారిని ఎంపిక చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం పీసీసీఎఫ్‌గా ఉన్న చిరంజీవ్‌చౌదరి ఈనెల 28న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో అపెక్స్ స్కేల్‌తో కూడిన ఐఎఫ్ఎస్ అధికారిని పీసీసీఎఫ్‌గా ఎంపిక చేయడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన కమిటీని నియమించారు.

శివరాత్రి స్నానాలకు వెళ్లి 9మంది మృతి

» గోదావరిలో మునిగి ఐదుగురు విద్యార్థులు..

» శ్రీశైలంలో కొడుకును రక్షించబోయి తండ్రీ..

» బలివే దగ్గర తమ్మిలేరులో అన్నదమ్ములు..

రాజమహేంద్రవరం, పెనుగంచిప్రోలు, సున్నిపెంట, పెదవేగి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నదుల్లో స్నానానికి వెళ్లిన తొమ్మిది మంది మృత్యువాతపడ్డారు. శ్రీశైలంలో నీటిలో మునిగిపోతున్న కొడుకును రక్షించబోయి తండ్రి, బలివే దగ్గర తమ్మిలేరులో అన్నదమ్ములు, గోదావరి నదిలో మునిగిపోతున్న స్నేహితుల రక్షణ కోసం వెళ్లిన విద్యార్థులు చనిపోయారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడికి చెందిన గర్రె ఆకాశ్(17), తిరుమలశెట్టి పవన్(19), పడాల దేవదత్త సాయి(18), పడాల రామ దుర్గాప్రసాద్(19), అనిశెట్టి పవన్ గణేశ్(17) తోపాటు మరో ఏడుగురు శివరాత్రి స్నానానికి బుధవారం గోదావరి ఇసుక ర్యాంపు వద్దకు వెళ్లారు. అక్కడ ఇసుక మేటలు ఉన్నాయని మరింత ముందుకు వెళ్లారు. నదిలో సుమారు పది అడుగుల దూరం వెళ్లిన తర్వాత నీళ్లు బాగా నీలం రంగులో ఉన్నాయని, ముగ్గురు మరింత ముందుకు వెళ్లారు. అంతే.. అకస్మాత్తుగా నీటిలోకి జారిపోయారు. వాళ్లను రక్షిద్దామని వెళ్లిన మరో ఇద్దరు కూడా పైకి రాలేకపోయారు. దీంతో ఐదుగురూ ప్రాణాలు విడిచారు. మిగతా స్నేహితుల అరుపులతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. విషయం తెలియగానే కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహకిశోర్ అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. నదిలో గాలించి ఐదుగురి మృతదేహాలను బయటకు తీశారు. విద్యార్థులంతా ఒకే ఊరు, ఒకే వీధికి చెందిన వాళ్లు కావడంతో గ్రామం శోకంలో మునిగిపోయింది.

శ్రీశైలంలో తండ్రీకొడుకులు..



తండ్రీకొడుకుల మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం కొల్లికుళ్ల గ్రామానికి చెందిన పెరుగు గురవయ్య (35), అతడి కుమారుడు వాసు (11) శ్రీశైలం వద్ద కృష్ణా నదిలో జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. ఈ ప్రాంతానికి చెందిన 40 మంది భక్తులు శ్రీశైలం వెళ్లారు. బుధవారం స్నానాలు చేసేందుకు నదిలోకి దిగారు. ముందుగా కుమారుడు వాసు నీటిలోకి దిగి.. కాలు జారి కొట్టుకుపోతుండగా అతడిని రక్షించేందుకు వెళ్లిన తండ్రి కూడా అదృశ్యమయ్యారు. మత్స్యకారులు మృతదేహాలను బయటకు తీశారు.

వైసీపీ చేసిన పాపం

తాడిపూడిలో ప్రమాదం జరిగిన ప్రదేశంలో ఇసుక ర్యాంపు ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడపడితే అక్కడ డ్రెడ్జింగ్ చేయడంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లోనే యువకులు మృత్యువాతపడ్డారు. ఇక్కడ కనీసం హెచ్చరిక బోర్డులు కూడా లేవు.

తమ్మిలేరులో అన్నదమ్ములు..

ఏలూరు జిల్లా ముసునూరు మండలం బలివే శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన అన్నదమ్ములు తమ్మిలేరులో స్నానానికి దిగి చనిపోయారు. లింగపాలెం మండలం తిమ్మక్కపాలేనికి చెందిన పేరిచర్ల మారేష్, మంగమ్మ దంపతులు, వారి కుమారులు మునియ్య, మణికుమార్ బంధువులతో కలిసి బలివే వచ్చారు. తమ్మిలేరులో స్నానాలు చేసి, స్వామివారి దర్శనానికి బయలు దేరారు. కుమారులిద్దరూ కొద్దిసేపు స్నానం చేసి వస్తాం... మీరు వెళ్లండని తల్లిదండ్రులకు చెప్పారు. దర్శనం పూర్తయినా.. కుమారులిద్దరూ రాకపోవడంతో వెతుక్కుంటూ తమ్మిలేరు దగ్గరకు వచ్చారు. మునిపల్లె సమీపంలో మణికుమార్(18) మృతదేహం కనిపించింది. మరో కుమారుడి కోసం వెతుకుతుండగా నీటిలో గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలకు మునియ్య(20) మృతదేహం కనిపించింది. తల్లిదండ్రులు, బంధువుల రోదనలతో ఆ ప్రాంతం నిండిపోయింది.

రీ సర్వే డ్యూటీలో ఉన్నా హాజరు తప్పనిసరి

» రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్వేయర్లకు హాజరు తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రీ సర్వే, స్వామిత్వ, ఇతర విధుల కోసం గ్రామాలు, మండలాలు మారి వేరేచోట విధులు నిర్వర్తించే వారికి కూడా హాజరు తప్పనిసరి చేస్తూ భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ జి. జయలక్ష్మి ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు వారి హాజరుపై నిర్దిష్టమైన ఆదేశాలివ్వాలని గ్రామ, వార్డు సచివాలయాల విభాగానికి ఆమె లేఖ రాశారు. ఈ నేపథ్యంలో రీ సర్వే విధుల్లో భాగంగా సొంత మండలం లేదా ఇతర మండలాల్లో పనిచేసే వారు స్థానిక గ్రామ, వార్డు సచివాలయాల్లో హాజరు నమోదు చేసుకోవాల్సిందేనని గ్రామ, వార్డు సచివాలయాల విభాగం కార్యదర్శి కాటమేని భాస్కర్ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. రీ సర్వే పనుల్లో ఉన్నామని, తమకు హాజరు మినహాయించాలని పలువురు సర్వేయర్లు కొంతకాలంగా కోరుతున్నారు. అయితే ఇతర మండలాలకు డిప్యూట్ అయిన వారు రీసర్వే పనులు మానేసి ఇతర కార్యకలాపాల్లో బిజీగా ఉండిపోతున్నారన్న ఫిర్యాదులున్నాయి. ఈ నేపథ్యంలో, రీ సర్వే పనుల కోసం ఇతర మండలాలకు డిప్యూట్ అయిన వారు స్థానిక గ్రామ, వార్డు సచివాలయాల్లో తప్పనిసరిగా హాజరు వేయాల్సిందేనని ప్రభుత్వం స్పష్టం చేసింది.

చిత్రజ్యోతి

H SINCE 1965 H

సరికొత్త ప్రపంచాన్ని చూపించబోతున్నాం



\- ఆది పినిశెట్టి

'కథాబలంతో పాటు బలమైన భావోద్వేగాలు ఉన్న హారర్ చిత్రం 'శబ్దం'. ఇప్పటివరకూ వచ్చిన హారర్ చిత్రాలకు భిన్నంగా ఉంటుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది' అని హీరో ఆది పినిశెట్టి అన్నారు. 'వైశాలి' చిత్రం తర్వాత దర్శకుడు అరివళగన్, ఆది పినిశెట్టి కలయికలో వస్తున్న చిత్రమిది. సెవెన్ జీ ఫిల్మ్స్ శివ నిర్మించారు. మైత్రీ డిస్ట్రిబ్యూషన్, ఎన్ సినిమాస్ ద్వారా ఈ నెల 28న 'శబ్దం' చిత్రం తెలుగులో విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను ఆది పినిశెట్టి మీడియాతో పంచుకున్నారు. "ఇప్పటివరకూ ప్రేక్షకులకు తెలియని ఓ సరికొత్త ప్రపంచాన్ని 'శబ్దం' చిత్రంతో ప్రేక్షకులకు పరిచయం చేయబోతున్నాం. ఇందులో అతీత శక్తుల గురించి అన్వేషించే పరిశోధకుడి పాత్రలో కనిపిస్తాను. సాంకేతికంగా సినిమా చాలా ఉన్నతంగా ఉంటుంది. ఆత్మలకూ శబ్దానికి ఉన్న సంబంధం ఏమిటనేది ఆసక్తికరంగా ఉంటుంది. 'వైశాలి' లానే 'శబ్దం' కూడా నిజాయితీగా చేసిన ప్రయత్నం. తప్పక ఫలిస్తుందనే నమ్మకం ఉంది. సిమ్రాన్, లైలా పాత్రలు సినిమాలో కీలకం. తమన్ నేపథ్య సంగీతం అద్భుతంగా కుదిరింది. ప్రస్తుతం 'అఖండ 2, మరకతమణి 2, మయసభ, డ్రైవ్' చిత్రాలు చేస్తున్నాను" అని ఆయన చెప్పారు.

మార్చి నుంచి మళ్లీ షూటింగ్స్‌కు



'శివన్న' అని అందరూ ఆప్యాయంగా పిలుచుకునే కన్నడ టాప్ స్టార్ శివ రాజ్‌కుమార్ క్యాన్సర్ నుంచి కోలుకున్నారు. మార్చి నుంచి మళ్లీ షూటింగ్స్‌కు హాజరవుతానని ఓ ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. తనకు క్యాన్సర్ ఉన్నట్లు గత ఏడాది ఏప్రిల్‌లో తెలిసిందనీ, కుటుంబ సభ్యులు, వైద్యులు ఇచ్చిన ధైర్యంతో చికిత్స చేయించుకున్నాననీ శివ రాజ్‌కుమార్ ఆ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'కీమో థెరపీ చేయించుకుని షూటింగ్‌కు వెళ్లిన రోజులు ఉన్నాయి. మొత్తానికి క్యాన్సర్ నుంచి బయట పడ్డా. చికిత్స అనంతరం ఇప్పుడు సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా చేస్తున్నా. ఆహార నియమాలు పాటిస్తున్నా. మళ్లీ షూటింగ్స్‌లో పాల్గొంటున్నా. మార్చి 5న హైదరాబాద్ వెళ్లి రామ్‌చరణ్ సినిమా షూటింగ్‌లో పాల్గొంటా. ఆ సినిమాలో నా పాత్ర చాలా ప్రత్యేకంగా ఉంటుంది' అని చెప్పారు శివ రాజ్‌కుమార్.



ప్రభాస్, ప్రశాంత్ వర్మ చిత్రం.. ఎప్పటినుంచి?




హీరో ప్రభాస్ స్పీడ్ పెంచారు. చేతిలో ఉన్న సినిమాలు చకచకా పూర్తి చేస్తూ కొత్త వాటి మీద కూడా దృష్టి పెట్టారు. ప్రస్తుతం ఆయన 'రాజా సాబ్', 'ఫౌజీ' సినిమాలు చేస్తున్నారు. ఇవి కాకుండా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందే 'స్పిరిట్' సినిమా చేయాలి. ఇందులో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ప్రభాస్ నటించనున్నారు. ఈ సినిమా షూటింగ్ కూడా వీలైనంత త్వరలో ప్రారంభించాలని ప్రభాస్ ఆలోచన. ఇప్పుడు ఆయన మరో కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారంటూ పరిశ్రమలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ సినిమాకు ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహిస్తారనీ, ఈ సినిమాకు సంబంధించి ప్రభాస్ లుక్ టెస్ట్ కూడా జరిగిందని సమాచారం. ఇవి కాకుండా 'కల్కి పార్ట్ 2', 'సలార్ 2' చిత్రాలను ప్రభాస్ చేయాలి. ఇన్ని సినిమాలు ప్రభాస్ ఎప్పుడు, ఎలా చేస్తారు, వీటిల్లో ఏది ముందు మొదలవుతుందనేదే ఆ చర్చ.

సందేశం, వినోదం అలరిస్తాయి



బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి తనయుడు మిమో చక్రవర్తి హీరోగా టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. ఆయన కథానాయకుడిగా మాధవ్ కోదాడ దర్శకత్వంలో మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి నిర్మించిన చిత్రం "నేనెక్కడున్నా". ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మిమో చక్రవర్తి మీడియాతో మాట్లాడుతూ.. 'చిన్నప్పటి నుంచి దక్షిణాది చిత్రాలు చూస్తూ పెరిగాను. నాకు తెలుగు సినిమాలో అవకాశం వచ్చిందని తెలియగానే నాన్న సంతోషించారు. 'ప్రయత్నలోపం లేకుండా కష్టపడు, నిజాయితీగా పనిచెయ్యి' అని చెప్పారు. సందేశం, వినోదం కలబోతగా దర్శకుడు 'నేనెక్కడున్నా' చిత్రాన్ని తీర్చిదిద్దారు. యాక్షన్ సీక్వెన్స్‌లు, పతాక సన్నివేశాల్లో వచ్చే మలుపులు ప్రేక్షకులను థ్రిల్ చేస్తాయి. ఈ చిత్రంతో హీరోగా తెలుగులో నిలదొక్కుకుంటాననే నమ్మకం ఉంది' అని చెప్పారు.

తెలుగులోకి 'ఛావా'



విక్కీ కౌశల్, రష్మిక జంటగా రూపుదిద్దుకున్న చారిత్రక చిత్రం 'ఛావా'. బాక్సాఫీసు వద్ద భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. పదకొండు రోజుల్లో ఈ సినిమా రూ. 417 కోట్లకు పైగా వసూళ్లను సాధించడంతో బాలీవుడ్ సంబరాలు చేసుకుంటోంది. దక్షిణాది సినిమా వచ్చి తమని చావు దెబ్బ తీసిందని వాపోతున్న సినీ వర్గాలు 'ఛావా' విజయంతో ఊపిరి పీల్చుకుంటున్నాయి. ఉత్తరాదిన విజయయాత్ర కొనసాగిస్తున్న ఈ సినిమా త్వరలో తెలుగు ప్రేక్షకులను పలకరించనుంది. ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్న తెలుగు ప్రేక్షకుల కోసం తెలుగు వెర్షన్‌ను గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ మార్చి 7న విడుదల చేస్తోంది.

పెళ్లి నేపథ్యంలో పీరియాడిక్ చిత్రం



పెళ్లి నేపథ్యంలో హాస్యం, వ్యంగం కలబోతగా రూపొందుతున్న పీరియాడిక్ చిత్రం 'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే'. రాజా దుస్సా దర్శకత్వంలో గాలి కృష్ణ నిర్మిస్తున్నారు. బుధవారం చిత్రబృందం టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించింది. 1980లో వరంగల్ జిల్లాలో జరిగిన సంఘటన ఆధారంగా అల్లుకున్న కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు దర్శకుడు చెప్పారు. ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం ఇది, నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాత తెలిపారు.

రాక్షసుడు వస్తున్నాడు



కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ నటించిన తాజా చిత్రం 'రాక్షస'. లోహిత్ హెచ్ దర్శకత్వంలో ఎంవీఆర్ కృష్ణ నిర్మించారు. ఈ చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ఫిబ్రవరి 28కి బదులు మార్చి 7న 'రాక్షస' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ బుధవారం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: నోబిన్ పాల్, సినిమాటోగ్రఫీ: జైబిన్ పి. జాకబ్

గుండెలోన గట్టి సప్పుడు



నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష, సవాళ్ల నేపథ్యంలో రూపుదిద్దుకున్న చిత్రం 'నారి'. ఆమని ప్రధాన పాత్ర పోషించారు. సూర్య వంటిపల్లి దర్శకత్వంలో శశి వంటిపల్లి నిర్మించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 7న ఈ చిత్రం విడుదలవుతోంది. మహా శివరాత్రి సందర్భంగా 'గుండెలోన ఏదో గట్టి సప్పుడైనదే' అంటూ సాగే గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. రమణ గోగుల ఆలపించగా, వినోద్ కుమార్ విన్ను స్వరపరిచారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వి. రవికుమార్.

ఒగ్గు కళ నేపథ్యంలో




ఒగ్గు కళాకారుల జీవితాల నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'బ్రహ్మాండ'. ఆమని, జయరామ్, ఛత్రపతి శేఖర్ కీలకపాత్రలు పోషించారు. రాంబాబు దర్శకత్వంలో దాసరి సురేశ్ నిర్మించారు. దర్శకుడు చందు మొండేటి ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ 'ఒగ్గు కళాకారుల జీవితాల్లోని ఒడిదొడుకులను వెండితెరపై ఆవిష్కరించే ప్రయత్నం 'బ్రహ్మాండ' చిత్రం ద్వారా చేస్తున్నాం' అన్నారు. తెలంగాణ సంస్కృతి, పల్లె ప్రజల అనుబంధాలను దర్శకుడు తెరకెక్కించిన తీరు ఆకట్టుకుంటుందని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: వరికుప్పల యాదగిరి, సినిమాటోగ్రఫీ: కాసుల కార్తీక్

శివుని పాటతో చంద్రేశ్వర



సురేష్ రవి, ఆశ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'చంద్రేశ్వర'. మన సనాతన ధర్మం గొప్పతనాన్ని వివరిస్తూ దేవాలయాల నేపథ్యంలో సాగే ఈ సినిమాను జీవా పెరుమాళ్ వర్ధన్ దర్శకత్వంలో డాక్టర్ రవీంద్రాచారి నిర్మించారు. మహా శివరాత్రి సందర్భంగా సినిమాలోని శివుని పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'ఆర్కియాలజీ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. డివోషనల్ టచ్‌తో పాటు మంచి కామెడీ కూడా సినిమాలో ఉంది. త్వరలో విడుదల చేస్తాం' అని చెప్పారు.



కొత్తదనంతో క్రైమ్ కథ

ఊహించని మలుపులు, భయానక సంఘటనలతో రూపొందుతున్న చిత్రం 'బ్లడ్ రోజెస్'. ఎంజీఆర్ దర్శకత్వంలో హరీశ్ కే నిర్మించారు. సీనియర్ నటుడు సుమన్, రంజిత్‌రామ్, అప్సర రాణి ప్రధాన పాత్రల్లో నటించారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. మహా శివరాత్రి సందర్భంగా చిత్రబృందం బుధవారం ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. భయపెట్టే కథనం, ఊపిరిసలపని ట్విస్ట్‌లతో మా క్రైమ్ కథా చిత్రం ఆద్యంతం ప్రేక్షకులను థ్రిల్ చేస్తుందని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: పెద్దపల్లి రోహిత్, సినిమాటోగ్రఫీ: శివకుమార్ ఓగిరెడ్డి.

PARAS

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 27 ఫిబ్రవరి 2025

వేసవిలో వృద్ధులు ఇవి పాటించాలి!

వేసవిలో ఉండే అధిక ఉష్ణోగ్రతల కారణంగా వృద్ధులలో కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వేసవికాలాన్ని హాయిగా గడిపేయవచ్చని నిపుణులు చెబుతున్నారు.

- తేలికగా, వదులుగా, మెత్తగా ఉండే నూలు దుస్తులు ధరించాలి. లేత రంగులు లేదా తెలుపు అయితే మంచిది.
- మధ్యాహ్న సమయంలో బయటికి వెళ్లకూడదు. సాయంత్రం నాలుగు గంటల తరవాత వాతావరణం చల్లబడినప్పుడు మాత్రమే వాకింగ్‌కు వెళ్లాలి.
- తరచూ ద్రవాహారం తీసుకుంటూ ఉండాలి. మంచి నీళ్లు, కొబ్బరి నీళ్లు, పళ్ల రసాలు, రాగి జావ, బార్లీ నీళ్లు, సగ్గుబియ్యం జావ, పలుచని మజ్జిగ తాగడం మంచిది.



- తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. మసాలాలు, నూనె పదార్థాలు తినకూడదు.
- కాఫీ, టీ తాగకూడదు. వీటివల్ల శరీరంలో నీటి శాతం తగ్గిపోతుంది.
- ఇంట్లో కిటికీలు తెరచి ఉంచాలి. మధ్యాహ్న సమయంలో ఎండ ఎక్కువగా ఉన్న పక్కలో కిటికీలకు కర్టెన్లు వేయాలి.
- బెడ్‌రూమ్‌లో పడుకునే సమయంలో ఫ్యాన్, ఏసీ, కూలర్ వినియోగించుకోవాలి.
- ఎండగా ఉన్నప్పుడు బయటికి వెళ్లాల్సి వస్తే హ్యాట్, గాగుల్స్, స్కార్ఫ్ ధరించాలి. మంచినీళ్లు తాగి వెళ్లాలి. తలకి తడి తువాలు కట్టుకోవాలి. ఎక్కువసేపు బయట ఉండాల్సి వస్తే ముఖాన్ని చల్లని నీళ్లతో కడుక్కుంటూ ఉండాలి.
- తరచూ బీపీ, షుగర్ స్థాయిలను పరీక్షించుకుంటూ ఉండాలి.
- నీరసం, బలహీనత, తలనొప్పి, కడుపులో తిప్పడం, వాంతులు లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రతించాలి.

గంజి తాగుదాం..!

గంజి సహజ ఔషధమని నిపుణులు చెబుతున్నారు. దీనిని తాగడంవల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

- గంజిలో కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉంటాయి. వ్యాయామం చేసిన తరవాత, నీరసంగా అనిపించినప్పుడు ఒక గ్లాసు గంజి తాగితే తక్షణ శక్తి లభిస్తుంది.
- ప్రతిరోజూ గంజి తాగడంవల్ల జీర్ణ వ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది. మలబద్ధకం దూరమవుతుంది. పొట్ట సమస్యలు రావు.
- వేసవికాలంలో తరచూ గంజి తాగుతూ ఉంటే వడదెబ్బ తగలదు. ఒక గ్లాసు గంజిలో చిటికెడు ఉప్పు, కొద్దిగా నిమ్మరసం కలుపుకుని తాగితే శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. డయేరియాను నిరోధిస్తుంది.
- గంజిలో బి 1, బి 2, బి 6 విటమిన్లతోపాటు మెగ్నీషియం, పొటాషియం లాంటి మినరల్స్ ఉంటాయి. ఇవి జీవక్రియలను వేగవంతం చేయడంతోపాటు మెదడు పనితీరుని క్రమబద్ధీకరిస్తాయి.
- గంజి తాగడం వల్ల చర్మానికి తేమ అంది ఆరోగ్యంగా కనిపిస్తుంది. మొటిమలు, గుల్లలు రాకుండా ఉంటాయి. శిరోజాలు చక్కగా పెరుగుతాయి.
- గంజిలో ఉండే పొటాషియం శరీరంలో సోడియం స్థాయిని నియంత్రిస్తుంది. దీనివల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. గుండె ఆరోగ్యంగా పనిచేస్తుంది.
- గంజిలో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు, అమైనో ఆమ్లాలు అధికంగా ఉంటాయి. అనారోగ్యంతో ఉన్నప్పుడు గంజి తాగితే రోగనిరోధక శక్తి మెరుగవుతుంది.



బతుకు కథల రంగస్థలం.. ఫ్రీదా!



వారిలో ఒక్కొక్కరిదీ ఒక్కో వ్యథ. ప్రతి కథ లక్షలాది మహిళల జీవితాలకు ప్రతిబింబం. ఆ వెతలన్నిటినీ రంగస్థలం మీద ఆవిష్కరిస్తోంది ఫ్రీదా థియేటర్. ఈ నాటక సమాజంలో నాటకాలు రూపొందించేవారు, నటించేవారు... అందరూ దళిత మహిళలే. స్వయంగా ఎదుర్కొన్న లైంగికమైన, కులపరమైన హింసను వారు ప్రేక్షకుల ముందు ఆవిష్కరిస్తున్నారు. ఆలోచనలు రేకెత్తిస్తున్నారు. విషమ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని, తలెత్తుకు బతకడం ఎలాగో చెబుతున్నారు.

మధ్యప్రదేశ్‌లోని ఒక చిన్న పల్లెటూరు. ఓ ఇంటి మేడ మీద వాడల్లోని మహిళలందరూ కూర్చున్నారు. వారి ముందు కొందరు అమ్మాయిలు నాటక ప్రదర్శన ప్రారంభించారు. తెరలు, లైట్లు, మేకప్ లాంటి హంగులూ, ఆర్భాటాలు లేకుండా... సాయంత్రపు వెలుతుర్లో సాగుతున్న ఆ ప్రదర్శన... ప్రేక్షకుల్లో భావోద్వేగాన్ని రేకెత్తిస్తోంది. చూస్తున్నంతసేపూ ప్రేక్షకులు ఆవేశపడుతున్నారు, ఆగ్రహిస్తున్నారు, కన్నీరు పెట్టుకుంటున్నారు. ఎందుకంటే ప్రతి నిత్యం వారు ఎదుర్కొంటున్న కష్టాలన్నీ ఆ నాటకం వారికి కళ్ళకు కట్టినట్టు చూపిస్తోంది. ప్రదర్శన పూర్తవగానే... అందరూ లేచి, ప్రదర్శనకారులైన మహిళల చుట్టూ మూగారు, వారిని హత్తుకున్నారు. 'మా బతుకుల్ని కళ్ళకుకట్టారు' అంటూ ఉద్వేగం నిండిన గొంతులతో అభినందించారు. "అక్కడే కాదు. ఫ్రీదా థియేటర్ కళాకారులు ఎక్కడ ప్రదర్శన ఇచ్చినా ఇలాంటి దృశ్యాలు సాధారణం. ఎందుకంటే ఈ నాటకాలకు ఆధారం ఊహలు కావు, ఆ కళాకారుల జీవితాలు" అంటారు అంగారిక గుహ. 'ఫ్రీదా థియేటర్' ఆవిర్భావం వెనుక ఆమె పాత్ర కీలకం.



వాస్తవాలు తెలియాలని...

బెంగళూరుకు చెందిన 'మఙ్రా- మీడియా అండ్ ఆర్ట్స్ కలెక్టివ్' అనే ఎన్జీవోలో అంగారిక పని చేస్తున్నారు. కళలు, మీడియా అంశాలతో పాటు మురికివాడల్లో నివసించేవారిని, వీధి వర్తకుల్ని నిరాశ్రయులుగా చేయడం, పిల్లల్లో పోషకాహార లోపం, మహిళలపై హింస, అత్యాచారాలు తదితర అనేక సామాజిక సమస్యలపై ఆ సంస్థ వివిధ కార్యక్రమాలు చేపడుతూ ఉంటుంది. 2018లో... గ్రామీణ ప్రాంతాల్లో మహిళలపై కులతత్వంతో సాగుతున్న లైంగిక హింసకు బాధితులైన మహిళలను కలిసి, వారి వేదనలను తెలుసుకొని, నమోదు చేయడానికి ఆ సంస్థ తరపున అంగారిక, ఆమె సహోద్యోగిని అనూషి అగర్వాల్ కలిసి 22 రాష్ట్రాల్లో పర్యటించారు. "పురుషాధిక్యత, కులాధిపత్యం, వ్యవస్థల నుంచి న్యాయం జరగకపోవడం, సామాజికంగా అవమానాలు, కుటుంబ సభ్యులే వెలివేయడం... ఇలాంటి ఎన్నో సమస్యలు హింసకు గురైన గ్రామీణ మహిళలు, ప్రధానంగా దళిత వర్గాలకు చెందినవారు ఎదుర్కొంటున్నారనీ, తప్పంతా వారిదేననే కళంకాన్ని మోస్తున్నారనీ తెలుసుకున్నాక... మాకు నిద్ర పట్టలేదు. మొదట ఇష్టపడకపోయినా... తరువాత ఒక్కొక్కరూ నోరువిప్పి వారికి జరిగిన అన్యాయాలను చెబుతూ ఉంటే... 'మనం మనుషులుగానే బతుకుతున్నామా?' అనిపించింది. ప్రధానంగా మధ్యప్రదేశ్‌లోని కొందరు దళిత మహిళలు, బాలికలు వివరించిన విషయాలు దిగ్భ్రాంతికరంగా ఉన్నాయి. ఈ సంఘటనలను ప్రభుత్వ యంత్రాంగాల దృష్టికి తీసుకువెళ్ళినా న్యాయం జరగదనీ, పైగా వారిపై గ్రామాల్లో వేధింపులు మరింతగా పెరుగుతాయనీ వారు చెప్పారు. కానీ ఈ వాస్తవాలు సమాజానికి తెలియాలి. ఊరూరా సమావేశాలు పెట్టి చెప్పడంకన్నా... వారే పాత్రలుగా తమ కథలను ప్రదర్శిస్తే మరింత ప్రభావవంతంగా ఉంటుందనిపించింది" అని గుర్తు చేసుకున్నారు అంగారిక. 'మఙ్రా' సంస్థలో ఒక భాగంగా... 'ఫ్రీదా థియేటర్' ఏర్పాటుకు అది నాంది.

ఆత్మవిశ్వాసం పెరిగింది...

బెంగళూరులో నాటక ప్రయోక్త అనీష్ విక్టర్‌ను అంగారిక, అనూషి సంప్రతించారు. తాము మాట్లాడిన మహిళ అనుభవాల ఆధారంగా 'చు కర్ దేఖో' పేరుతో చిన్న ప్రదర్శనకు రూపకల్పన చేశారు. ఆ పాత్రలను మధ్యప్రదేశ్‌కు చెందిన బాధిత మహిళలతోనే నటింపజెయ్యాలనుకున్నారు. వారితో మాట్లాడారు. 2021 నవంబర్‌లో... ఇండోర్‌లో ఒక వర్క్‌షాప్ ఏర్పాటు చేసి, 11మంది మహిళలకు ప్రాథమికమైన శిక్షణ ఇచ్చారు. తొలి ప్రదర్శనను బాధితుల గ్రామాల్లోనే ఏర్పాటు చేశారు. "మేము కలిసిన మహిళల్లో ఒక్కొక్కరికీ ఒక్కో కథ. వారిలో ఒక మహిళను భర్త వదిలేస్తే... ఇళ్ళలో వంటలు చేస్తూ జీవిస్తూ ఉండేది. ఒక రోజు ఒక క్యాటరింగ్ ఆర్డర్ కోసం దూరంగా ఉన్న గ్రామానికి వెళ్ళింది. అక్కడ అగ్రకులాలకు చెందిన వ్యక్తులు ఆమెను బంధించి, రెండు రోజులపాటు అత్యాచారం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా మొదట్లో పట్టించుకోలేదు. చివరకు ప్రజాసంఘాల ఒత్తిడితో నిందితులను అరెస్ట్ చేశారు. వెంటనే వారు బెయిల్ మీద బయటికొచ్చారు. ఆమె మీద దుష్ప్రచారం మొదలెట్టారు. ఆమె జీవితం దుర్భరమైపోయింది. మా తొలి నాటకం ఆమె కథే.



మేము వారి గ్రామానికి వెళ్ళినప్పుడు ఇంట్లోంచి బయటకురావడానికి కూడా భయపడింది. కానీ మా ప్రదర్శనలో తన పాత్ర తనే పోషించింది. "నేను ఒంటరిదాన్ని కాదు. నాలాంటివాళ్ళు ఎంతో మంది ఉన్నారు. నా బాధను ఇన్నాళ్ళూ ఎవరూ అర్థం చేసుకోలేదు. ఇప్పుడు ప్రపంచం ముందు ధైర్యంగా నిలబడ్డాను. నా కథను నా వైపు నుంచి నేనే చెబుతున్నాను. మా ప్రదర్శనను చూశాక... వాళ్ళు ప్రవర్తనల గురించి తప్పకుండా ఆలోచించి తీరుతారు" అని ఆ మహిళ చెప్పినప్పుడు... మాకు ఎంతో గర్వంగా అనిపించింది అంటారు అంగారిక. అలాగే మరో మహిళని ఆమె ఇంటినుంచి అపహరించి, అత్యాచారం చేసి, డెహ్రాడూన్‌లో అమ్మడానికి ప్రయత్నించారు. అక్కడినుంచి ఆమె తప్పించుకొని పారిపోయి వచ్చింది. కానీ ఇంట్లోవాళ్ళు రానివ్వలేదు. ఆమె తమతో ఉండడం అవమానంగా భావించారు. ఇదంతా తన తప్పేననే అపరాధభావంతో, సిగ్గుతో ఆమె జీవిస్తూ వచ్చింది. ఇప్పుడు... 'తప్పు నాది కానప్పుడు ఎందుకు భయపడాలి?' అనే ఆత్మ విశ్వాసం పెరిగింది అని ఆమె చెబుతున్నారు.

బాధ్యతలన్నీ వారివే...

ఫ్రీడా థియేటర్ ప్రదర్శనలు విజయవంతం కావడంతో... రెట్టించిన ఉత్సాహంతో 'నజర్ కె సామ్నే' అనే నాటకాన్ని ఈ బృందం తయారు చేశారు. మహిళలపై లైంగిక హింస దీనిలో ప్రధానాంశం. ఈ నాటకాన్ని పంచాయతీ హాల్స్, సామాజిక కేంద్రాలు, గ్రామాల్లోని రచ్చబండలు, అవి అందుబాటులో లేనప్పుడు... పరిచయస్తుల ఇళ్ళలో ప్రదర్శించారు. "కులాధిపత్యంతో కూడిన హింస, పురుషాధిపత్య భావనలు నిత్య జీవితంతో విడదీయరానివిగా ఉన్న గ్రామాలనే ఎంచుకున్నాం. కొందరు ప్రదర్శనల్ని అడ్డుకున్నారు. దాంతో వాటిని వేరే చోటికి మార్చాల్సి వచ్చేది. కానీ నాటకం చూడ్డానికి మహిళలు తండోపతండాలుగా వచ్చేవారు. తమ బతుకుల్ని ఆ పాత్రల్లో చూసుకొనేవారు. పరిస్థితుల్ని ఎదిరించి నిలబడాలనే సంకల్పం, తప్పు చేయనప్పుడు దేనికీ భయపడనక్కర్లేదనే ధైర్యం వారిలో చూశాం. ఇప్పటివరకూ ఆ నాటకాన్ని మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల్లో, ఢిల్లీలో యాభైకి పైగా ప్రదర్శనలు ఇచ్చాం. బ్యాంకాక్‌లో కూడా ప్రదర్శించాం" అన్నారు అంగారిక. ఇప్పుడు 'మర్జ్ అండ్ మౌనికా కీ కహానీ' అనే కొత్త నాటకం ప్రదర్శిస్తున్నారు. తమ భూమిని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్న ఒక పలుకుబడి ఉన్న వ్యక్తితో ఇద్దరు బాలికలు చేసే పోరాటాన్ని చూపించే రాజకీయ వ్యంగ్య నాటకం అది. ఇక... ఈ బృందంలో ప్రధానపాత్రధారులు అయిదుగురున్నారు. "ఒకప్పుడు గ్రామం దాటని ఈ మహిళల్లో పలువురు... నెలకు 15 నుంచి 20 రోజులపాటు ప్రదర్శనల కోసం వివిధ ప్రాంతాలకు వెళుతున్నారు. నగరాల్లో, మహిళా సదస్సుల్లో, అంతర్జాతీయ వేదికల్లో తమ కథను పరిచయం చేస్తున్నారు. దీనివల్ల ఆర్థిక స్థిరత్వం కూడా వారికి కలుగుతోంది. క్రమంగా బాధ్యతలు వారికే అప్పగిస్తున్నాం. సొంతంగా ప్రదర్శనలు నిర్వహించడం, లెక్కలన్నీ చూసుకోవడం మొదలు రంగాలంకరణ, మేకప్ లాంటివన్నీ వారు స్వతంత్రంగా చేస్తున్నారు. దీనికి 'మఙ్రా' సంస్థ అన్ని సహాయాలు అందిస్తోంది. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా ఈ స్ఫూర్తిని వ్యాప్తి చేయాలన్నదే మా ఆశయం" అంటున్నారు అంగారిక.

కార్పొరేటు కొలువు వదిలి... వ్యవసాయం బాట పట్టి..!



కుటుంబ సభ్యులకు రసాయన రహిత ఆహారాన్ని వండి పెట్టాలనే కోరికతో ఇంట్లోనే కూరగాయలను పండించడం ప్రారంభించారు తమిళనాడుకు చెందిన ప్రియా రాజనారాయణన్. ఎంబీఏ ఫైనాన్స్ పూర్తి చేసిన ఆమె... ఆరంకెల జీతం వదిలి వ్యవసాయం బాట పట్టారు. కూరగాయల విత్తనాలను సేకరించి నిల్వ చేయడంతోపాటు... వాటిని ఉచితంగా పంచుతున్నారు ఈ రైతు బిడ్డ.

"మాది తమిళనాడులోని పిలాతు గ్రామానికి చెందిన సాధారణ రైతు కుటుంబం. నాన్న వెంకీడుసామి, అమ్మ సుబ్బులక్ష్మి. మాకు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులోనే మాకు కావాల్సిన కూరగాయలను సేంద్రియ పద్ధతుల్లో పండించుకునేవాళ్లం. బజార్లో కూరగాయలను కొనేవాళ్లం కాదు. నాకు పెళ్లయిన తరవాత భర్తతో కలిసి తిరుప్పూర్ వచ్చేశాను. ఇక్కడ కూరగాయలను మార్కెట్ నుంచి కొని తేవాల్సి వచ్చేది. వాటి నుంచి రసాయనాలు, పురుగు మందుల వాసనలు వచ్చేవి. ఇలాంటి వాటిని వండి కుటుంబ సభ్యులకు తినిపించాలంటే మనసుకి కష్టంగా అనిపించేది. దీంతో ఇంట్లోనే కూరగాయలను పెంచాలని నిర్ణయించుకున్నాను. స్థానికంగా మార్కెట్లో దొరికే విత్తనాలు తీసుకువచ్చి, ఇంటి వెనక ఉన్న స్థలంలో వంకాయలు, పాలకూర, ఇతర కూరగాయలు పెంచడం మొదలుపెట్టాను. ఈ క్రమంలోనే అనువంశిక విత్తనాల సంరక్షణ అనే ఆలోచన వచ్చింది.

వాటి కోసం అన్వేషణ

ఒకసారి అమ్మానాన్నలను చూడడానికి పిలాతు వెళ్లినప్పుడు అక్కడి నుంచి టమాటా, మిరపకాయ, వంకాయ విత్తనాలు తీసుకువచ్చాను. వీటితో పండించిన కూరగాయలు ఎంతో రుచిగా ఉండడంతో కుటుంబ సభ్యులందరూ ఇష్టంగా తినేవారు. దీంతో స్థానికంగా దొరికే అనువంశిక విత్తనాల కోసం వెతకడం మొదలుపెట్టాను. మా ఇంట్లో పాత యమహా మోటార్ సైకిల్ ఉండేది. దాని మీదనే మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాలకు వెళ్లి అక్కడి రైతులతో మాట్లాడి వాళ్లు ఇప్పటికీ ఉపయోగిస్తున్న అనువంశిక, దేశీ విత్తనాలు సేకరించడం ప్రారంభించాను. ఇంత చిన్న గ్రామాల్లోని పేద రైతులు కూడా హైబ్రీడ్ రకాలు ఎంచుకోకపోవడం ఆసక్తిగా అనిపించింది. బంధువుల వివాహాల సందర్భంగా కేరళ, త్రిసూర్, మల్లాపురం వెళ్లాల్సి వచ్చింది. ఈ అవకాశాలను ఉపయోగించుకుని అక్కడి ప్రాంతాల్లో తిరిగి కంఠారి మిరప, వంకాయ, బెండకాయ, పాలకూర లాంటి వివిధ కూరగాయలకు సంబంధించిన విత్తనాలు సేకరించాను.

వెయ్యి రకాలు...

ఇప్పుడు నా దగ్గర వంద రకాల టమాటా, దుంపలు, వంకాయలు, పొట్లకాయలతోపాటు నలభై రకాల బెండకాయ, బీన్స్, ఇతర కూరగాయలకు సంబంధించి మొత్తం వెయ్యి రకాల అనువంశిక విత్తనాలు ఉన్నాయి. వీటిని టెట్రా ప్యాక్‌లో జిప్‌లాక్ కవర్లో ఉంచి కోడ్‌తో లేబుల్ వేసి ఫ్రిజ్‌లో భద్రపరచి ఉంచుతాను. నా దగ్గరకు వచ్చి అడిగినవాళ్లకు వీటిని ఉచితంగానే ఇచ్చేస్తూ ఉంటాను.

> **విత్తన ద్వీపం...**
>
> మా వ్యవసాయ భూమిలోనే ఓ విత్తన ద్వీపాన్ని సృష్టించాను. ఇది స్వయం సమృద్ధితో రూపొందిన ఆహార అడవి. ఇక్కడ అన్ని రకాల కూరగాయలతో పాటు వంద రకాల మూలికలను కూడా పెంచుతున్నాను. వీటిని ఔషధంలా కాకుండా ఆహారంగా తినవచ్చు. పురుగు మందులు వాడకుండా సహజ వ్యవసాయ పద్ధతులతో పంటలు పండించడం, దేశీ విత్తనాల సంరక్షణ అంశాలకు సంబంధించి రైతులకు, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం... ఇది నాకు నిత్యకృత్యం.

స్నేహితుల సహకారం

సేంద్రియ పద్ధతుల్లో స్థానిక రకాలు పండించే రైతులను కలవడానికి రాష్ట్రాలు దాటి వెళుతుంటాను. విత్తన ప్రదర్శనలు ఎక్కడ జరిగినా వాటికి హాజరవుతుంటాను. వివిధ ప్రాంతాల్లో ఉన్న నా స్నేహితులు స్వచ్ఛందంగా సహాయ సహకారాలు అందిస్తుంటారు. వాళ్ల కంట పడిన విత్తనాల ఫొటోలు నాకు పంపుతారు. నేను ఓకే అంటే వెంటనే వాటిని కొరియర్ చేస్తూ ఉంటారు

ప్రపంచ రైతులకు అవగాహన...

ఎన్‌జీఓలు, ఇతర స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే పలు కార్యక్రమాలను వేదికగా చేసుకుని స్థానిక విత్తనాల గురించి పలువురికి తెలియజేస్తూ ఉంటాను. ప్రపంచవ్యాప్తంగా సుమారు యాభై వేల మంది రైతులతో సమూహాలు కూడా ఏర్పాటు చేయగలిగాను. దేశంలో మరిన్ని ఆహార అడవులను పెంచడం, ప్రతి ఇంటికీ ఒక రైతు, ప్రతి గ్రామంలో ఒక విత్తన బ్యాంక్ ఉండాలన్నదే నా లక్ష్యం. ప్రస్తుతం దేశీ విత్తనాలు విరివిగా లభ్యం కావడంలేదు. శిక్షణ కార్యక్రమాలు, విత్తన మార్పిడి ఉత్సవాలు, దుంపల ఉత్సవాలకు హాజరయ్యే రైతులతో కలిసి విత్తనాలు మార్పిడి చేసుకుంటూ ఉంటాం. స్థానిక అనువంశిక విత్తనాలు.. రైతుల చేతుల్లో ఉండడం అత్యవసరం. సాంప్రదాయ విత్తనాలను సంరక్షించి భవిష్యత్ తరాలకు అందించాలన్నదే నా కోరిక."

కౌన్సెలింగ్

ఆ మందులు సురక్షితమేనా?

Q A

డాక్టర్! మావారు కొత్తగా వయాగ్రా మందులు వాడుతున్నారు. వీటిని వైద్యులు సూచించకపోయినా, స్వయంగా కొనుక్కుని వాడుకోవడం సురక్షితమేనా?

- ఓ సోదరి, విశాఖపట్నం

వయాగ్రా అనేది అంగ స్తంభన సమస్యలున్నవారికి ఉద్దేశించిన మాత్రలు. అయితే ఈ టాబ్లెట్‌ను ప్లెజర్ డ్రగ్‌గా వాడేవారి సంఖ్య పెరుగుతోంది. ఈ మాత్ర వేసుకుంటే ఎక్కువ సామర్థ్యంతో, చురుగ్గా పాల్గొనగలుగుతామనీ ఎంతో మంది ఈ మాత్రలను ఎటువంటి వైద్యుల ప్రిస్క్రిప్షన్‌తో పనిలేకుండానే మెడికల్ షాపుల్లో కొని వాడేస్తూ ఉన్నారు. 25 మిల్లీగ్రాముల నుంచి 100 మిల్లీగ్రాముల మోతాదుల వరకూ మాత్రమే వైద్యులు సూచిస్తూ ఉంటే, అంతకుమించి 100 నుంచి 200 మిల్లీగ్రాములు మాత్రలనూ వాడుతూ ఉంటారు. యువత అలవరుచుకున్న ఈ వ్యసనాన్ని ఆధారంగా చేసుకుని కొన్ని మందుల కంపెనీలు నాణ్యత లేని, తక్కువ ధరకు దొరికే వయాగ్రాలను తయారు చేసి విక్రయిస్తున్నాయి. ఒరిజినల్ వయాగ్రా మాత్రతో పోలిస్తే, తక్కువ నాణ్యత కలిగిన మాత్ర చవకగా దొరుకుతోంది. పైగా అవసరం లేకపోయినా ఈ మాత్రలు వాడడంవల్ల కొన్ని దుష్ప్రభావాలకు గురికావలసి ఉంటుంది. అవేంటంటే...



- మాత్ర వేసుకున్నప్పుడు కలిగే అనుభూతి, సంతృప్తి, సామర్థ్యాలకు అలవాటు పడి, సెక్స్‌లో పాల్గొనే ప్రతిసారీ వయాగ్రా మీద ఆధారపడే పరిస్థితి నెలకొంటుంది. దాంతో వయాగ్రా వేసుకోనిదే సెక్స్ చేయలేని స్థితికి చేరుకుంటారు.
- తలనొప్పి, కంటిచూపు మందగించడం, కంటిచూపు నీలంగా మారడం, గుండె కొట్టుకునే వేగం పెరగడం, వాంతి అవుతున్న భావన కలగడం... వయాగ్రాకు ఉన్న ప్రధాన సైడ్ ఎఫెక్ట్స్

కాబట్టి ఎటువంటి అంగస్తంభన సమస్యలు, శీఘ్రస్ఖలన సమస్యలు ఉన్నా వైద్యులను కలిసి చికిత్సలో భాగంగానే వయాగ్రా మాత్రలను వాడడం మేలు. ఎటువంటి సమస్యలూ లేనివారు వీటి జోలికి వెళ్లకపోవడమే ఉత్తమం!

- డాక్టర్ రాహుల్ రెడ్డి,
ఆండ్రాలజిస్ట్,
ఆండ్రోకేర్ ఆండ్రాలజీ ఇన్‌స్టిట్యూట్,
జూబ్లీహిల్స్, హైదరాబాద్.

కొబ్బరినూనెలో వీటిని కలిపి రాస్తే...

శిరోజాలకు తరచూ కొబ్బరినూనె రాసుకుంటే పోషణ అంది పొడవుగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. ఇంట్లో దొరికే కొన్ని దినుసులను కలిపి రాస్తే మరింత ప్రయోజనం ఉంటుందని సూచిస్తున్నారు.

- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో ఒక కప్పు కొబ్బరినూనె, రెండు చెంచాల మెంతులు వేసి బాగా మరిగించాలి. చల్లారిన తరవాత ఒక సీసాలో పోసి ఉంచుకోవాలి. రాత్రి పడుకునే ముందు ఈ నూనెని తలంతా పట్టించి పలుచని తువాలు కట్టుకోవాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో తల స్నానం చేయాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే కురులు పొడవుగా పెరుగుతాయి. మెంతుల్లోని ప్రొటీన్, నికోటినిక్ యాసిడ్‌వల్ల కురులు రాలడం తగ్గుతుంది.
- ఒక కప్పు కొబ్బరినూనెలో ఒక కట్ట కరివేపాకును తుంచి వేసి బాగా మరిగించాలి. గోరువెచ్చగా చల్లారిన తరవాత ఈ నూనెని వేళ్లతో తీసుకుంటూ మాడు మీద మర్దన చేయాలి. తల జిడ్డుగా అనిపిస్తే గంట తరవాత తల స్నానం చేయాలి. లేదంటే అలాగే ఉంచుకోవచ్చు. కరివేపాకులోని ఐరన్, కాల్షియం, బీటా కెరోటిన్ మూలకాలు వెంట్రుకల కుదుళ్లను గట్టి పరచి పొడవుగా పెరిగేలా చేస్తాయి. శిరోజాలు నెరవడాన్ని నిరోధిస్తాయి.



- ఒక గిన్నెలో మూడు చెంచాల కొబ్బరినూనె, ఒక చెంచా ఆముదం కలిపి గోరువెచ్చగా వేడిచేయాలి. రాత్రి పడుకునేముందు తలమీద వెంట్రుకల మొదళ్లకు పట్టించాలి. ఉదయాన్నే తలస్నానం చేయాలి. ఇలా రెండు రోజులకు ఒకసారి చేస్తూ ఉంటే శిరోజాలు ఒత్తుగా పొడవుగా పెరుగుతాయి. తలలో వేడి తగ్గి చుండ్రు రాకుండా ఉంటుంది.
- అరకప్పు కొబ్బరి నూనెలో గుప్పెడు వేపాకులు వేసి మరిగించాలి. తరవాత తలమీద వెంట్రుకలను పాయలుగా విడదీసి ఈ నూనెని పట్టించాలి. గంట తరవాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. వేపాకులోని యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాల వల్ల తలలో దురద, చుండ్రు, పేలు తొలగిపోతాయి. తల వెంట్రుకలు రాలడం తగ్గి పొడవుగా పెరుగుతాయి.
- కొబ్బరినూనెలో కలబంద గుజ్జు కలిపి రాసుకున్నా మంచి ఫలితం కనిపిస్తుంది. శిరోజాల కొనలు చిట్లడం ఆగి చక్కగా పెరుగుతాయి.
- కొబ్బరినూనెలో ఆవాల నూనె లేదా మందార నూనె కలిపి రాసుకుంటే కుదుళ్లు గట్టిపడి శిరోజాలు వేగంగా పెరుగుతాయి.

స్పోర్ట్స్

విజయవాడ ● గురువారం 27 ఫిబ్రవరి 2025

చాంపియన్స్ ట్రోఫీలో నేడు
పాకిస్థాన్ X బంగ్లాదేశ్
మ.2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

టాప్-5లో కోహ్లీ



దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్‌పై సూపర్ సెంచరీ కొట్టి ఫామ్‌లోకొచ్చిన విరాట్ కోహ్లీ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ముందంజ వేశాడు. బుధవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో బ్యాటర్ల జాబితాలో విరాట్ ఓ స్థానం ఎగబాకి ఐదో ర్యాంక్‌లో నిలిచాడు. శుభ్‌మన్ గిల్ నెంబర్ వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. బాబర్ ఆజమ్ (770) రెండో ర్యాంక్‌లో ఉండగా.. రోహిత్ శర్మ (757) మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. కేఎల్ రాహుల్ రెండుస్థానాలు ఎగబాకి 15వ ర్యాంక్‌లో ఉన్నాడు. బౌలర్లలో తీక్షణ, రషీద్, కుల్దీప్ యాదవ్ వరుసగా 1, 2, 3 ర్యాంక్‌లను నిలబెట్టుకున్నారు.

ఆటగాళ్ల భద్రత విధులకు నిరాకరణ

పాక్ పోలీసులపై వేటు

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యమిస్తున్న పాకిస్థాన్‌లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఈ మెగా టోర్నీ భద్రత కోసం నియమించిన పోలీసుల్లో దాదాపు వంద మందిపై ప్రభుత్వం వేటు వేసింది. పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన ఈ పోలీసులు తమకు కేటాయించిన విధులను నిర్వర్తించేందుకు నిరాకరించడమే వేటుకు ప్రధాన కారణం. 'చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా లాహోర్‌లోని గడాఫీ స్టేడియం నుంచి జట్లు బస చేసే హోటళ్ల వరకు క్రికెటర్ల భద్రత కోసమని పోలీసులను కేటాయించాం. అయితే, వీరిలో కొందరు బాధ్యతలు స్వీకరించేందుకు నిరాకరించగా, మరికొందరు పూర్తిగా విధులకు హాజరుకాలేదు. భద్రత పరంగా ముఖ్యంగా విదేశీయులకు సంబంధించిన విషయంలో ఇలాంటివి జరిగితే సహించేదే లేదు. అందుకే వారికి వెంటనే విధుల నుంచి ఉద్వాసన పలికాం' అని పంజాబ్ ఐజీపీ ఉస్మాన్ అన్వర్ వెల్లడించారు.

జట్టుతో చేరిన మోర్నీ మోర్కెల్

దుబాయ్: వ్యక్తిగత కారణాల రీత్యా కొన్నిరోజుల క్రితం స్వదేశం వెళ్లిన టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ మళ్లీ జట్టుతో కలిశాడు. బుధవారం ఇక్కడ జట్టు ప్రాక్టీస్ సెషన్ సందర్భంగా చీఫ్ కోచ్ గంబీర్‌తో మోర్కెల్ మాట్లాడుతూ కనిపించాడు. చాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఆరంభ మ్యాచ్ బంగ్లాదేశ్‌తో పోరుకు ముందు మోర్కెల్ కుటుంబాన్ని కలిసేందుకు స్వదేశం దక్షిణాఫ్రికాకు వెళ్లిపోయిన సంగతి తెలిసిందే.



ఇబ్రహీం జద్రాన్ (146 బంతుల్లో 12 ఫోర్లు, 6 సిక్సర్లతో 177)

ప్రపంచ క్రికెట్‌లో వేగంగా ఎదిగిన అఫ్ఘానిస్థాన్ మరోసారి తమ సత్తా ఏంటో చాటి చెప్పింది. చాంపియన్స్ ట్రోఫీలో తొలిసారి ఆడుతున్న అఫ్ఘాన్ సంచలన ప్రదర్శనతో ఇంగ్లండ్‌ను మట్టికరిపించి టోర్నీలో ఆశలను సజీవంగా ఉంచుకుంది. మొదట ఇబ్రహీం జద్రాన్ రికార్డు శతకంతో భారీస్కోరు సాధించిన అఫ్ఘాన్.. ఆపై ప్రత్యర్థి ఛేదనలో ఎదురైన సవాల్‌ను దీటుగా అధిగమించి అద్భుత విజయాన్ని అందుకుంది. వరుసగా రెండో ఓటమితో బట్లర్ సేన నాకౌట్ రేసు నుంచి నిష్క్రమించింది.

అఫ్ఘాన్ అదిరెన్

జద్రాన్ రికార్డు శతకం

ఇంగ్లండ్ అవుట్

ఒమర్జాయ్ ఆల్‌రౌండ్ షో

రూట్ సెంచరీ వృథా



రూట్ (120)

లాహోర్: చివరి వరకు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో అద్భుత విజయంసాధించిన అఫ్ఘానిస్థాన్.. చాంపియన్స్ ట్రోఫీ సెమీస్ ఆశలను సజీవంగా నిలబెట్టుకొంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఇబ్రహీం జద్రాన్ (146 బంతుల్లో 12 ఫోర్లు, 6 సిక్స్‌లతో 177) రికార్డు శతకంతో పాటు అజ్మతుల్లా ఒమర్జాయ్ (41, 5/58) ఆల్‌రౌండ్ షోతో.. గ్రూప్-బిలో బుధవారం జరిగిన చావోరేవో మ్యాచ్‌లో అఫ్ఘాన్ 8 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌కు షాకిచ్చింది. తొలుత అఫ్ఘాన్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 325 పరుగుల భారీ స్కోరు చేసింది. హస్మతుల్లా షాహిది (40), నబీ (40) రాణించారు. ఆర్చర్ మూడు, లివింగ్‌స్టోన్ రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఇంగ్లండ్ 49.5 ఓవర్లలో 317 పరుగులకు ఆలౌటైంది. జో రూట్ (111 బంతుల్లో 11 ఫోర్లు, సిక్సర్‌తో 120) సెంచరీ వృథా అయింది. నబీ 2 వికెట్లు సాధించాడు. ఈ ఓటమితో టోర్నీలో బట్లర్ సేన కథ ముగిసింది.

బ్యాటర్ల వైఫల్యం: భారీ ఛేదనలో ఓపెనర్ సాల్ట్ (12), జేమీ స్మిత్ (9), డకెట్ (38), బ్రూక్ (25) విఫలం కావడంతో ఇంగ్లండ్ 133/4తో ఇంగ్లండ్ ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో రూట్.. కెప్టెన్ బట్లర్ (38)తో కలిసి ఐదో వికెట్‌కు 83 పరుగులతో ఆదుకొనే ప్రయత్నం చేశాడు. అయితే, బట్లర్, లివింగ్‌స్టోన్ (10) స్వల్ప తేడాతో అవుటవడంతో ఇంగ్లండ్ శిబిరంలో గుబులు రేగింది. కానీ, సెంచరీ పూర్తి చేసుకొన్న రూట్.. ఓవర్టన్ (32)తో కలసి ఏడో వికెట్‌కు 54 పరుగులతో పోరాడాడు. కాగా, కీలక సమయంలో రూట్, ఓవర్టన్‌ను అవుట్ చేసిన ఒమర్జాయ్ మ్యాచ్‌ను అఫ్ఘాన్ వైపు మొగ్గేలా చేశాడు. ఆర్చర్ (14)ను ఫారూఖీ పెవిలియన్ చేర్చాడు. చివరి ఓవర్‌లో విజయానికి 13 పరుగులు కావాల్సి ఉండగా.. రషీద్ (5)ను ఒమర్జాయ్ వెనక్కిపంపి ఇంగ్లండ్ కథ ముగించాడు.

ఆరంభంలో తడబాటు: జద్రాన్ ముందుండి నడిపించడంతో.. అఫ్ఘాన్ సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్.. ఆరంభంలోనే తడబడింది. మరో ఓపెనర్ గుర్బాజ్ (6), సెదికుల్లా అటల్ (4), రహ్మత్ షా (4)ను ఆర్చర్ స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేర్చడంతో అఫ్ఘాన్ పవర్‌ప్లేలోపే 3/37తో కష్టాల్లో పడింది. ఈ దశలో కెప్టెన్ హస్మతుల్లాతో కలసి జద్రాన్ నాలుగో వికెట్‌కు 103 పరుగుల భాగస్వామ్యంతో ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టాడు. అయితే, హస్మతుల్లాను బౌల్డ్ చేసిన అదిల్ రషీద్.. జట్టుకు బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఒమర్జాయ్ చక్కని సహకారం అందించడంతో స్కోరు వేగం పుంజుకొంది. 37వ ఓవర్‌లో జద్రాన్ సింగిల్‌తో సెంచరీ పూర్తి చేసుకొన్నాడు. మరోవైపు ఒమర్జాయ్ కూడా ధాటిగా ఆడుతూ ఇంగ్లండ్ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. కానీ, ఒమర్జాయ్‌ను అవుట్ చేసిన ఓవర్టన్.. ఐదో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీశాడు. చివరి 10 ఓవర్లలో నబీ, జద్రాన్ 55 బంతుల్లో 111 పరుగులు జోడించడంతో.. అఫ్ఘాన్ స్కోరు 300 మార్క్ దాటింది.



అజ్మతుల్లా ఒమర్జాయ్ (41, 5/58)

1

చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన బ్యాటర్‌గా జద్రాన్ (177). ఇంగ్లండ్ ఆటగాడు బెన్ డకెట్ (165) రికార్డును జద్రాన్ బ్రేక్ చేశాడు. అఫ్ఘాన్ తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోరు కూడా జద్రాన్‌దే.


స్కోరుబోర్డు

అఫ్ఘానిస్థాన్: గుర్బాజ్ (బి) ఆర్చర్ 6, జద్రాన్ (సి) ఆర్చర్ (బి) లివింగ్‌స్టోన్ 177, సెదికుల్లా అటల్ (ఎల్బీ) ఆర్చర్ 4, రహ్మత్ షా (సి) రషీద్ (బి) ఆర్చర్ 4, హస్మతుల్లా షాహిది (బి) రషీద్ 40, ఒమర్జాయ్ (సి) సబ్/బాంటన్ (బి) ఓవర్టన్ 41, నబీ (సి) రూట్ (బి) లివింగ్‌స్టోన్ 40, నైబ్ (నాటౌట్) 1, రషీద్ ఖాన్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 50 ఓవర్లలో 325/7; వికెట్ల పతనం:** 1-11, 2-15, 3-37, 4-140, 5-212, 6-323, 7-324; **బౌలింగ్:** ఆర్చర్ 10-0-64-3, మార్క్ ఉడ్ 8-0-50-0, ఓవర్టన్ 10-0-72-1, రషీద్ 10-0-60-1, రూట్ 7-0-47-0, లివింగ్‌స్టోన్ 5-0-28-2.

ఇంగ్లండ్: సాల్ట్ (బి) ఒమర్జాయ్ 12, డకెట్ (ఎల్బీ) రషీద్ 38, జేమీ స్మిత్ (సి) ఒమర్జాయ్ (బి) నబీ 9, రూట్ (సి) గుర్బాజ్ (బి) ఒమర్జాయ్ 120, బ్రూక్ (సి అండ్ బి) నబీ 25, బట్లర్ (సి) షా (బి) ఒమర్జాయ్ 38, లివింగ్‌స్టోన్ (సి) గుర్బాజ్ (బి) నైబ్ 10, ఓవర్టన్ (సి) నబీ (బి) ఒమర్జాయ్ 32, ఆర్చర్ (సి) నబీ (బి) ఫారూఖీ 14, రషీద్ (సి) జద్రాన్ (బి) ఒమర్జాయ్ 5, ఉడ్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 49.5 ఓవర్లలో 317 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-19, 2-30, 3-98, 4-133, 5-216, 6-233, 7-287, 8-309, 9-313; **బౌలింగ్:** ఫారూఖీ 10-0-62-1, ఒమర్జాయ్ 9.5-0-58-5, నబీ 8-0-57-2, రషీద్ ఖాన్ 10-0-66-1, నూర్ అహ్మద్ 10-0-51-0, గుల్బదిన్ నైబ్ 2-0-16-1.

బ్రంట్ భళా

యూపీపై ముంబై ఘన విజయం



బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ముంబై ఇండియన్స్ మరో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నాట్ షివర్ బ్రంట్ (44 బంతుల్లో 13 ఫోర్లతో 75 నాటౌట్, 3/18) ఆల్‌రౌండ్ షోతో భళా అనిపించడంతో ముంబై 8 వికెట్లతో యూపీ వారియర్స్‌ను చిత్తు చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత యూపీ 20 ఓవర్లలో 142/9 స్కోరు చేసింది. గ్రేస్ హ్యారిస్ (26 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 45), దినేశ్ బ్రింద (30 బంతుల్లో 5 ఫోర్లతో 33), శ్వేత సెహ్రావత్ (13 బంతుల్లో 19) మాత్రమే రాణించారు. బ్రంట్ మూడు, సంస్కృతి గుప్తా, షబ్నిమ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో బ్రంట్ ధనాధన్ ఇన్నింగ్స్‌కు హేలీ మాథ్యూస్ (50 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 59) మెరుపు హాఫ్ సెంచరీ తోడవడంతో ముంబై 17 ఓవర్లలో 143/2 స్కోరు చేసి సులువుగా నెగ్గింది. మాథ్యూస్, బ్రంట్ రెండో వికెట్‌కు 82 బంతుల్లోనే 133 పరుగులు జత చేశారు. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో ముంబై అగ్రస్థానానికి దూసుకొచ్చింది.

డబ్ల్యూపీఎల్‌లో నేడు
బెంగళూరు x గుజరాత్
రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

సంక్షిప్తస్కోర్లు: యూపీ: 20 ఓవర్లలో 142/9 (హ్యారిస్ 45, బ్రింద 33, శ్వేత 19, బ్రంట్ 3/18, సంస్కృతి 2/11, షబ్నిమ్ 2/33)

ముంబై: 17 ఓవర్లలో 143/2 (బ్రంట్ 75 నాటౌట్, మాథ్యూస్ 59, దీప్తిశర్మ 1/25, ఎకిల్‌స్టోన్ 1/29).

డానిష్ సెంచరీ

విదర్భ 254/4 ● కేరళతో రంజీట్రోఫీ ఫైనల్



నాగ్‌పూర్: డానిష్ మలేవార్ ((138 బ్యాటింగ్), కరుణ్ నాయర్ (86) భాగస్వామ్యంతో.. కేరళతో బుధవారం ప్రారంభమైన రంజీట్రోఫీ ఫైనల్లో మొదటి రోజు విదర్భ కోలుకుంది. ఆట ఆఖరికి ఆ జట్టు 4 వికెట్లకు 254 పరుగులు చేసింది. టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేపట్టిన విదర్భ ఓ దశలో 24 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి తీవ్ర ఇక్కట్లలో పడింది. ఈ తరుణంలో మలేవార్, కరుణ్ నాలుగో వికెట్‌కు 215 పరుగులు జోడించి పరిస్థితి చక్కదిద్దారు. మూడు సెషన్లపాటు బ్యాటింగ్ చేసిన ఈ ఇద్దరు 69 ఓవర్లపాటు ప్రత్యర్థి బౌలర్లను ఎదుర్కొన్నారు. మలేవార్ దూకుడు ప్రదర్శించగా, నాయర్ సంయమనంతో బ్యాటింగ్ చేసి అతడికి అండగా నిలిచాడు. బౌండరీతో..మలేవార్ సీజన్‌లో రెండో శతకం పూర్తి చేశాడు. ఈ సీజన్‌లో నాలుగో సెంచరీకి చేరువలో నాయర్ రనౌట్‌గా వెనుదిరిగాడు. మొదటి రోజు ఆఖరికి మలేవార్‌తోపాటు యష్ ఠాకూర్ (5) క్రీజులో ఉన్నాడు.

తోటి బాక్సర్‌పై గుడ్డుతో దాడి!



మాంచెస్టర్: బ్రిటన్ బాక్సర్లు ఇయుబాంక్ జూనియర్-కానర్ బెన్ ఏప్రిల్ 26న బౌట్‌లో తలపడనున్నారు. ఆ బౌట్‌కు సంబంధించి మంగళవారం ఇక్కడ జరిగిన ప్రచార కార్యక్రమంలో బెన్ మొహంపై క్రిస్ కోడిగుడ్డు విసరడం సంచలనం రేపింది. వాస్తవంగా 2022లోనే క్రిస్-కానర్ తలపడాల్సి ఉంది. కానీ కానర్ బెన్ డోప్ పరీక్షకు హాజరు కాలేదు. దాంతో ఆ బౌట్ ఆగిపోయింది. 'డోప్'కు రాకపోవడంతో కానర్‌పై సస్పెన్షన్ విధించారు. అది ఇటీవల పూర్తి కావడంతో ఇద్దరు బాక్సర్ల మధ్య మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఇక.. కానర్ నాటి నిర్వాకాన్ని గుర్తు చేస్తూ అతడిపై కోడిగుడ్డు కొట్టినట్టు ఇయుబాంక్ జూనియర్ తెలిపాడు. ఈ ఘటన తర్వాత ఇద్దరు బాక్సర్ల భద్రతా సిబ్బంది మధ్య తోపులాట చోటుచేసుకుంది. దాంతో వాతావరణం ఒక్కసారి ఉద్రిక్తంగా మారింది.

కాసులు కురిపించిన పసిడి



రెండు నెలల్లోనే 12% పెరిగిన విలువ

అమెరికా, ఆస్ట్రేలియా ఈక్విటీ మార్కెట్లు దిగదుడుపు

అంతర్జాతీయ విపణిలో పసిడి ధర చుక్కలంటుతోంది. ఈ నెల ఒక దశలో ఔన్స్ (31.10 గ్రాములు) మేలిమి బంగారం ధర రికార్డు స్థాయిలో 2,956 డాలర్లను (సుమారు రూ.2.57 లక్షలు) తాకింది. ప్రస్తుతం 2,915 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. గత ఏడాది పసిడి పెట్టుబడులు మదుపరులకు 27 శాతం లాభాలు పంచాయి. గత 14 సంవత్సరాల్లో బంగారంపై పెట్టుబడులు ఈ స్థాయిలో లాభాలు అందించడం ఇదే ప్రథమం. 2025 సంవత్సరంలో తొలి రెండు నెలల కాలంలోనే పసిడిలో పెట్టుబడులు మదుపరులకు 12 శాతం వరకు లాభాలు పంచాయి. ఇదే సమయంలో అమెరికా, ఆస్ట్రేలియా స్టాక్ మార్కెట్లలో మదుపు చేసిన మదుపరులకు వచ్చిన లాభం రెండు నుంచి నాలుగు శాతం మాత్రమే. భారత స్టాక్ మార్కెట్ మాత్రం మదుపరులకు 4.64 శాతం నష్టాలు మిగిల్చింది. ఈ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో ఔన్స్ పసిడి ధర త్వరలోనే అంతర్జాతీయ మార్కెట్‌లో 3,000 డాలర్లకు చేరుతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి.

పసిడి పరుగుకు ప్రధాన కారణాలు :

- ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితి.
- వెంటాడుతున్న ద్రవ్యోల్బణ భయాలు.
- అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు.
- కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు.
- డిమాండ్‌కు తగ్గట్టు పసిడి ఉత్పత్తి, సరఫరా లేకపోవడం.
- స్టాక్ మార్కెట్ అనిశ్చితితో సురక్షిత పెట్టుబడిగా మారడం.
- నగలతో పాటు పారిశ్రామిక రంగంలోనూ పసిడి వినియోగం పెరగడం.
- రూపాయితో సహా ప్రధాన కరెన్సీలతో పెరుగుతున్న డాలర్ మారకం రేటు.

ఈక్విటీ మార్కెట్‌పై బేర్ పట్టు



6 నెలల్లో సూచీలు 14 % డౌన్

- రూ.82.51 లక్షల కోట్లు హాం ఫట్
- రూ.లక్ష కోట్ల ఎఫ్‌పీఐల పెట్టుబడులు వెనక్కి

న్యూఢిల్లీ : దేశీయ స్టాక్ మార్కెట్ 'బేర్'మంటోంది. గత ఏడాది సెప్టెంబరు 27న సెన్సెక్స్ 85,978.25 పాయింట్లు, నిఫ్టీ 26,277.35 పాయింట్ల జీవిత కాల గరిష్ఠ స్థాయిని తాకి రికార్డులు సృష్టించాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిఫ్టీ 3,729.8 పాయింట్లు (14.19 శాతం), సెన్సెక్స్ 11,376.13 పాయింట్లు (13.23 శాతం) నష్ట పోయాయి. దీంతో బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల షేర్ల మార్కెట్ విలువ రూ.479 లక్షల కోట్ల నుంచి మంగళవారానికి రూ.396.49 లక్షల కోట్లకు చేరింది. అంటే మార్కెట్ విలువ రూ.82.51 లక్షల కోట్లు క్షీణించిందన్న మాట. గత రెండు నెలల కాలంలోనే ఎఫ్‌పీఐలు దాదాపు రూ.లక్ష కోట్ల పెట్టుబడులను మన మార్కెట్ నుంచి వెనక్కి తీసుకున్నాయి. ఈ కింది అంశాలు దేశీయ స్టాక్ మార్కెట్‌ను షేక్ చేస్తున్నాయి.

- వర్తమాన ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసికం వృద్ధి రేటు 5.4 శాతానికి పడిపోవడం.
- మన కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవడం.
- ఎఫ్‌పీఐలు సెల్ ఇండియా, బై చైనా పాలసీని అనుసరించడం.
- కంపెనీల డిసెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం.
- ట్రంప్ ఆర్థిక విధానాలతో పెరుగుతున్న వాణిజ్య యుద్ధ భయాలు.
- ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితి.
- డాలర్‌తో బేర్ మంటున్న రూపాయి మారకం రేటు.
- ద్రవ్యోల్బణం ఇంకా అధికంగానే ఉండడం.
- అమెరికా రుణ పత్రాలపై అధిక వడ్డీ రేట్లు.
- అమెరికా ఫెడ్ రిజర్వు వడ్డీ రేట్ల తగ్గింపులకు బ్రేక్ ఇస్తుందనే అంచనాలు.

బిజినెస్

హైదరాబాద్‌లో ఎజిలీసియం 'జీసీసీ'

2,000 మందికి ఉద్యోగాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ తన గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాన్ని (జీసీసీ) ఏర్పాటు చేస్తోంది. లైఫ్ సైన్సెస్, ఫార్మా కంపెనీలకు జనరేటివ్ ఏఐ ఆధారిత వినూత్న డేటా అనలిటికల్ సేవలందించే అమెరికా కంపెనీ ఎజిలీసియం 'లైఫ్ సైన్సెస్ ఇన్నోవేషన్ అండ్ టాలెంట్ డెవలప్‌మెంట్ లాబ్' పేరుతో ఈ జీసీసీని ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం ఇప్పటికే బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఇంజినీరింగ్ రంగాలకు చెందిన 50 మంది నిపుణుల నియామకాలు పూర్తి చేసినట్టు కంపెనీ వ్యవస్థాపకులు, సీఈఓ రాజబాబు 'బయో ఏషియా, 2025' సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. 2027 నాటికి తమ హైదరాబాద్ జీసీసీలో 2,000 ఉద్యోగాలు కల్పించబోతున్నట్టు తెలిపారు. లైఫ్ సైన్సెస్ కంపెనీల పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలకు, వాటి అమ్మకాలు, మార్కెటింగ్‌కు జెనరేటివ్ ఏఐ ఆధారిత వినూత్న డేటా సేవలందించడం ఎజిలిసిఎం కంపెనీ ప్రత్యేకత. మౌలిక సదుపాయాలతో పాటు నిపుణులైన ఉద్యోగుల లభ్యతను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌లో తమ జీసీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు రాజబాబు చెప్పారు. ప్రస్తుతం తమకు ఉన్న యాభైకి పైగా క్లయింట్లలో 10 నుంచి 20 శాతం భారతీయ కంపెనీలన్నారు.

ఫోక్స్‌వ్యాగన్ కేసు మార్చి 10కి వాయిదా

ముంబై: స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ ఇండియా దిగుమతి సుంకాల ఎగవేత కేసు వచ్చే నెల 10కి వాయిదా పడింది. ఈ లోగా ఈ కేసు కాల పరిమితిపై అఫిడవిట్ ఫైల్ చేయాలని బొంబాయి హైకోర్టు కస్టమ్స్ శాఖను ఆదేశించింది. తాను దిగుమతి చేసుకునే కార్లను విడివిడిగా చూపుతూ ఫోక్స్‌వ్యాగన్ తక్కువ సుంకాలతో సరిపెడుతోందని, అందుకు 140 కోట్ల డాలర్లు (సుమారు రూ.12,000 కోట్లు) చెల్లించాలని కస్టమ్స్ శాఖ ఇటీవల కంపెనీకి నోటీసులు జారీ చేసింది. కంపెనీ దీన్ని బొంబాయి హైకోర్టులో సవాల్ చేసింది.

ఎయిర్‌టెల్-టాటా డీటీహెచ్ విలీనం!

- చర్చలను నిర్ధారించిన ఎయిర్‌టెల్

న్యూఢిల్లీ: కేబుల్ టీవీ, డీటీహెచ్ రంగంలో మరో పెద్ద విలీనానికి రంగం సిద్ధమవుతోంది. తన కేబుల్ టీవీ, డీటీహెచ్ సేవలను టాటా గ్రూప్ కంపెనీ టాటా ప్లేలో విలీనం చేసేందుకు భారతి ఎయిర్‌టెల్ చర్చలు జరుపుతోంది. కంపెనీ ఈ విషయాన్ని స్వయంగా నిర్ధారించింది. భారతి టెలిమీడియా అనే అనుబంధ కంపెనీ ద్వారా ఎయిర్‌టెల్ ఈ సేవలు అందిస్తోంది. అయితే ఈ వెంచర్ పూర్తిగా నష్టాల్లో ఉండడంతో టాటా గ్రూప్‌లో విలీనం చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఈ చర్చలు ఫలిస్తే దేశ డీటీహెచ్ రంగంలో ఇది రెండో విలీనం అవుతుంది. 2017లో డిష్ టీవీ వీడియోకాన్ డీ2హెచ్ విలీనమయ్యాయి.

స్పైస్‌జెట్ లాభం రూ.26 కోట్లు

న్యూఢిల్లీ: బడ్జెట్ విమానయాన సంస్థ స్పైస్‌జెట్ డిసెంబరు త్రైమాసికంలో రూ.26 కోట్ల నికరలాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో సంస్థ నమోదు చేసిన నష్టం రూ.300 కోట్లుంది. మొత్తం ఆదాయం కూడా సెప్టెంబరు త్రైమాసికంతో పోల్చితే 35% పెరిగి రూ.1651 కోట్లకు చేరినట్టు కంపెనీ వెల్లడించింది. అయితే గత డిసెంబరు త్రైమాసికంలో ఆర్జించిన రూ.2149 కోట్లతో పోల్చితే మాత్రం ఆదాయం క్షీణించింది.

100 కోట్ల మంది భారతీయుల వద్ద

ఖర్చుకు డబ్బుల్లేవ్



- స్వేచ్ఛగా ఖర్చు చేయగలిగేది 13-14 కోట్ల మందే..
- బ్లూమ్ వెంచర్స్ అంచనా

ముంబై: భారత జనాభా 140 కోట్ల పైమాటే. కానీ, దాదాపు 100 కోట్ల మంది భారతీయుల సంపాదన అంతంత మాత్రమేనని.. స్వేచ్ఛగా ఖర్చు చేసేందుకు వారి దగ్గర డబ్బు లేదని వెంచర్ క్యాపిటల్ సంస్థ బ్లూమ్ వెంచర్స్ అంచనా వేసింది. దేశంలో స్వేచ్ఛగా ఖర్చు చేయగలిగే వినియోగదారు వర్గం సైజు కేవలం 13-14 కోట్లేనని, ఇది మెక్సికో జనాభాకు సమానమని నివేదిక పేర్కొంది. మరో 30 కోట్ల మంది ఆశావహ వినియోగదారులని, ఇప్పుడిప్పుడే తమ పర్సుల్లోంచి డబ్బులు తీయడం మొదలు పెట్టారంటోంది. అయితే, వీరు ఆచితూచి ఖర్చు చేసేవారని అంటోంది. నివేదికలోని మరిన్ని విషయాలు..

- ఆసియాలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్‌లో ఇప్పుడున్న వినియోగదారు వర్గం ఆర్థికంగా మరింతగా వృద్ధి చెందుతున్నంతగా ఈ వర్గం సైజు మాత్రం విస్తరించడం లేదు. అంటే, సంపన్నుల సంఖ్య పెరగట్లేదు. ధనవంతులే మరింత సిరిమంతులవుతున్నారట. ఇది భారత వినియోగదారు మార్కెట్ దిశను మారుస్తోంది. ముఖ్యంగా ప్రీమియమైజేషన్ ట్రెండ్ పెరుగుతోంది.
- చాలా బ్రాండ్లు విస్తృత ప్రజానీకం కొనగలిగే ఉత్పత్తులకు బదులు ధనవంతులైన వారి కోసం ఖరీదైన, అప్‌గ్రేడెడ్ ఉత్పత్తుల విక్రయంపైనే ప్రధానంగా దృష్టిసారిస్తున్నాయి. అత్యంత విలాసవంతమైన గేటెడ్ కమ్యూనిటీల్లో గృహాలు, ఐఫోన్ వంటి ప్రీమియం మొబైల్స్ విక్రయాల్లో అనూహ్య వృద్ధే ఇందుకు నిదర్శనం. దేశీయ స్థిరాస్తి మార్కెట్లో అందుబాటు ధరలో లభించే గృహాల ప్రాజెక్టుల వాటా ఐదేళ్ల క్రితం 40 శాతంగా ఉండగా.. ఇప్పుడది 18 శాతానికి తగ్గింది. మార్కెట్లో బ్రాండెడ్ ఉత్పత్తుల మార్కెట్ వాటా వేగంగా పెరుగుతోంది.
- మంచి అనుభూతిని పంచే ఖరీదైన సేవలకు ఒక్కసారిగా గిరాకీ పెరిగింది. కోల్డ్ ప్లే, ఎడ్ షీరన్ వంటి పాశ్చాత్య గాయకులు భారత్‌లో నిర్వహించిన లైవ్ షోల టిక్కెట్లు హాట్ కేక్‌ల్లా అమ్ముడయ్యాయి.
- కొవిడ్ సంక్షోభం తర్వాత కాలంలో ధనవంతుల ఆస్తి మరింత పెరగగా.. పేదలు మరింత పేదరికంలోకి జారుకున్నారన్న అభిప్రాయాన్ని ఈ రిపోర్టులో వెల్లడైన విషయాలు సమర్థిస్తున్నాయి. వాస్తవానికి ఈ ట్రెండ్ కరోనా సంక్షోభానికి ముందే ప్రారంభమైంది. దేశంలో ఆర్థిక అసమానత పెరుగుతూవస్తోంది.
- దేశ సంపదలో 57.7 శాతం కేవలం 10 శాతం మంది భారతీయుల వద్దే కేంద్రీకృతమై ఉంది. 1990లో ఈ వాటా 34 శాతమే. కాగా, దేశ సంపదలో ఆర్థిక స్థోమత పరంగా దిగువ 50 శాతంలో ఉన్న జనాభా వాటా 22.2 శాతం నుంచి 15 శాతానికి పడిపోయింది.

పన్ను ఎగవేతదారులపై

ఐటీ నజర్

న్యూఢిల్లీ: గడిచిన రెండు ఆర్థిక సంవత్సరాల్లో (2022-23, 2023-24) పన్ను వినహాయింపుల్లో అవకతవకలకు పాల్పడినట్లుగా అనుమానిస్తున్న 40,000 మంది పన్ను చెల్లింపుదారులపై ఐటీ శాఖ నిఘా పెట్టింది. టీడీఎస్ (మూలస్థానంలో పన్ను వసూలు) క్లెయిమ్స్‌లో అవకతవకతలను గుర్తించేందుకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) సమగ్రమైన 16 అంచెల వ్యూహాన్ని రూపొందించింది. అనుమానిత పన్ను చెల్లింపుదారుల ఐటీ రిటర్నులను పునఃసమీక్షించేందుకు ఆదాయపు పన్ను శాఖకు చెందిన డేటా అనలిటిక్స్ బృందం ఇప్పటికే జాబితాను సిద్ధం చేసినట్లు తెలిసింది. తొలుత వారికి నోటీసు పంపి, వారి రిటర్నుల్లో ఏమైనా తప్పులుంటే సరిదిద్దుకునేందుకు ఓ అవకాశం ఇవ్వనున్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. తరచుగా ఇలాంటి తప్పులకు పాల్పడుతున్నవారిపై, ముఖ్యంగా ముందస్తు పన్ను చెల్లింపులు- పన్ను మినహాయింపుల్లో వ్యత్యాసం ఉన్న కేసులు, మినహాయింపుదారు వివరాల్లో తరచుగా సవరణలు జరుగుతున్న సందర్భాలపై ఐటీ డిపార్ట్‌మెంట్ ప్రధానంగా దృష్టిసారించనున్నట్లు సమాచారం.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

27వ తేదీ			
హైదరాబాద్	445	విజయవాడ	485
వరంగల్	447	గోదావరి	480
చిత్తూరు	493	విశాఖపట్నం	482
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	75	విజయవాడ	76
వరంగల్	75	గుంటూరు	76
కరీంనగర్	75	ఒంగోలు	76
మహబూబ్‌నగర్	75	చిత్తూరు	66
కర్నూలు	75	నెల్లూరు	71
విశాఖపట్నం	75	అనంతపురం	71
గోదావరి	76		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,820 ▼	80,500 ▼	1,06,000 ▼
విజయవాడ	89,500 ▲	84,500 ▲	99,000 ▲
విశాఖపట్నం	85,970 ▼	78,810 ▼	94,730 ▼
రాజమండ్రి	87,820 ▼	80,500 ▼	98,000 ▼
ప్రొద్దుటూరు	88,350 ▼	81,810 ▼	97,200 ▼
ముంబై	86,650 ▲	79,370 ▲	95,770 ▲

వంశీకి షాక్



- గూగుల్ టేకవుట్ మ్యాప్ చూపించి విచారించడంతో వంశీ ఉక్కిరిబిక్కిరి!
- నేటితో ముగియనున్న పోలీసు కస్టడీ

విజయవాడ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పోలీసు విచారణలో తమకు 'అదుర్స్' సినిమా చూపించిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి రెండో రోజు పోలీసులు గట్టిగానే షాక్ ఇచ్చారు. బాధితుడు సత్యవర్ధన్ కిడ్నాప్‌కు ముందు, ఆ తర్వాత వంశీ ఎక్కడెక్కడ సంచరించారనేది గూగుల్ టేకవుట్ మ్యాప్‌ను ముందుపెట్టి, పక్కా ఆధారాలతో విచారించడంతో వంశీ ఉక్కిరిబిక్కిరి అయ్యారని సమాచారం. విచారణాధికారుల ప్రశ్నలకు తొలుత తెలియదు... గుర్తులేదు... మరచిపోయాను.. అంటూ బుధవారం కూడా వంశీ దాటవేత ధోరణి ప్రదర్శించారు. విచారణలో భాగంగా వంశీకి సెంట్రల్ ఏసీపీ దామోదర్ మొత్తం 25 ప్రశ్నలను సంధించారు. గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసుతో తనకు సంబంధం లేదని సత్యవర్ధన్‌తో కోర్టులో ఈ నెల 10న అఫిడవిట్ దాఖలు చేయించిన విషయం తెలిసిందే. ఈ ఘట్టం పూర్తయిన అనంతరం సత్యవర్ధన్‌ను హైదరాబాద్ తీసుకెళ్లారు. 11న సత్యవర్ధన్‌ను వైజాగ్ పంపిన తర్వాత 12న వంశీ తాడేపల్లిలోని జగన్ నివాసానికి వెళ్లినట్టు గుర్తించారు. ఆయన హైదరాబాద్ నుంచి నేరుగా తాడేపల్లికి చేరుకున్నారు. జగన్‌తో భేటీ అయిన తర్వాత వైజాగ్‌కు వెళ్లారు. జగన్ నివాసానికి ఎందుకు వెళ్లారని విచారణాధికారులు ప్రశ్నించగా, అక్కడకు వెళ్లలేదని వంశీ సమాధానం ఇచ్చారు. ఈ సమయంలో గూగుల్ టేకవుట్ మ్యాప్‌ను ఆయన ముందు ఉంచినట్లు సమాచారం. వంశీ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినప్పటికీ గూగుల్ టేకవుట్‌తో పాటు నగరంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు.

వైజాగ్‌లో అవసరాల కోసం...

సత్యవర్ధన్ కేసులో నిందితులుగా ఉన్న వెలినేని వెంకటరామకృష్ణ ప్రసాద్, నిమ్మ లక్ష్మీపతిని బుధవారం పోలీసులు విచారించారు. వంశీ చెబితేనే తాము వైజాగ్ వెళ్లామని వారు విచారణలో అంగీకరించారు. వంశీ అనుచరులు ఎర్రంశెట్టి రామాంజనేయులు, ఎతేంద్ర రామకృష్ణ చెప్పినట్టే నడుచుకున్నామని వెల్లడించినట్టు తెలిసింది. వీరిలో లక్ష్మీపతి ఎతేంద్ర రామకృష్ణకు బంధువు. ఆయన వద్ద కొన్నాళ్లు డ్రైవర్‌గా పని చేశారు. వైజాగ్‌లో సత్యవర్ధన్‌ను ఎక్కడికైనా కారులో తీసుకెళ్లడానికి డ్రైవర్ అవసరమైతే అందుబాటులో ఉండడానికి లక్ష్మీపతిని అక్కడికి పంపారు. వెంకట రామకృష్ణ ప్రసాద్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నారు. విచారణలో అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పకపోవడం, దాటవేత ధోరణితో వ్యవహరించడంతో వంశీపై అఫిడవిట్ దాఖలు చేయాలని పోలీసులు భావిస్తున్నారు.

డల్‌గా లేను ఆరోగ్యంగానే ఉన్నా: వంశీ

తాను డల్‌గా లేనని, ఆరోగ్యంగానే ఉన్నానని వంశీ తెలిపారు. బుధవారం విచారణ ముగిసిన తర్వాత మీడియా ప్రతినిధులు ఆయనతో మాట్లాడారు. తన ఆరోగ్యం బాగానే ఉందని వంశీ చెప్పారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల గురించి అందరికీ తెలిసిన విషయమేనన్నారు. కాగా, విచారణలో నాలుగుసార్లు వంశీ తన న్యాయవాదితో భేటీ అయినట్టు తెలిసింది.

వైసీపీ సెల్ఫ్‌గోల్!

(మొదటి పేజీ తరువాయి)

ఆధారాన్ని వైసీపీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. 'సత్యమేవ జయతే' అనే క్యాప్షన్‌తో పెట్టిన ఈ పోస్టు సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో పోలీసుల వాదనను బలపర్చేదిలా ఉండటం గమనార్హం. తప్పుడు కేసులు అక్రమ నిర్బంధాలతో చట్టాన్ని న్యాయవ్యవస్థలను సీఎం చంద్రబాబు అపహాస్యం చేస్తున్నారంటూ వైసీపీ...చివరికి తానే సెల్ఫ్‌గోల్ వేసుకుంది. వంశీని పరామర్శించేందుకు ఈ నెల 18న జైలుకు మాజీ సీఎం జగన్ వెళ్లారు. వంశీపై తప్పుడు కేసు పెట్టారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కేసులో సాక్షిగా ఉన్న వ్యక్తిని కిడ్నాప్ చేసి చిత్రహింసలు పెట్టి తప్పుడు వాంగ్మూలం ఇప్పించిన వంశీపై కేసు పెట్టడం తప్పుడు కేసు ఎలా అవుతుందని అప్పట్లోనే సామాజిక మాధ్యమాల్లో జగన్ విపరీతంగా ట్రోలింగ్‌కు గురయ్యారు. తాజాగా మరో వీడియో విడుదల చేసిన వైసీపీ...అడ్డంగా బుక్కయింది.

ఆ వీడియోలో ఏముంది?

వైసీపీ బుధవారం 'ఎక్స్'లో ఓ పోస్టు చేసి, దానికి సంబంధించిన వివరాలను పేర్కొంది. 'ఈ వీడియోలో బ్లూషర్టు వేసుకున్న వ్యక్తి సత్యవర్ధన్. వల్లభనేని వంశీ కిడ్నాప్ చేశారని ఏపీ పోలీసులు చెబుతున్న వ్యక్తి ఇతనే.'నని పేర్కొంది. ఆ వీడియోలో సత్యవర్ధన్ మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి షాపింగ్ చేస్తున్నట్లు ఉంది. ఆ వీడియో ఈ నెల 12న విశాఖపట్నం ఆనందపురం జంక్షన్‌లో ఒక వస్త్ర దుకాణంలోనిదని వైసీపీ పేర్కొంది. ఈ వీడియోలో సత్యవర్ధన్ 'స్వేచ్ఛ'గా షాపింగ్ చేస్తుంటే కిడ్నాప్ అయ్యారని ఎలా చెబుతారని ప్రశ్నించింది.

వైసీపీ సెల్ఫ్ గోల్ వేసుకుందిలా..

సత్యవర్ధన్ కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదులోను.. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లోను.. కోర్టుకు సమర్పించిన చార్జిషీట్‌లోను.. సత్యవర్ధన్‌ను 10న విజయవాడలో కిడ్నాప్ చేశారని పేర్కొన్నారు. అదే రోజు బలవంతంగా కోర్టులో వాంగ్మూలం ఇప్పించి అనంతరం హైదరాబాద్ తీసుకెళ్లారనేది పోలీసుల వాదన. ఆ మరునాడు హైదరాబాద్‌లో వంశీ ఉంటున్న మై హోం భూజాలోకి సత్యవర్ధన్‌ను తీసుకెళుతున్న సీసీ కెమెరా ఫుటేజీని ఇప్పటికే పోలీసులు విడుదల చేశారు. సత్యవర్ధన్‌ను లిఫ్టులో తీసుకెళుతున్న సమయంలో వంశీతోపాటు భీమవరపు ఎతేంద్ర రామకృష్ణ అలియాస్ తేలప్రోలు రాము, యర్రంశెట్టి రామాంజనేయులు అలియాస్ పొట్టి రాము కూడా ఉన్నారు. హైదరాబాద్‌లో సత్యవర్ధన్‌ను నిర్బంధించి, కోర్టులో ఇచ్చిన వాంగ్మూలానికి కట్టుబడి ఉండాలని చిత్రహింసలు పెట్టారని పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. సత్యవర్ధన్‌ను హైదరాబాద్‌లో ఉంచడం సేఫ్ కాదని భావించిన వంశీ, తన మనుషులతో విశాఖకు తరలించి అక్కడ దాచారని పోలీసులు పేర్కొన్నారు. తాజాగా వైసీపీ విడుదల చేసిన విశాఖలోని వీడియో ఫుటేజీని పరిశీలిస్తే.. సత్యవర్ధన్‌తోపాటు వస్త్ర దుకాణంలో కనిపించిన ఇద్దరూ... హైదరాబాద్‌లో వంశీతోపాటు ఉన్న ఇద్దరు వ్యక్తులూ ఒక్కరే. పోలీసులు వినిపిస్తున్న వాదనకు బలం చేకూర్చేలా వైసీపీ వారే తాజా వీడియో విడుదల చేసి సెల్ఫ్‌గోల్ వేసుకున్నారు.

కిడ్నాపర్లు పక్కనుంటే స్వేచ్ఛగా ఉన్నట్టా..!

విశాఖపట్నంలో సత్యవర్ధన్‌ను షాపింగ్‌కు తీసుకెళ్లిన ఎతేంద్ర రామకృష్ణ కిడ్నాప్ కేసులో ఏ8గా ఉన్నారు. మరో వ్యక్తి యర్రంశెట్టి రామాంజనేయులు ఏ9గా ఉన్నారు. వీరిద్దరికీ నేరచరిత్ర ఉంది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై 2023 ఫిబ్రవరిలో దాడి చేసిన ఘటనలో వీరు ఉన్నారు. ఇద్దరూ వంశీ ప్రధాన అనుచరులు. వంశీ చేసే సెటిల్‌మెంట్లలో కీలకంగా ఉంటారు. అలాంటి నేర చరిత్ర ఉన్న ఇద్దరు వ్యక్తులు పక్కన ఉంటే సత్యవర్ధన్ కిమ్మనకుండా వారు చెప్పినట్టు వింటాడా లేక పారిపోవడానికి ప్రయత్నిస్తాడా..? సత్యవర్ధన్ ప్రాణభయానికి వైసీపీ 'స్వేచ్ఛ' అనే పేరు పెట్టడం విమర్శలకు దారితీస్తోంది.

పోసాని అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు స్పష్టం చేశారు. 'మా ఇంట్లోకి వచ్చి నన్నే కోఆపరేట్ చేయమంటారేంటి' అని పోసాని వారిని నిలదీశారు. కేసు నమోదైతే కశ్మీర్‌కైనా వెళ్లి అరెస్టు చేసే అధికారం ఉంటుందని సదరు అధికారి స్పష్టం చేశారు. 'నాకు ఆరోగ్యం బాగలేదు... ఆపరేషన్ చేయించుకున్నా. పేషంట్‌ను కూడా పట్టించుకోరా' అని మళ్లీ పోసాని ఆగ్రహించారు. పోసాని సతీమణికి నోటీసు ఇచ్చేందుకు పోలీసులు ప్రయత్నించారు. 'సర్‌ను అరెస్టు చేస్తున్నాం, నోటీసు తీసుకోండి మేడమ్' అని కోరడంతో... 'తీసుకోవద్దు... తీసుకోవద్దు' అని పోసాని ఆమెను ఆదేశించారు. 'నోటీసు తీసుకోండి సార్' అని పోలీసు అధికారి పదేపదే కోరినా... 'నోటీసు తీసుకునేదిలేదు. అరెస్టు చేసుకోండి' అని విసురుగా బదులిచ్చారు. 'ఆడవాళ్ల మీద రౌడీయిజం చేయొద్దు' అని పోలీసులను హెచ్చరించారు. 'మేం రౌడీయిజం చేయడంలేదు. నోటీసు ఇస్తున్నాం' అని ఎస్ఐ బదులిచ్చారు. 'నేను మాత్రలు వేసుకోవాలి. అన్నం తింటా' అన్నారు. ఆయన వేసుకోవాల్సిన మందులు ఇవ్వాలని పోలీసులు సూచించగా... 'ఏ మాత్ర ఎప్పుడు వేసుకోవాలో ఆయనకు తెలియదు. అన్నీ నేనే ఇస్తా' అని ఆయన సతీమణి చెప్పారు. అన్ని విషయాలు తాము దగ్గరుండి జాగ్రత్తగా చూసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చారు. ఆయన కొంత సమయం తీసుకుని దుస్తులు మార్చుకుని, పోలీసులతో వచ్చారు.

సారీలు చెప్పుకొని...

కూటమి అధికారంలోకి వచ్చాక కూడా పోసాని తన తీరు మార్చుకోలేదు. టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడుపై వ్యక్తిగత దూషణలు, అడ్డగోలు ఆరోపణలు చేశారు. దీనిపై అనంతపురం రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ తర్వాత వరుస కేసులు, అరెస్టుల భయంతో పోసాని ఒక్కసారిగా తన స్వరం మార్చేశారు. అంతకు ముందు వాడూ, వీడు అని విరుచుకుపడిన ఆయనే... 'గారు' అంటూ మర్యాద ఇచ్చారు. 'నేను రాజకీయాల నుంచి తప్పుకొంటున్నా. ఇక ఎవరి గురించీ మాట్లాడను' అని చేతులు పైకెత్తేశారు. 'రాజకీయ నాయకులందరికీ నమస్కరిస్తున్నాను. ఇన్నేళ్లు నన్ను ఆదరించారు. ఈ రోజు నుంచి నేను చనిపోయేదాకా నా బిడ్డలు, నా కుటుంబం కోసమే బతుకుతా. ఏ రాజకీయాల గురించీ మాట్లాడను' అని వినమ్రంగా తెలిపారు. కానీ... అప్పటికే ఆయనపై రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. సీఐడీకి కూడా ఫిర్యాదులు రావడంతో విచారణ జరిపింది.

నాడు అడ్డగోలుగా రెచ్చిపోయి

2019లో వైసీపీ అధికారంలోకి రాకముందు నుంచే పోసాని టీడీపీ, జనసేన అగ్రనేతలపై అడ్డగోలుగా మాట్లాడటం మొదలుపెట్టారు. 'నేను ఏ పార్టీలో చేరను' అంటూనే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లపై శ్రుతిమించి వ్యక్తిగత విమర్శలకు దిగేవారు. ఇక... వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆయన మరింత రెచ్చిపోయారు. జగన్‌పట్ల స్వామి భక్తిని చాటుకుంటూ... చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను బూతులు తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. దీనికి ప్రతిఫలంగా జగన్ ఆయనకు ఏపీ ఫిల్మ్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎఫ్‌డీసీ) చైర్మన్ పదవి కట్టబెట్టారు. ప్రెస్‌మీట్లు, టీవీ డిబేట్లు, సోషల్ మీడియా వేదికలపై టీడీపీ, జనసేన నేతలను పోసాని అసభ్య పదజాలంతో తిట్టిన సందర్భాలు ఎన్నో! "బ్రోకర్, లోఫర్, సైకో, వెధవ, దరిద్రపు నా కొడకా, రాజకీయాలు వదిలేసి ఏ చావైనా చావు... మీ అమ్మను, భార్యను కూడా తిడతా, ఏం చేసుకుంటావో చేసుకో!" అంటూ ఒకసారి పవన్ కల్యాణ్‌పై బూతులతో విరుచుకుపడ్డారు. పత్రికల్లో ప్రచురించలేని భాష కూడా వాడారు. పోసాని వ్యాఖ్యలపై కడుపు మండిన టీడీపీ, జనసేన కార్యకర్తలు అప్పట్లో ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. కనీసం ఫిర్యాదులు కూడా తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పోసాని వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గుంటూరు, విజయవాడ, నర్సారావుపేట, అన్నమయ్య, అనంతపురం, బాపట్ల, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి తదితర ప్రాంతాల్లో ఫిర్యాదులు వచ్చాయి. ఆయనపై రాష్ట్రవ్యాప్తంగా పదికిపైగా కేసులు నమోదయ్యాయి.

రంగంలోకి అన్నమయ్య జిల్లా పోలీసులు

అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 24వ తేదీ మణి అనే జనసేన నాయకుడు పోసానిపై ఫిర్యాదు చేశారు. కులాల పేరుతో దూషించడం, ప్రజల్లో వర్గ విభేదాలు సృష్టించడం వంటి అభియోగాలతో భారత న్యాయ సంహితలోని సెక్షన్ 196, 353 (2), 111 రెడ్‌విత్ 3(5) కింద కేసు (క్రైమ్ నంబర్ 65/2025) నమోదు చేశారు. పోసాని మాట్లాడిన మాటల వీడియో, ఆడియో టేపులను పోలీసులు పరిశీలించారు. ఇదే కేసులో ఆయనను అరెస్టు చేశారు.

మన సంగతేంటి భయ్యా?

(మొదటి పేజీ తరువాయి)

తన కార్యక్రమాలను హైదరాబాద్ నుంచి దుబాయ్‌కి పూర్తిగా మార్చుకున్నారు. అక్కడ అత్యంత ఖరీదైన జుమేరా లేక్‌టవర్స్ అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో నివాసముంటూ రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ వ్యాపారాలు చేస్తూ పలు లేక్‌వ్యూ ప్రాజెక్టులు చేపట్టారని సమాచారం. అలాగే, వందల కోట్ల రూపాయల విలువైన భూములు కలిగిన దుబాయ్‌లోని ఓ పెద్ద ల్యాండ్ డెవలపింగ్ కంపెనీలో కేదార్ కీలక వాటాదారుగా ఉన్నారని తెలిసింది. రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ కంపెనీలకు ఆ సంస్థ భూములను విక్రయిస్తుంటుంది. అయితే, టాలీవుడ్ ప్రముఖుల తరఫున కేదార్ ఆ కంపెనీలో భాగస్వామిగా ఉన్నారని దుబాయ్ వ్యాపార వర్గాల్లో ప్రచారం ఉంది. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ సమాచారం మేరకు సెలగంశెట్టి కేదార్ 9 కంపెనీల్లో డైరెక్టర్, చైర్మన్ వంటి కీలక హోదాల్లో ఉన్నారు. ఈ సంస్థలన్నీ చాలా వరకు కన్‌స్ట్రక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాలకు సంబంధించినవే. అయితే, కేదార్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్న అగ్ర హీరోలు, నిర్మాతలు, బడా దర్శకులతోపాటు కొందరు రాజకీయ నాయకులు కూడా ఆయా వ్యాపారాల్లో వందల కోట్లు పెట్టుబడిగా పెట్టారని తెలుస్తోంది. వీరందరికీ కేదార్ బినామీగా వ్యవహరించేవాడని చెబుతున్నారు. కేదార్‌ను కలిసేందుకే ఆయా ప్రముఖులు తరచూ దుబాయ్ వెళ్లి వచ్చేవారని సినీ వర్గాల్లో ప్రస్తుతం తీవ్ర చర్చ జరుగుతోంది. అయితే, ఆ పెట్టుబడుల లెక్కలు, వివరాలన్నీ కేదార్‌కు మాత్రమే తెలియడంతో.. అతనిని నమ్మి డబ్బు ఇచ్చిన ప్రముఖుల పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారిందని అంటున్నారు. ఇక, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే కేదార్ మరణించినప్పుడు అక్కడే ఉన్నట్టు సమాచారం. ఆయన మాత్రమే కాదు.. రాజకీయ, సినీ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు నాలుగు రోజులుగా దుబాయ్‌లోనే ఉన్నట్టుగా తెలిసింది. కాగా, తాను దుబాయ్‌లో లేనని, హైదరాబాద్‌లోని తన నివాసంలోనే ఉన్నానని పేర్కొంటూ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి బుధవారం ఓ వీడియో విడుదల చేశారు.

'**మీరు** కాల్ చేసిన వ్యక్తి మరో కాల్‌లో ఉన్నారు. దయచేసి వేచి ఉండండి.. లేదా మరలా ప్రయత్నించండి'.. సివిల్ సప్లయిస్ టోల్‌ఫ్రీ నంబరుకు ఎప్పుడు ఫోన్ చేసినా ఫిర్యాదుదారులకు వస్తున్న సమాధానమిదే!! ఫిర్యాదులు ఎక్కువగా పెండింగ్‌లో ఉంటే.. ముఖ్యమంత్రి దృష్టిలో తమ శాఖ పని చేయట్లేదనే ముద్ర పడుతుందని భయపడ్డారో ఏమో తెలియదు గానీ పౌరసరఫరాలశాఖ అధికారులు ఇటీవల ప్రజల నుంచి వస్తున్న సమస్యలను స్వీకరించడమే మానేశారు. దీంతో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు!!.

ఎప్పుడూ బిజీయేనా?!

- మీరు కాల్ చేస్తున్న వ్యక్తి బిజీగా ఉన్నారు..
- దయచేసి మరలా ప్రయత్నించండి!!
- సివిల్ సప్లయిస్ టోల్‌ఫ్రీకి ఫోన్ చేస్తే ఇదే సమాధానం
- ప్రజా ఫిర్యాదులు స్వీకరించని అధికారులు
- సమస్యలు ఎక్కువైతే జవాబు చెప్పుకోవాలని ఎత్తుగడ
- ఫిర్యాదుదారుల అసహనం.. సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్న

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రజలకు ఎదురయ్యే సమస్యలకు సమాధానం చెప్పేవారు కరువయ్యారు. టోల్‌ఫ్రీ నంబరు ఉన్నా ఉన్నతాధికారుల ఆదేశాలతో ఫిర్యాదులను స్వీకరించడం మానేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై వినియోగదారులు, రైతులు, ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ప్రతినెలా రేషన్ సరుకుల పంపిణీ, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, ప్రతి వ్యవసాయ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో రేషన్‌కార్డుదారులు, దీపం-2 పథకం లబ్ధిదారులు, రైతుల నుంచి సమస్యలను స్వీకరించేందుకు విజయవాడలోని సివిల్ సప్లయిస్ భవన్‌లో 1967 టోల్‌ఫ్రీ నంబరుతో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఆహార కమిషన్, తూనికలు, కొలతలు, వినియోగదారుల విభాగాలకు సంబంధించి సమస్యలు, ఇబ్బందులు ఉన్నవారు కూడా ఇదే టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే.. నమోదు చేసుకుని వాటిని పరిష్కరించేందుకు వీలుగా పది లైన్లతో ఈ హెల్ప్‌లైన్ సెంటరును విస్తరించారు. పది మంది సిబ్బందిని కూడా నియమించారు. అయితే గత కొంతకాలంగా ఈ హెల్ప్‌లైన్ అలంకారప్రాయంగానే మారింది. మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించిన రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమ కాలేదని, రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని, దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకున్నా ప్రభుత్వ రాయితీ అందలేదని, ఉచిత గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారుల నుంచి కూడా డెలివరీ చార్జీలు వసూలు చేస్తున్నారంటూ రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది సివిల్ సప్లయిస్ హెల్ప్‌లైన్‌కు ప్రతి రోజూ ఫోన్లు చేస్తున్నారు. ఇంకా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ సరుకులు సక్రమంగా ఇవ్వడం లేదని, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో లోపాలు, సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్లు చేస్తున్నా.. 'మీరు కాల్ చేస్తున్న వ్యక్తి ప్రస్తుతం మరొక కాల్‌లో ఉన్నారు. దయచేసి వేచి ఉండండి లేదా మరలా ప్రయత్నించండి' అంటూ రికార్డెడ్ సమాధానమే వస్తోంది. కార్యాలయ పని దినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇదే పరిస్థితి. సివిల్ సప్లయిస్ అధికారుల సూచనల మేరకే హెల్ప్‌లైన్ సిబ్బంది ఫిర్యాదులను స్వీకరించడం లేదనే ఆరోపణలున్నాయి.

మంత్రిగారి మాటకు విలువేదీ?!

ఉచిత గ్యాస్ సిలిండర్ల విషయంలో ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే టోల్ ఫ్రీ నంబరు 1967కు ఫోన్ చేయాలని, అక్కడ ఉన్న సిబ్బంది వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కరిస్తారని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్, సివిల్ సప్లయిస్ అధికారులు మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయడంతో లబ్ధిదారులు ఆ టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్లు చేస్తున్నారు. అయితే సమాధానం చెప్పేవారు కరువవడంతో ఫిర్యాదుదారులు తీవ్ర అసహనానికి గువుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను హెల్ప్‌లైన్ ద్వారా స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

నీటి లెక్క తేలింది!

- తెలంగాణకు 63 టీఎంసీలు.. ఏపీకి 55
- కృష్ణా జలాలపై 2 రాష్ట్రాల సీఈల ఏకాభిప్రాయం
- నేడు కృష్ణా బోర్డు సమావేశంలో కేటాయింపులపై తుది నిర్ణయం
- గత రెండ్రోజులుగా హైడ్రామా

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో ఉన్న నీటి నిల్వలను మే, జూన్ వరకు ఎవరెవరు ఎంతెంత వాడుకోవాలో ఆంధ్ర, తెలంగాణ చీఫ్ ఇంజనీర్ల కమిటీ నిర్ధారించింది. పంటలు కాపాడుకోవడానికి, తాగునీటి అవసరాల కోసం తెలంగాణకు 63 టీఎంసీలు, ఏపీకి 55 టీఎంసీలు అవసరమని అంచనా వేసింది. ఈ వివరాలతో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కి నివేదిక సమర్పించింది. బోర్డు గురువారం హైదరాబాద్ జలసౌధలో సమావేశమై ఈ నివేదిక ఆధారంగా రెండు రాష్ట్రాలకు కృష్ణా జలాలను ఏ మేర కేటాయించాలో ఖరారు చేయనుంది. వాస్తవానికి మంగళ, బుధవారాల్లో హైడ్రామా చోటుచేసుకుంది. ఈ నెల 24న జరిగిన సమావేశంలో రెండు రాష్ట్రాల తాగు, సాగు నీటి అవసరాల వాస్తవ అంచనాకు రెండు రాష్ట్రాల సీఈలతో బోర్డు కమిటీని వేసింది. అయితే మంగళవారమే వారు భేటీ అవ్వాల్సి ఉండగా.. తెలంగాణ సీఈ హాజరు కాలేదు. దీంతో బుధవారం సమావేశం జరిగింది. తెలంగాణ తరఫున నల్లగొండ చీఫ్ ఇంజనీర్ వి.అజయ్‌కుమార్, ఏపీ తరఫున ఒంగోలు చీఫ్ ఇంజనీర్ బి.శ్యామ్ ప్రసాద్ జలసౌధలో కలిసి.. ప్రస్తుత రబీలో సాగర్ నుంచి ఇరు రాష్ట్రాలకు అవసరమైన సాగునీటితో పాటు జూన్ నెల వరకు తాగునీటి అవసరాలకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేశారు. కనిష్ఠ నిల్వ మట్టానికి ఎగువన శ్రీశైలంలో 36.51 టీఎంసీలు, సాగర్‌లో 30.57 టీఎంసీలు.. మొత్తం 67 టీఎంసీల లభ్యత ఉన్నట్లు తేల్చారు. శ్రీశైలం జలాశయం పరిధిలో ఏపీకి 10 టీఎంసీలు, తెలంగాణకు 13 టీఎంసీలు.. సాగర్ కింద ఏపీకి 45 టీఎంసీలు, తెలంగాణకు 50 టీఎంసీలు.. మొత్తంగా ఆంధ్రకు 55 టీఎంసీలు, తెలంగాణకు 63 టీఎంసీలు అవసరమని ఇరువురు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ మేరకు బోర్డుకు నివేదిక ఇచ్చారు. గురువారం జరిగే రెండో అత్యవసర సమావేశంలో కృష్ణా బోర్డు ఈ ప్రణాళిక ఆధారంగా రెండు రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై నిర్ణయం తీసుకోనుంది.

బోర్డుపై తెలంగాణ ఒత్తిడి..

మంగళవారంనాటి సమావేశానికి తెలంగాణ సీఈ హాజరుకాకపోవడంతో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు జలసౌధలో భేటీ అవ్వాలని ఏపీ, తెలంగాణ చీఫ్ ఇంజనీర్లు నిర్ణయించారు. ఈ నిర్ణయం తీసుకున్న వెంటనే.. బుధవారం సాయంత్రం 4 గంటలకు బోర్డు సమావేశం పెడదామని ఆంధ్ర ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ) ఎం.వెంకటేశ్వరరావుకు అతుల్ జైన్ ప్రతిపాదించారు. అయితే సీఈల తుది నిర్ణయం ఏమిటో తెలుసుకోకుండా.. ఆదరాబాదరాగా ఎలా సమావేశమవుతామని వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. చీఫ్ ఇంజనీర్ల సమావేశం తర్వాతే దీనిపై చర్చించుకుంటామని తేల్చిచెప్పారు. ఆయన ఇదే విషయాన్ని తెలంగాణ ఈఎన్‌సీకి కూడా వివరించారు. బుధవారం చీఫ్ ఇంజనీర్లు సమావేశం కానున్నారని.. పైగా శివరాత్రి పర్వదినం అయినందున గురువారమే భేటీ అవుదామని వెంకటేశ్వరరావు కోరడంతో తెలంగాణ ఈఎన్‌సీ ఆమోదం తెలిపారు. బుధవారం సీఈల సమావేశం ముగియగానే.. వెంటనే బోర్డు సమావేశం పెట్టాలని తెలంగాణ కేఆర్ఎంబీని కోరింది. నీటి కేటాయింపులపై సత్వరం నిర్ణయం తీసుకోవాలని ఒత్తిడి పెంచింది. దీంతో హైదరాబాద్‌కు ప్రత్యక్షంగా రాలేకపోయినా.. వీడియో కాన్ఫరెన్సు ద్వారా గానీ.. టెలికాన్ఫరెన్సులో గానీ హాజరుకావాలని వెంకటేశ్వరరావును జైన్ కోరారు. శివరాత్రి సందర్భంగా తాను కోవెలకు వచ్చానని.. గురువారం ప్రత్యక్షంగా హాజరవుతానని వెంకటేశ్వరరావు చెప్పారు. దీనికి జైన్ అంగీకరించారు. గురువారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ జలసౌధలోని కేఆర్ఎంబీ కార్యాలయంలో భేటీ కావాలని నిర్ణయించారు.

అత్యవసర భేటీ అంటూ..

ఇంకోవైపు.. అత్యవసరంగా కలవాలంటూ జైన్‌తో తెలంగాణ నీటిపారుదల కార్యదర్శి రాహుల్ బొజ్జా భేటీ అయ్యారు. కృష్ణా జలాల్లో కేటాయింపుల కంటే ఎక్కువగా ఏపీ వాడేసిందని మరోసారి ఫిర్యాదు చేశారు. సాగర్‌లో అందుబాటులో ఉన్న జలాల్లో ఆ రాష్ట్రానికి వాటా రాదన్నారు. మే, జూన్ నెలల్లో సాగుకు, తాగునీటికి ఇండెంట్ పెట్టే హక్కు దానికి లేదని చెప్పారు. ఏపీ వాదనలు సరైనవే అయితే సమావేశానికి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే పండుగ నాడు కూడా కేఆర్ఎంబీతో భేటీకి వచ్చామని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌కు నిజంగా రాష్ట్ర ప్రయోజనాలపై ఆసక్తి ఉంటే ఎందుకు ఆన్‌లైన్‌లో హాజరు కాలేదని ప్రశ్నించారు. కాగా.. గురువారం భేటీలో నీటి వాడకంపై వైఖరిని ఆంధ్ర మరోసారి స్పష్టం చేయనుంది. వరద నీటిని మాత్రమే వాడుకున్నామని గణాంకాలతో వెల్లడించేందుకు సమాయత్తమవుతోంది.

అనుమానాస్పద మృతేనా?

- కేదార్ మరణంపై దొరకని పోలీసుల క్లియరెన్స్

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)



సినీ నిర్మాత కేదార్ సెలగంశెట్టిది అనుమానాస్పద మరణమా? సాధారణ మృతి కాదా? ఈ ప్రశ్నలకు ప్రస్తుత పరిణామాలు, దుబాయ్ నిబంధనలు అవుననే సమాధానం చెబుతున్నాయి. ఇలాంటి కేసుల్లో సాధారణంగా దుబాయ్ పోలీసులు సమాచారాన్ని గోప్యంగా ఉంచుతారు. కేసు తేలేదాకా వివరాలను బహిర్గతం చేయరు. కేదార్ కేసులోనూ.. ఆయన మరణానికి కారణాలను వెల్లడించలేదు. భారతీయ అధికారులకు, రాయబార కార్యాలయానికి కూడా.. ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు.

సాధారణ మరణాలైతే..

దుబాయ్‌లో ఎవరైనా సాధారణంగా/సహజంగా మరణిస్తే.. పోలీసులు 24 గంటల్లోపు క్లియరెన్స్ ఇస్తారు. పోలీసు క్లియరెన్స్ అందగానే.. మృతదేహాన్ని ప్యాక్ చేసి, స్వదేశానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతాయి. కేదార్ విషయంలో మాత్రం రెండ్రోజులవుతున్నా.. ఈ ప్రక్రియ తుదిదశకు చేరుకోలేదు. కనీసం మరణానికి కారణాలను వెల్లడించలేదు. అనుమానాస్పద మరణాల విషయంలోనే పోలీసులు తమ దర్యాప్తును పూర్తి చేశాకే మృతదేహాలను అప్పగిస్తారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మరణించినా.. గల్ఫ్ దేశాల్లో పోలీసు నివేదిక తప్పనిసరి. మృతదేహానికి వైద్య పరీక్షలు పూర్తిచేశాకే బంధువులకు అప్పగిస్తారు. కేదార్ విషయంలో మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయినా.. వివరాలు వెలుగులోకి రాలేదు. పోస్టుమార్టం నివేదికను తదుపరి దర్యాప్తు నిమిత్తం తరలించారు. అయితే.. ఆ వివరాలను ఎక్కడికి పంపారనే విషయాన్ని బహిర్గతం చేయలేదు. అక్కడి నుంచి ప్రాథమిక నివేదిక వచ్చేవరకు మృతదేహాన్ని అప్పగించే అవకాశాలు లేవని తెలుస్తోంది. దుబాయ్ సహా.. గల్ఫ్ దేశాల్లో అనుమానాస్పద మరణాలు సంభవిస్తే.. బాధితుల దేశానికి చెందిన రాయబారులకు కూడా వివరాలు చెప్పరు. కేదార్ విషయంలోనూ అధికారవర్గాలకు సమాచారం లేదు.

భాష పేరుతో డీఎంకే, బీజేపీ కపట నాటకాలు

- అన్ని భాషలను గౌరవించాల్సిందే
- మూడో భాష అమలును వ్యతిరేకిస్తాం
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మాదే విజయం
- టీవీకే వార్షికోత్సవంలో పార్టీ అధినేత విజయ్

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): భాష పేరుతో తమిళనాట డీఎంకే ప్రభుత్వం, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కపట నాటకాలాడుతున్నాయని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత, సినీ హీరో విజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను మోసగించడానికి ఎల్కేజీ విద్యార్థుల్లా కొట్లాడుకుంటున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియాలో ఒకరికొకరు హ్యాష్‌ట్యాగ్‌లు వేసుకుని ఆటలాడుతున్నారని ధ్వజమెత్తారు. మహాబలిపురంలోని ఓ స్టార్ హోటల్‌లో బుధవారం జరిగిన టీవీకే పార్టీ ద్వితీయ వార్షికోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రానికి అవసరాల మేరకు నిధులివ్వడం కేంద్రం బాధ్యత అని, కేంద్రం నుంచి నిధులు రాబట్టడం రాష్ట్ర ప్రభుత్వం విధి అని చెప్పారు. అయితే ఇటీవల విద్యా సంబంధిత నిధుల వ్యవహారంలో డీఎంకే, బీజేపీ ప్రభుత్వాలు తాయిలాల కోసం కొట్లాడుకునే చిన్న పిల్లల్లా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఆ రెండు పార్టీల నాటకాలు ప్రజలకు తెలిసిందేనన్నారు. 'వాట్ బ్రో... ఇట్స్ రాంగ్ బ్రో' అంటూ సినీ స్టయిల్‌లో చెణుకులు విసిరారు. అన్ని భాషలను గౌరవించాల్సిందేనని, అదే సమయంలో ఓ భాషను నిర్బంధంగా అమలు చేయాలని కేంద్రం ప్రయత్నించడం సమాఖ్య రాజ్యాంగ విధానానికి వ్యతిరేకమన్నారు. విద్యా విధానాలను అయోమయంలో ఉంచి, ఓ భాషను నెత్తికెత్తుకుని నిర్బంధంగా అమలు చేయడం ఏమిటి అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో మూడో భాషను అమలు చేయడానికి ప్రయత్నిస్తే తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో పెత్తందార్లను ఇంటికి సాగనంపడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని చెప్పారు. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ విజయ ఢంకా మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అవినీతిని అంతమొందించాలి: ప్రశాంత్ కిశోర్

టీవీకే వేడుకల్లో ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ పాల్గొని మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనంత అవినీతి ప్రస్తుతం తమిళనాడులో ఉందన్నారు. అవినీతిపరులను అంతమొందించాలని, ఈ సత్కార్యాన్ని విజయ్ నెరవేరుస్తారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా విజయ్ గెలుస్తాడని, దానికి అవసరమైన అండదండలను తాను అందిస్తానని భరోసా ఇచ్చారు. విజయ్ పార్టీకి తాను వ్యూహకర్తగా పనిచేయడం లేదని, కానీ తమిళనాడులో కొత్త మార్పు కోసం ఆయనకు అండగా నిలిచానని వివరించారు. నాలుగేళ్ల క్రితమే తాను ఎన్నికల వ్యూహకర్త పని నుంచి వైదొలిగానని పేర్కొన్నారు. చివరగా డీఎంకేకు రాజకీయ సలహాదారుగా వ్యవహరించానని గుర్తుచేశారు. విజయ్ పార్టీ అధికారంలోకి వచ్చేలోగా తాను తమిళం నేర్చుకుని ప్రసంగించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు.



ప్రశాంత్ కిశోర్‌తో కలిసి అభివాదం చేస్తున్న విజయ్

'గెట్ అవుట్' పేరుతో సంతకాల ఉద్యమం

కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని, రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దింపే లక్ష్యంతో 'గెట్ అవుట్' పేరుతో ఈ వేడుకల్లో సంతకాల ఉద్యమాన్ని విజయ్ ప్రారంభించారు. సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన 'గెట్ అవుట్' బ్యానర్‌పై విజయ్ తొలి సంతకం చేశారు. ఆ తర్వాత పార్టీ ప్రముఖులు సంతకాలు చేశారు. అయితే ప్రశాంత్ కిశోర్ మాత్రం ఆ బ్యానర్‌పై సంతకం చేయడానికి నిరాకరించడం చర్చనీయాంశమైంది.

ఆశలు ఆవిరి!

» సొరంగంలో చిక్కుకున్న 8 మందిని ప్రాణాలతో తీసుకురావడం కష్టమే!


ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కూలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో చిక్కుకున్న 8 మంది జాడ ఇప్పటికీ తెలియలేదు. శనివారం ఉదయం 8.30 గంటలకు ఈ ప్రమాదం జరగ్గా దాదాపు ఐదు రోజులుగా సహాయక చర్యలు కొనసాగుతున్నా... వారు ఏ ప్రాంతంలో చిక్కుకున్నారనే విషయంలో ఎలాంటి స్పష్టత రాలేదు. పుష్ కెమెరాలు, ప్రోబో స్కోప్‌లు వినియోగించడంతో పాటు సోనార్ ద్వారా సంకేతాలు కనుక్కోవాలని ప్రయత్నించినా ఇప్పటివరకు వారి ఆచూకీ తెలియలేదు. దీంతో వారిని రక్షించి బయటకు తీసుకురావడంపై ఆశలు ఆవిరవుతున్నాయని సహాయ చర్యల్లో పాల్గొంటున్న ఎన్‌డీఆర్ఎఫ్, ర్యాట్‌హోల్ మైనర్స్, ఇతర బృందాల సిబ్బంది అంటున్నారు. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం, సాయంత్రం మూడు సహాయ బృందాలు లోపలికి వెళ్లాయి. ఒక ఆస్పత్రికి చెందిన కొందరు సిబ్బంది కూడా వెళ్లినట్లు తెలుస్తోంది. ఒక్కో బృందంలో 26 మంది సభ్యుల వరకు ఉండగా ఉన్నతాధికారులు కూడా లోపలికి వెళ్లి వచ్చారు. బేరింగ్ వెనుక వైపు ఉన్న బేస్ వరకు వెళ్లి వచ్చిన వారు... అక్కడి పరిస్థితి చాలా భయానకంగా ఉందని చెబుతున్నారు. మంగళవారం రాత్రి ర్యాట్ హోల్ మైనర్స్ చాలా దగ్గర వరకు వెళ్లగా అక్కడ మట్టిపై సెగ్మెంట్ బ్లాకులు ఆనుకుని ఉండటంతో మరింత కూలిపోతుందనే ఆందోళనతో తిరిగి వచ్చారు.

నేటి నుంచి టీబీఎం కటింగ్

ప్రమాదం జరిగిన సమయంలో పెద్దఎత్తున సెగ్మెంట్ బ్లాకులు టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం)పై పడటంతో బేరింగ్ వెనక భాగం మొత్తం దెబ్బతింది. ఆ తర్వాత ఒత్తిడితో పైపులు, ఐరన్ షీట్లతో వ్యర్థాలు ముందుకు తోసుకువచ్చాయి. ఎయిర్ పంపింగ్, కన్వేయర్ బెల్టు కూడా దెబ్బతిన్నాయి. అయితే మూడో రోజునే కట్టర్లు, జనరేటర్లు లోపలకు తీసుకెళ్లినా ఆ వ్యర్థాలను మాత్రం తొలగించలేదు. వాటిని తొలగించకుండానే చిక్కుకుపోయిన వారి జాడ కనుక్కునేందుకు ప్రయత్నించారు. అయితే ఆ ప్రయత్నాలు ఫలించలేదు. టీబీఎంను కట్ చేయడానికి జయప్రకాశ్ అసోసియేట్స్ యాజమాన్యం కూడా ఇన్ని రోజులూ ఒప్పుకోనట్లు తెలుస్తోంది. భారీ ఖర్చుతో కూడుకోవడం, టీబీఎంను కట్ చేస్తే తిరిగి పనులు ప్రారంభించడం కష్టమవుతుందని భావించినట్లు సమాచారం. అందుకే మూడు రోజులుగా ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ, బుధవారం ఆ సంస్థ చైర్మన్ జయప్రకాశ్ గౌర్ ఢిల్లీ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో టన్నెల్ ప్రదేశానికి వచ్చారు. మంత్రులు, అధికారులు, కంపెనీ ప్రతినిధులతో చర్చల అనంతరం టీబీఎంను కట్ చేయాలని నిర్ణయించారు.

తుది దశకు సహాయ చర్యలు

» మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న 8 మందిని 2 రోజుల్లో సురక్షితంగా తీసుకురావడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు మంత్రి ఉత్తమ్ కుమా ర్ రెడ్డి తెలిపారు. సొరంగ మార్గంలో జరిగే ప్రమాదాలను ఎదుర్కొనడంలో అత్యంత ప్రతిభావంతమైన దేశ సరిహద్దు రహదారుల సంస్థ నిపుణులు సహా దేశంలో ని టన్నెల్ నిష్ణాతులందరినీ రప్పించామని చెప్పారు. దేశంలో అందుబాటులో ఉన్న అత్యున్నత ఇంజనీరింగ్, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ సహాయ చర్యల్లో వినియోగిస్తున్నామని తెలిపారు. బుధవారం ఉత్తమ్ విలేకరులతో మాట్లాడుతూ టన్నెల్‌లోని నీటిని భారీ పంపులతో బయటికి పంపడం, బురదను తొలగించి టీబీఎం ముందుభాగాన్ని చేరుకోనున్నట్లు తెలిపారు. టీబీఎం చివరి భాగాలను గ్యాస్ కట్టర్లు, ప్లాస్మా కట్టర్లతో తొలగించనున్నట్లు వివరించారు. అనంతరం ఆర్మీ, నేవీ, ర్యాట్ హోల్ మైనర్స్ సహాయంతో టన్నెల్‌లో చిక్కుకున్నవారిని వెలికితీస్తామని చెప్పారు. వారు సజీవంగా ఉన్నారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సహాయ కార్యక్రమాల్లో పాల్గొనే వారి భద్రతకు చర్యలు చేపట్టిన తర్వాత రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. టన్నెల్‌లో దాదాపు 200 మీటర్ల మేర బురద, నీరు పేరుకుపోయిందని, దాంతో సహాయ కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం కలిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది అత్యంత క్లిష్టమైన పరిస్థితి అని పేర్కొన్నారు.

గ్యాస్, ప్లాస్మా కట్టర్ల వినియోగం

టీబీఎంను మామూలు కట్టర్లతో కట్ చేయడం అసాధ్యం. ఇప్పటికే టన్నెల్‌లోకి గ్యాస్ కట్టర్లను తరలించగా గురువారం మధ్యాహ్నంలోపు ప్లాస్మా కట్టర్‌ను కూడా తీసుకురానున్నారు. వదులుగా ఉన్న సెగ్మెంట్ బ్లాకులు కింద పడకుండా ఆసరా పెట్టి.. తర్వాత మట్టిని, సిల్టును తొలగించనున్నారు. ఆరు 150 హెచ్‌పీ పంపుల ద్వారా నీటిని బయటకు తోడే ప్రక్రియ కొనసాగుతోంది.

దక్షిణాదిలో అప్పుడే వేడి సెగలు

» కర్ణాటక, కేరళ, ముంబైలో వడగాడ్పులు

» ఏపీలో కోస్తా, సీమల్లో అధిక ఉష్ణోగ్రతలు

» గాలిలో తేమ శాతం తగ్గడమే కారణం

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభం కాకముందే భానుడు భగ్గున మండుతున్నాడు. దక్షిణ భారతంలోని అనేక ప్రాంతాల్లో అప్పుడే వేడి సెగలు మొదలయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు మాడుపగిలేలా ఎండలు కాస్తున్నాయి. కేరళ, కర్ణాటక, దానికి ఆనుకుని మహారాష్ట్రలోని ముంబై నగరంలో వడగాడ్పులు వీచినట్టు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) పేర్కొంది. కొన్నిచోట్ల పగటి ఉష్ణోగ్రతలు 39 నుంచి 40 డిగ్రీల వరకూ నమోదవుతున్నాయి. ప్రధానంగా అర్బన్ ప్రాంతాల్లో వేడి ఎక్కువగా ఉంది. ఫిబ్రవరిలో వడగాడ్పులు వీయడం అసాధారణమేనని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. పగటి ఉష్ణోగ్రతలే కాకుండా రాత్రి కూడా సాధారణం కంటే రెండు నుంచి నాలుగు, అక్కడక్కడా ఐదారు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ నెలలో పగటి ఉష్ణోగ్రతలు దేశంలోనే అత్యధికంగా ఎక్కువ రోజులు ఏపీలోని రాయలసీమ, కోస్తా, కేరళ, కర్ణాటకల్లో నమోదయ్యాయి. ఉత్తరాదితో పోల్చితే దక్షిణాదిలో ముందుగానే వేసవి ప్రారంభం కావడం సాధారణమే అయినా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదుకు వాతావరణంలో మార్పులే కారణమని పేర్కొంటున్నారు. కొన్ని రోజులుగా దక్షిణాదితోపాటు పశ్చిమ, మధ్యభారతంలో గాలిలో తేమ శాతం తక్కువగా నమోదవుతోంది. గాలిలో తేమశాతం 40 నుంచి 50 వరకూ నమోదవుతుండడంతో పొడి వాతావరణం నెలకొని ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీంతో వడగాడ్పులు వీచేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. బెంగళూరుతోపాటు కేరళ, కర్ణాటక, రాయలసీమలో కొన్నిచోట్ల గాలిలో తేమశాతం గణనీయంగా పడిపోతోంది. బుధవారం కర్నూలులో 20, అనంతపురంలో 25, నంద్యాలలో 30, కడపలో 37 శాతం నమోదైంది. తీర ప్రాంతమైన బాపట్లలో 33, నరసాపురంలో 24 శాతానికి పడిపోవడంతో ఆయా చోట్ల వాతావరణం పొడిగా మారింది.

నగరాల్లో పెరిగిన వేడి

దశాబ్దకాలంగా వానాకాలంలో వర్షం కురిసే సమయం/రోజులు తగ్గిపోతున్నాయి. ఒకవేళ వర్షం పడితే కుంభవృష్టిగా కురుస్తోంది. దీంతో వర్షం నీరు భూమిలో ఇంకిపోయే అవకాశం తక్కువగా ఉంది. నగరాలు/పట్టణాల్లో వర్షపు నీరు ఇంకే యంత్రాంగం పూర్తిగా తగ్గుతుందని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం అధికారి సముద్రాల జగన్నాథకుమార్ పేర్కొన్నారు. నగరాలు కాంక్రీట్ జంగిల్స్‌గా మారడం, డ్రైన్లు మొత్తం సిమెంట్‌తో నిర్మించడం, ఖాళీ ప్రదేశాలు తగ్గిపోవడం, ప్లాస్టిక్ పెరగడం, భూగర్భ జలాలు తగ్గడంతో వేడి వాతావరణం పెరుగుతుందన్నారు. వాహనాల కాలుష్యం కూడా కారణమన్నారు. బెంగళూరు, ముంబై మహా నగరాలతోపాటు కేరళలో పలుచోట్ల వడగాడ్పులు వీయడానికి వాతావరణంలో మార్పులతోపాటు స్థానికంగా నెలకొనే పరిస్థితులే కారణమని వివరించారు. మార్చిలో కూడా ఇదే స్థాయిలో ఎండలు కొనసాగుతాయన్నారు. కాగా పసిఫిక్ మహా సముద్రంలో ప్రస్తుతం లానినా కొనసాగుతున్నా.. దాని ప్రభావంతో ఎండలు తగ్గుతాయా? లేదా?... అన్నదానిపై వాతావరణ నిపుణుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. ప్రస్తుతం లానినా బలహీనంగా ఉన్నందున వేసవి తీవ్రత తగ్గేందుకు అవకాశాలు తక్కువగా ఉంటాయని కొందరు అభిప్రాయపడుతున్నారు. మార్చిలో వర్షాలు కురిసే ప్రాంతాల్లో భూమిలో తేమ శాతం పెరిగి కొన్ని రోజులపాటు వేడి తగ్గుతుందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం దేశంలో జనవరి ఒకటో తేదీ నుంచి బుధవారం వరకు వర్షపాతం 72 శాతం తక్కువగా నమోదైందని గుర్తుచేస్తున్నారు. దీంతో భూ వాతావరణంలో తేమ శాతం తక్కువగా ఉంటోంది.

హోంవర్క్ చేయలేదని వాతలు

» ఒంగోలులో ట్యూషన్ టీచర్ దారుణం.. కేసు నమోదు


విద్యార్థి పిరుదులపై అట్లకాడ వాతలు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): హోం వర్క్ చేయడం లేదన్న కారణంతో ఓ విద్యార్థికి ట్యూషన్ టీచర్ అట్లకాడ కాల్చి వాతలు పెట్టింది. ఇదేమిటని ప్రశ్నించిన తల్లిదండ్రులను ఆమె భర్త చంపుతానని బెదిరించాడు. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే.. ఒంగోలులోని గంటాపాలెంలో నివాసం ఉండే మూడో తరగతి విద్యార్థి.. ఇంటి ఎదురు ఉండే సాబీరా వద్దకు ట్యూషన్‌కు వెళ్తుంటాడు. ఈ నెల 20న ఆ విద్యార్థి హోం వర్క్ చేయలేదన్న కోపంతో ట్యూషన్ టీచర్ సాబీరా అట్లకాడ కాల్చి పిరుదులపై వాతలు పెట్టింది. తీవ్రమైన గాయాలవ్వడంతో రోదిస్తూ ఇంటికి వెళ్లిన విద్యార్థి.. ట్యూషన్ టీచర్ నిర్వాకాన్ని తల్లికి చెప్పాడు. తల్లిదండ్రులు సాబీరాకు ఫోన్ చేసి ప్రశ్నించారు. సరైన సమాధానం చెప్పకపోగా సాబీరా భర్త తమను చంపుతామని బెదిరించాడని విద్యార్థి తల్లి ఒంగోలు వన్‌టౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, విద్యార్థిని ఆస్పత్రికి తరలించారు.

అధిక వడ్డీ, చిట్టీల పేరుతో

రూ. 70 కోట్లకు కుచ్చుటోపీ!

» కుటుంబ సభ్యులతో ఉడాయించిన తాపీమేస్త్రీ

అమీర్‌పేట, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ ఇస్తానని, చిట్టీలు కట్టించి...డబ్బులు వసూలు చేసి రూ.70 కోట్లకు కుచ్చుటోపీ పెట్టాడో వ్యక్తి. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా గుత్తికి చెందిన పుల్లయ్య రెండు దశాబ్దాలుగా హైదరాబాద్ దాసారం గుడిసెల సమీపంలోని అపార్ట్‌మెంటులో నివాసం ఉంటున్నాడు. ఎస్ఆర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో భవన నిర్మాణ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. స్థానికులతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకుని... బీకేగూడ, ఎస్ఆర్ నగర్‌లో 15 ఏళ్లుగా చిట్టీ, ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అధికవడ్డీ పేరు చెప్పి దాదాపు 300 మందికి పైగా ఖాతాదారులను కూడగట్టుకున్నాడు. డబ్బు కోసం ఖాతాదారుల నుంచి ఒత్తిడి పెరగడంతో పుల్లయ్య ఈ నెల 24, 25, 26వ తేదీల్లో చెల్లిస్తానంటూ నమ్మబలికాడు. 23వ తేదీ సాయంత్రం తన ఫార్చునర్ వాహనాన్ని ఇంట్లోనే వదిలి, ఓ క్యాబ్‌లో తన కుటుంబ సభ్యులతో వెళ్లిపోయినట్టు తెలుస్తోంది. మొత్తంగా వసూలు చేసిన దాదాపు రూ.70 కోట్లతో ఉడాయించినట్టు చెబుతున్నారు. పుల్లయ్య బాధితులు బల్కంపేట, ఎస్ఆర్‌నగర్‌కు మాత్రమే పరిమితం కాలేదు. అతని స్వస్థలమైన అనంతపురం జిల్లాలోని గుత్తి, కర్నూల్ జిల్లాలో కూడా ఉన్నారు. తాము దాచుకున్న నగదుతో పాటు, అధిక వడ్డీ వస్తుందన్న ఆశతో తమకు తెలిసిన వారి నగదును కూడా అతని దగ్గర డిపాజిట్లు చేయించిన వారి సంఖ్య ఎక్కువగా ఉంది. పుల్లయ్య ఉడాయించిన విషయం తెలుసుకుని బాధితులు గగ్గోలు పెడుతూ బీకే గూడలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. ఈ మేరకు బాధితులు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

ఇంటి నుంచి పనిచేస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

కల్పించాలని యోచిస్తోంది. అందులో భాగంగా మొదట వర్క్ ఫ్రమ్ హోం చేయడంపై పొరుగు రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల అభిప్రాయాన్ని తెలుసుకుంటోంది. ఉద్యోగుల ఆసక్తిని తెలుసుకునేందుకు రాష్ట్ర ఐటీ శాఖ సర్వే నిర్వహిస్తోంది. ఆ తర్వాత ప్రైవేటు ఐటీ, ఐటీ ఆధారిత సంస్థల యాజమాన్యాలతో సంప్రదింపులు జరపనుంది.

కొవిడ్ సమయంలో...

కొవిడ్ సమయంలో ఉద్యోగులు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఐటీ కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోంను ప్రోత్సహించాయి. కొవిడ్ తగ్గాక క్రమంగా మళ్లీ పాత పద్ధతే వచ్చినా, ఇప్పటికీ కొన్ని కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోం అమలు చేస్తున్నాయి. అయితే వారమంతా గాక వారానికి ఒకట్రెండు రోజులు ఇంటి నుంచి పనిచేయించుకుంటున్నాయి. అలాగాక పూర్తిస్థాయిలో వర్క్ ఫ్రమ్ హోంను ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఈ విధానానికి సుముఖత చూపుతున్నారు. మహిళలు ఇంటి పని చేసుకుంటూనే ఉద్యోగాలు చేసుకునే వెసులుబాటు ఉండాలని భావిస్తున్నారు. రాష్ట్రానికి చెందిన యువత ఐటీ ఉద్యోగాల కోసం కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు వలసపోవడాన్ని నివారించి స్వగ్రామాల్లో ఇంటి వద్ద నుంచే పనిచేసేందుకు అవకాశం కల్పించాలని ఐటీ శాఖ అధికారులకు చంద్రబాబు సూచించారు. అదేవిధంగా రాష్ట్రంలోనే విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో పనిచేస్తున్న వారికి కూడా సొంతూళ్లలో సదుపాయాలు కల్పించాలని సర్కారు యోచిస్తోంది. రాష్ట్ర ఐటీ శాఖ ఈ దిశగా అడుగులు వేస్తోంది. ఉద్యోగుల నుంచి సానుకూలత వ్యక్తమైతే ఐటీ కంపెనీల యాజమాన్యాలతో చర్చలు జరపనుంది.

ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించదు

ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోం ప్రోత్సహించి, తగిన సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ చెప్పారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ.. ఇంటి నుంచి పనిచేసేందుకు ఎంత మంది సుముఖంగా ఉన్నారో తెలుసుకునేందుకు సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ విషయంపై యాజమాన్యాలతోనూ మాట్లాడుతామని వివరించారు. ఈ విధానం ఐటీ, ఐటీ ఆధారిత ప్రైవేటు సంస్థలలో పనిచేసే ఉద్యోగుల కోసమేనని.. ప్రభుత్వ శాఖల్లో పని చేసే వారికి వర్తించదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రతిరోజూ ఆఫీసులకు రావాల్సిందేనని, మినహాయింపులు ఉండవన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.